అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 19-3 -2018
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 80 | Published fromHyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | W O W | 12 + 16 పేజీలుmవెల : 5.00W

టిక్కెట్లు కావాలంటే..

హైదరాబాద్‌లో కాదు.. జనంలో ఉండాలె...

- పంచాగకర్త జెప్పిన్దాన్నిబట్టి మనది మిగులు రాష్ట్రమే...
- ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి : ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి


వివరాలు 9లో

పొలిటికల్ ఫన్‌చాంగం

- ఎవరి డబ్బా వారిదే
- అందరూ దేశాన్ని ఏలే వారే
- 'నొప్పించక...తానొవ్వక' తీరులో పంచాంగ శ్రవణాలు



ఎస్ఎస్ ఆర్ శాస్త్రి

"రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. ప్రభుత్వ పథకాలకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తుంది. తిరిగి అధికారంలోకి వస్తారు"...ఇది అధికారపార్టీల సర్కారు పంచాంగం. "రాష్ట్రంలో రాజకీయమార్పు తథ్యం. ఇప్పుడున్న ప్రభుత్వం కూలిపోయి ఆ స్థానంలో మీ పార్టీ అధికారంలోకి వస్తుంది. ప్రజలు పడుతున్న ఇబ్బందుల్ని ఇప్పటి సర్కారు పట్టించుకోవట్లేదు"....ఇది ...9లో



రాలుతున్న మామిడి ఆశలు



- వాతావరణ మార్పులతో ఆలస్యంగా పూత
- తగ్గనున్న 1.47 మెట్రిక్ టన్నుల దిగుబడి !

కలిసిరాని కాలం



నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

రాష్ట్రంలో మామిడి రైతులు విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. డిసెంబర్‌లో రావాల్సిన మామిడి పూత వాతావరణ మార్పులతో మార్చిలో వచ్చింది. అసలే రెండు నెలలు ఆలస్యంతో ఇబ్బందులు పడుతున్న మామిడి రైతులను మూడ్రోజులుగా రాష్ట్రంలో పలు జిల్లాల్లో కురుస్తున్న చిరుజల్లులు, ఓ మోస్తరు వర్షాలు మరింత కష్టాల్లోకి నెట్టాయి. అందువల్ల ఈ ఏడాది 1.45లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి తగ్గే వీలుందని ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,79,128 ఎకరాల్లో మామిడి తోటలు సాగుచేస్తున్నారు.

సాధారణ పరిస్థితుల్లోనైతే 4,82,457 మెట్రిక్ టన్నుల మామిడి కాయ దిగుబడి వస్తుంది. ఈ ఏడాది పూత ఆలస్యంగా రావడం, కురుస్తున్న పొగమంచు, రెండ్రోజులుగా రాష్ట్రంలో తుపాను ప్రభావంతో చిరుజల్లులతో పూత రాలిపోయే అవకాశముందని ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నారు. దీనికి తోడు బూడిద తెగులు సోకుతోంది. దాదాపు 30శాతం మేర పంట దిగుబడి తగ్గే వీలుంద ంటున్నారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 21మండలాల్లో 43,195ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. సాధారణ పరిస్థితుల్లోనైతే 55,180 మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడులు సాధిస్తున్న జిల్లాగా రాష్ట్రంలో ముందు వరుసలో ఉంది.

తొమ్మిది జిల్లాల్లో తీవ్ర ప్రభావం...

మామిడి తోటలకు ప్రసిద్ధి చెందిన రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో ఈ ఏడాది దిగుబడిపై ప్రభావం చూపనుంది. ఖమ్మం, ఆ తర్వాత జగిత్యాల, మంచిర్యాల, సూర్యాపేట, సిద్దిపేట, రంగారెడ్డి, యాదాద్రి, వనపర్తి, మహబూబాబాద్ తదితర జిల్లాల్లో అత్యధిక మామిడి సాగు ఉంది. మామిడి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మండలానికి కనీసం ఇద్దరు ఉద్యాన విస్తరణాధికారులు ఉండాలి. కానీ చాలా జిల్లాల్లో రెండు, మూడు మండలాలకు ఒక విస్తరణాధికారి ఉన్నారు. వారు కూడా ...9లో

చెట్లకు పూత రావట్లేదు



మామిడి చెట్లకు పూత తక్కువగా వస్తోంది. దీంతో దిగుబడి తగ్గే అవకాశం ఉంది. మంచు కూడా బాగా కురవటంతో బుడిద తెగులు సోకింది. ఏ మందు పిచికారీ చేయాలో చెప్పేవారు లేరు.

పాసంగులపాటి నర్సింహారావు
(నర్సింహాపురం, చింతకాని మండలం)

'హౌస్‌బిల్డింగ్' అక్రమార్కులకు నోటీసులు

- స్థల పరిశీలన కోసం ప్రత్యేకాధికారి నియామకం
- ఎట్టకేలకు కదిలిన పాఠశాల విద్యాశాఖ
- 13 మందికి చెందిన ఫైల్ మాయం!

వివరాలు 6లో

బీజేపీ పాలనలో వృద్ధులకు భద్రత కరువు

- 40 శాతం నేరాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లోనే

వివరాలు 2లో

బహుజనులు ఏకమవ్వాలి

- సామాజిక న్యాయం కోసం పోరాడుదాం
- టీమాస్‌తో రాజకీయ శక్తిగా ఎదగాలి: కంచ ఐలయ్య



మాట్లాడుతున్న ఐలయ్య
వివరాలు 9లో

పెండ్లింట విషాదం

- చెరువులో మునిగి ఐదుగురు మృతి
- మెదక్ జిల్లా కన్నారంలో ఘటన
- పరిశీలించిన తూప్రాన్ డీఎస్పీ వెంకటేశ్వర్లు


వివరాలు 9లో


మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

2019లో... పాండవ కౌరవ యుద్ధమే..!

- బీజేపీ పాలనలో భయాందోళనల్లో ప్రజలు
- ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..?

వివరాలు 2లో

న్యాయమా నీవెక్కడ ?

- లక్ష దాటిన బాలికలపై లైంగికదాడి కేసులు
- కేవలం 229 కేసుల్లోనే తీర్పు
- 2016లో 30వేలకుపైగా కొత్త కేసులు నమోదు
- సమాచారాన్ని సేకరించిన సుప్రీంకోర్టు

ప్రతీరోజూ ఎక్కడో ఒకచోట బాలికలపై లైంగికదాడుల వార్తల్ని వినాల్సివస్తోంది. ఇవేవీ పాలకుల, ప్రభుత్వాల చెవిన మాత్రం పడటం లేదు. సుప్రీంకోర్టు స్వయంగా కలుగజేసుకొని...పెండింగ్ కేసులు ఎన్ని ఉన్నాయని హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్‌ను అడిగితే...లక్షకు పైగా కేసులు ఉన్నాయని తేలింది. 'పోక్సో' చట్ట ప్రకారం బాలికలపై లైంగికదాడి కేసుల విచారణ ఒక్క సంవత్సరంలో పూర్తి చేయాలి. అలాంటిది ట్రయల్ కోర్టుల్లో లక్షకుపైగా కేసులు పెండింగ్‌లో ఉండటమేందని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.


(ఫైల్)

న్యూఢిల్లీ: రోజు రోజుకీ దేశవ్యాప్తంగా బాలికలపై లైంగికదాడులు పెరిగిపోతున్నాయి. దానికి తోడు కేసుల విచారణలో జాప్యం పెరుగుతోంది. 2016లో బాలికలపై లైంగికదాడులకు పాల్పడ్డ కేసులు దాదాపు లక్షకు చేరుకున్నాయి. అయితే ఆ ఏడాది ట్రయల్ కోర్టు తీర్పుకు నోచుకున్న కేసులు 229 మాత్రమే. ఈ మేరకు సమాచారం చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని న్యాయమూర్తులు ఎ ఎం ఖాన్‌విల్కార్, డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం దృష్టికి వచ్చింది. లైంగికదాడుల్లో బాలికలు బాధితులుగా ఉండి, కఠినమైన పోక్సో(ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రెన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్) చట్టం కింద నమోదై, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సేకరించి నాలుగు వారాల్లోగా అందజేయాలని దేశవ్యాప్త హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్స్‌కు ధర్మాసనం ...9లో



కడుపునకు అన్నం తింటలేరా..

ఎస్టీ అయితేంటీ... రుణం చెల్లించరా ?

- రూ. 20 వేల కింద కుట్టుమిషన్ గుంజుకెళ్లిన మేనేజర్
- ఎక్కువ మాట్లాడితే ఇల్లు జప్తు చేస్తామని హెచ్చరిక
- పరువు పోయిందని మేనేజర్‌పై లబ్దిదారు కేసు
- నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరులో ఘటన




వివరాలు 9లో

"కడుపుకు అన్నం తింటలేరా? గడ్డి తింటున్నారా? బ్యాంకులో నాలుగేండ్ల కిందట అప్పు తీసుకుని చెల్లించరా.. మీరు ఎస్టీ అయితే రుణం చెల్లించొద్దని ఎక్కడైనా ఉందా? ప్రభుత్వం మీకు సబ్సిడీ రుణం ఇవ్వడమే తప్పు. మీ దగ్గర ఏ వస్తువున్నా తీసుకెళ్తాను. డబ్బు కట్టకపోతే ఇంటినీ జప్తు చేస్తాం.." అని మహిళపై బ్యాంకు మేనేజరు తమ ప్రతాపం చూపించాడు. లక్షల రూపాయల రుణం తీసుకున్న వారిని వదిలేసి పేద కుటుంబంపై బ్యాంకు వారు దాడి చేయడం గమనార్హం. వివరాలిలా ఉన్నాయి...

2019లో... పాండవ కౌరవ యుద్ధమే..!

- బీజేపీ పాలనలో భయాందోళనల్లో ప్రజలు
- ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..?
- ఆర్ఎస్ఎస్, బీజేపీపై రాహుల్ నిలదీత



న్యూఢిల్లీ: రాబోయే ఎన్నికల్లో అధికారం కోసం ఎగబడుతున్న కౌరవులకు(బీజేపీకి), ధర్మం కోసం పోరాడుతున్న పాండవులకు (కాంగ్రెస్‌కు) మధ్య యుద్ధమని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ 84వ ప్లీనరీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్, బీజేపీపై ఆయన ఆరోపణాస్త్రాలు సంధించారు. రాహుల్ మాట్లాడుతూ... 'దేశంలో అతిపెద్ద పెట్టుబడిదారుడి పేరుకు, ప్రధాని మోడీ పేరుకు ఓ పోలిక ఉన్నది. ఒక మోడీకి వ్యాపారం చేసుకునేందుకు రూ. 30వేల కోట్లు ఇస్తే.. మరో మోడీ ప్రధాని రాజకీయాల్లో రాణించేందుకు, ప్రచారం చేసుకునేందుకు డబ్బులు ఇస్తారంటూ' ప్రధానిపై విరుచుకుపడ్డారు. దేశంలో ఆశ్రిత పెట్టుబడిదారులకు ప్రధాని కొమ్ము కాస్తున్నారన్నారు. 'మీరు దేశంలోని బ్యాంకులనుంచి రూ.33 వేల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోండి. మిమ్మల్ని బీజేపీ ప్రభుత్వం కాపాడుతుంది' అంటూ పరోక్షంగా దేశం వదిలి పారిపోయిన వారిని ప్రభుత్వం రక్షిస్తోందని ఆరోపించారు.

ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ దీని గురించి ఏం మాట్లాడబోరని.. జైట్లీ, ఆయన కూతురు బడా పెట్టుబడిదారులు కాబట్టే వారు మాట్లాడరని చెప్పారు. ఆర్థిక వ్యవస్థలో దూసుకుపోతున్నామని బీజేపీ పదే పదే చెబుతోందని, కానీ దేశంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే.. మోడీ వారిని యోగా చేయమం టున్నారని విమర్శిం చారు. ప్రధాని దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తు న్నారని.. ప్రధాన సమస్యలు ముందు కొచ్చినప్పుడు ఆయన మౌన ముని అవతారం ఎత్తుతున్నారని ఎద్దేవా చేశారు.

దేశంలోని అన్ని వర్గాల ప్రజలు బీజేపీని చూసి భయాందోళనలకు గురవుతున్నారన్నారు. సంఘ్ అరాచక శక్తులు.. ముస్లింలను పాకిస్థాన్‌కు వెళ్లిపోవాలని సూచిస్తూ విధ్వంస కాండను సృష్టిస్తున్నాయని చెప్పారు. తమిళుల భాషపై దాడి జరుగుతోందన్నారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఆహారపు అలవాట్లపై బీజేపీ దాడి చేస్తోందన్నారు. దేశంలో ప్రశ్నించిన వారిపై హత్యలు చేయిస్తున్నారని.. కల్బుర్గీ, గౌరీ లంకేశ్ హత్యల్ని గుర్తు చేశారు. దేశ చరిత్రలోనే తొలిసారి నలుగురు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు న్యాయం కోసం ప్రజల ముందుకొచ్చారని చెప్పారు.

బీజేపీ పాలనలో నిజాయితీ గల వ్యాపారస్తుల్ని బెదిరిస్తూ అవినీతి అధికారులను ప్రోత్సహిస్తున్నారన్నారు. హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి బీజేపీకి అధ్యక్షుడుగా ఉన్నాడంటూ అమిత్‌షాపై ఆరోపణలు చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి దేశంలోని పార్లమెంట్, న్యాయ, పోలీసు వ్యవస్థల్ని నాశనం చేయాలని ప్రయత్నిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీలో నాయకులకు, కార్యకర్తలకు మధ్య ఓ అడ్డుగోడ ఉన్నదని.. సీనియర్ నాయకుల సాయంతో ఆ గోడను బద్దలు కొట్టి అందరినీ కలుపుకునిపోతానని హామీ ఇచ్చారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముగ్గురు ఎయిమ్స్ డాక్టర్లు మృతి

- యమునా ఎక్స్‌ప్రెస్ హైవేపై రోడ్డు ప్రమాదం



న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాదాల కు అడ్డాగా మారిన యమునా ఎక్స్‌ప్రెస్ హైవే (ఢిల్లీ–ఆగ్రా) మరోసారి నెత్తురోడింది. మిత్రుడి పుట్టిన రోజు వేడుకల నిమిత్తం ఢిల్లీ నుంచి ఆగ్రాకు ఏడుగురు డాక్టర్లు బయల్దేరారు. ఆదివారం రాత్రి మథుర వద్ద భారీ కంటైనర్ వారి వాహనాన్ని ఢీకొనడం తో ముగ్గురు డాక్టర్లు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. పోలీసుల కథనం మేరకు... ఢిల్లీ నుంచి ఆగ్రాకు ఆది వారం రాత్రి ఇన్నోవాలో బయల్దేరిన ఎయిమ్స్ వైద్యుల బృందం.. 2 గంటల సమీపంలో సురీర్ కొత్వాలీ వద్ద భారీ కంటైనర్ ఢీకొనడంతో యశ్ ప్రీత్(25), హేంబాలా(26), హర్షద్(35)లు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల ద్వారా సమాచార మందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరు కుని గాయపడిన వారిని మథురలోని స్థానిక ఆస్ప త్రికి తరలించారు. బాధితుల పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని ఢిల్లీకి తరలించారు.

గడిచిన మూడేండ్లలో... సబర్బన్ రైల్వే పరిధిలో 9,520 మంది మృతి

- ముంబయి రైల్వే వెల్లడి

ముంబయి: గడిచిన మూడేండ్లలో దేశంలోని సబర్బన్ రైల్వే పరిధిలో జరిగిన ప్రమాదాల్లో 9,520 మంది మృతి చెందినట్టు ముంబయి రైల్వే పోలీస్ కమిషనరేట్ వెల్లడించింది. వీటిలో రైల్వే లైన్ దాటుతున్నప్పుడు, రైలు నుంచి దిగుతుండగా జరిగిన ప్రమాదాలే అధికంగా ఉన్నాయని తెలియజేసింది. అధికారిక లెక్కల ప్రకారం.. పట్టాలు దాటుతున్నప్పుడు జరిగిన ప్రమాదాల్లో 5,250 మంది మృతి చెందగా, రైల్లోంచి కిందికి దిగుతుండగా చోటు చేసుకున్న ప్రమాదాల్లో 2,117 మంది చనిపోయారు. ఇవేకాక రైల్లో ప్రయాణిస్తున్నప్పుడు రైల్వే పోల్‌లకు తాకి 2,117 మంది మరణించారు. మొత్తంగా 2015లో 3,304 మంది, 2016లో 3,202 మంది, 2017లో 3,014 మంది మృతి చెందినట్టు అధికారిక లెక్కలు వెల్లడించాయి. సబర్బన్ రైల్వే దేశ వ్యాప్తంగా 2,979 రైలు సర్వీసులతో నిత్యం 76 లక్షల మంది ప్రయాణీకులను తమ గమ్యస్థానాలకు చేర్చుతోంది.

సరిహద్దుల్లో పాక్ కాల్పులు...

- ఐదుగురు పౌరులు మృతి, ఇద్దరికి గాయాలు



శ్రీనగర్: పాకిస్థాన్ ఆర్మీ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తునే ఉంది. తాజాగా జమ్మూకాశ్మీర్‌లోని పూంచ్ జిల్లా బాల్‌కోట్ సెక్టార్‌లో పాక్ బలగాలు కాల్పులకు తెగబడ్డాయి. ఈ కాల్పుల్లో ఐదుగురు పౌరులు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. ఆదివారం ఉదయం 7:45 గంటల ప్రాంతంలో దేవ్‌తాదార్ గ్రామ సమీపంలో నియంత్రణ రేఖ వెంబడి ఉన్న ఆర్మీ స్థావరాలు, జనావాసాలను లక్ష్యంగా చేసుకుని పాక్ ఆర్మీ కాల్పులు జరిపింది. దీనికి ప్రతిస్పందనగా భారత బలగాలు దీటుగా బదులిచ్చాయి. పాక్ బలగాల కాల్పుల్లో చౌదరీ మహ్మద్ రంజాన్ అనే స్థానికుడితో పాటు అతని భార్య, ముగ్గురు కుమారులు ప్రాణాలు కోల్పోయారు. అలాగే రంజాన్ ఇద్దరు కూతుర్లు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించినట్టుగా జమ్మూకాశ్మీర్ డీజీపీ వేద్ తెలిపారు. పాక్ ఆర్మీ దుశ్చర్యను కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ తీవ్రంగా ఖండించారు. భారత ప్రభుత్వం భద్రతా బలగాలకు పూర్తి స్వేచ్ఛను కల్పించిందని, వారు తగిన రీతిలో స్పందిస్తారని ఆయన తెలిపారు.

బీజేపీ పాలనలో వృద్ధులకు భద్రత కరువు

- 40 శాతం నేరాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లోనే



న్యూఢిల్లీ: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నేరాలు రాజ్యమేలుతున్నాయి. దేశంలో వృద్ధులపై నేరాల్లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లు ముందు వరుసలో ఉన్నాయి. ఈ రెండు రాష్ట్రాలు బీజేపీ పాలిత రాష్ట్రాలే కావడం గమనార్హం. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం..గడిచిన మూడేండ్లలో వృద్ధులపై నేరాలకు సంబంధించి నమోదైన కేసుల్లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచే 40 శాతం ఉన్నాయంటే అక్కడి పరిస్థితి ఎంత దయనీయంగా ఉన్నదో అర్థమవుతున్నది. 2014లో దేశవ్యాప్తంగా నమోదైన 18,714 కేసు ల్లో ఈ రెండు రాష్ట్రాల నుంచి 7,419(39.64 శాతం) ఉన్నాయి. 2015లో 20,532, 2016లో 21,410 కేసులు నమోదు కాగా.. ఎంపీ, మహారాష్ట్ర నుంచి వరుసగా 8,017, 8,571(40.03 శాతం) ఉన్నాయి. దీన్ని బట్టి ఏడాది కాలంలో ఈ రాష్ట్రాల్లో 500 కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. వృద్ధులపై నేరాల్లో మహారాష్ట్ర దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నది. మధ్యప్రదేశ్ తర్వాతి వరుసలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ ఉన్నాయి. జమ్మూకాశ్మీర్‌లో వృద్ధులపై నేరాలకు సంబంధించి గడిచిన మూడేండ్లలో ఒక్క కేసూ నమోదు కాకపోవడం గమనార్హం.

తమిళనాడు ప్రభుత్వ నిర్లక్ష్యం

- రూ.15.45 కోట్ల కేంద్ర నిధుల్ని నష్టపోయిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు

చెన్నై: తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 51వేలమంది ఎస్సీ,ఎస్టీ విద్యార్థినులు రూ.15.45 కోట్ల ప్రోత్సా హక నిధుల్ని కోల్పోయారు. సెకండరీ పాఠశాలల్లో చదివే 14–18 ఏండ్ల వయ సు విద్యార్థినుల కోసం జాతీయ ప్రోత్సా హక పథకాన్ని 2008–09లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. బాలికల డ్రాపవుట్స్‌ను తగ్గించేందుకు ఈ పథకాన్ని ఉద్దేశించారు. ఒక్కో విద్యార్థిని ఖాతాలో ఏటా రూ.3000 జమ చేయాలి. అయితే, కేంద్రం నుంచి తమిళనాడుకు దాదాపు 51వేలమంది విద్యార్థినుల కోసం విడుదల చేసిన రూ.15.45 కోట్లను వెనక్కి పంపించినట్టు తేలింది. దీనిపై పరిశీలన జరపగా..విద్యార్థినుల బ్యాంక్ ఖాతాల వివరాలను (ఐఎఫ్ఎస్‌సీ కోడ్, వగైరా) సమర్పించడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని స్పష్టమైంది.

కెమికల్ ఫ్యాక్టరీలో మంటలు

- ఒకరు మృతి, ఏడుగురికి తీవ్ర గాయాలు

చండీగఢ్: హర్యానాలోని సోనిపాట్ జిల్లాలో రాయ్ ఇండస్ట్రియల్ ఏరియాలోని కెమికల్ ఫ్యాక్టరీలో ఆదివారం మంటలు చెలరేగాయి. మంటల్లో ఒక కార్మికుడు సజీవదహనం కాగా కొన్ని అస్థికలు లభించాయి. ఇందులో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం..సోనిపాట్‌లో ఇండస్ట్రియల్ ఏరియాలోని కెమికల్ ఫ్యాక్టరీకి చెందిన మూడు యూనిట్‌లలో మంటలు చెలరేగాయి. ఇందులో ఓ కార్మికుడు మంటల్లో సజీవదహనం కాగా ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. లభించిన అస్థికలు ఎంతమందివో తెలియరాలేదు, వాటని ఫోరెన్సిక్ పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక యంత్రాల సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఫ్యాక్టరీలో పనిచేసేవారిలో చాలామంది ఉత్తరప్రదేశ్ నుంచి వలస వచ్చినవారని పోలీసు అధికారి తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శశికళ భర్త

- పరిస్థితి విషమం

చెన్నై: ఏఐఏడీఎంకే నాయకురాలు వికె శశికళ భర్త ఎం. నటరాజన్(74) పరిస్థితి విషమంగా ఉంది. తీవ్ర ఛాతి సంబంధ నొప్పితో బాధ పడుతున్న ఆయన ఈ నెల 16 చెన్నైలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేరారు. వెంటిలేటర్ కింద చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు ఆదివారం వెల్లడించాయి. కాలేయ, కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స నిమిత్తం గతేడాది అక్టోబర్‌లో ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స అనంతరం డిశ్చార్జీ అయ్యారు. బెంగళూరులోని కేంద్ర కారాగారంలో నాలుగేండ్ల శిక్షను అనుభవిస్తున్న శశికళ అత్యవసర పెరోల్ పై వచ్చి భర్త నటరాజన్‌ను కలుసుకున్నారు. కాగా, ఆయనకు తీవ్ర కాలేయ, కిడ్నీ, ఊపిరితిత్తుల సమస్యతో గతేడాది అక్టోబర్‌లో వెంటిలేటర్ల సహాయంతో డాక్టర్లు ట్రాకియోస్టమి నిర్వహించారు.

అంతర్జాతీయం

కుర్దు ప్రాంతాలపై టర్కీ దాడులు



ఆఫ్రిన్ : సిరియాలోని కుర్దు ప్రాబల్య ప్రాంతాలపై టర్కీ సైన్యం దాడుల్ని తీవ్రతరం చేసింది. ఆఫ్రిన్ నగరంలో టర్కీ సేనలు పాగా వేశాయి. టర్కీ సైన్యం అండదండలతో సిరియాలో పోరాటం సాగిస్తున్న ప్రయివేటు సేనలు ఈ నగరంలోని కుర్దులను వెళ్లగొడుతున్నాయి. అనంతరం ప్రముఖ కుర్దు నాయకుడి విగ్రహాన్ని సేనలు నేలకూల్చాయి. తమ దేశ సరిహద్దుల్లో ఉన్న కుర్దిష్ మిలిటెంట్లను అంతమొందించేందుకు గత రెండు నెలలుగా సిరియాలో దాడులు జరుపుతున్నామని టర్కీ సైన్యం ఓ ప్రకటన విడుదల చేసింది.

అయితే, ఈ దాడుల్లో ఇప్పటివరకూ 280 సాధారణ పౌరులు మరణించారని మానవ హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. కాగా ఆ ఆరోపణలను టర్కీ ఖండించింది. దీనికంటే ముందు, 'ఫ్రీ సిరియా ఆర్మీ' సేనలు ఆఫ్రిన్ నగరాన్ని ఆదివారం ఉదయం స్వాధీనం చేసుకున్నాయని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ ప్రకటించారు. సేనల దెబ్బకు ఉగ్రవాదులు ఒట్టి చేతులతో పారిపోతున్నారని ఆయన అన్నారు.

వైట్‌షార్క్‌ల కోసం...సాహసం..



మెక్సికో సిటీ : పసిఫిక్ మహాసముద్రంలో డైవర్స్ సాహసం చేశారు. వైట్‌షార్క్‌పై పరిశోధన కోసం బోనులో సముద్రం అడుగుకు వెళ్లారు. వారిని చూసిన షార్క్ ఒక్కసారిగా బోను వైపు దూసుకొచ్చింది. పలుమార్లు బోను చుట్టూ వేట కోసం తిరిగింది. ఇలా ఒక షార్క్ మాత్రమే కాదు.. మూడు రకాల వైట్‌షార్క్స్‌పై డైవర్స్ పరిశోధనలు చేశారు. మెక్సికో సిటీకి కొద్దిదూరంలో గల గ్వాడాలుపే ద్వీపంలో కనిపించిన రెండు టన్నులు బరువున్న వైట్‌షార్క్ మాత్రం భిన్నంగా ప్రవర్తించిందని పరిశోధకుల్లో ఒకరైన జాన్ చెప్పారు.

బాగా లోతైన ప్రదేశాలకు వెళ్లి బోటు నుంచి కేజ్‌లను 40 అడుగుల లోతుకు దించినట్టు తెలిపారు. ఇలా మూడు రోజుల పాటు వైట్‌షార్క్స్ కోసం అన్వేషణ కొనసాగినట్టు వివరించారు. 20 అడుగులు పొడవున్న ఓ ఆడ షార్క్ తనవైపునకు దూసుకొచ్చినట్టు చెప్పారు.

ఈ సీజన్‌లో డైవర్స్ చేసిన పరిశోధనల్లో ఇదే అతిపెద్ద షార్క్ అని మాత్రం చెప్పగలనని అన్నారు. గ్రేట్ వైట్ షార్క్స్‌కు ప్రత్యర్థులపై మెరుపుదాడి చేసే శక్తి ఉంటుంది. కన్నుమూసి తెరచేలోగా లక్ష్యాన్ని అవి ఛేధిస్తాయి. సీల్స్ చేపలు అధికంగా ఉండే గ్వాడాలుపే ద్వీపంలో వైట్ షార్క్స్ అత్యధికంగా నివసిస్తున్నాయి

పుతిన్ విజయం...లాంఛనమే !

- రష్యాలో అధ్యక్ష ఎన్నికలు



మాస్కో: ఆదివారం రష్యాలో ప్రారంభమైన అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్ విజయం దాదాపు ఖాయమనే చెప్పాలి. దేశంలో ఓటుహక్కు కలిగినవారు 10కోట్లమంది ఉన్నారు. స్థానికకాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 10గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. ఎన్నికలపోటీలో నిలబడ్డ ఏడుగురులో పుతిన్ విజయం సాధించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఎగ్జిట్‌పోల్స్ అంచనావేస్తున్నాయి. 2000 నుంచి అధ్యక్షుడిగా, ప్రధానిగా రష్యాను పాలిస్తున్న పుతిన్‌కు ఈసారి ఎన్నికల్లో ప్రత్యర్థుల నుంచి పెద్దగా పోటీ ఎదురుకాలేదు.

ఎన్నికల్లో ఆయనకు అఖండ మెజారిటీ ఖాయమని అనేక సర్వేలు ఇప్పటికే తేల్చాయి. ఈసారి గెలిస్తే 2024 వరకు ఆయన అధ్యక్ష పదవిలో కొనసాగుతారు. తద్వారా స్టాలిన్ తర్వాత అత్యధికకాలం దేశ అధ్యక్షుడిగా పనిచేసిన వ్యక్తిగా పుతిన్ రష్యా చరిత్రలో నిలిచిపోనున్నారు. అయితే ఇటీవల జరిగిన రెండు పరిణామాలు ఆయన ఇమేజ్‌ను కొంత దెబ్బతీసాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఒకటి- బ్రిటిష్-రష్యా గూఢచారిపై విష రసాయన దాడి కాగా, రెండోది-2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా తలదూర్చినందుకు ఆంక్షలు విధించడం.

ప్రీ పోల్ సర్వేలో పుతిన్‌కు 69.7 శాతం మద్దతు దక్కిందని వస్తే.. ఆయన సమీప ప్రత్యర్థి పావెల్ గ్రడినిన్‌కు 7.1 శాతం మంది మాత్రమే ఓటేశారు. అయితే ఓటర్లలో ప్రస్తుతం ఆసక్తి తగ్గిందని, పోలింగ్ రోజు పుతిన్‌కు మద్దతు తగ్గవచ్చునని పాశ్చాత్య మీడియా వ్యాఖ్యానించింది.

తైవాన్ విషయంలో తప్పును దిద్దుకోండి

- ఆ దేశంతో అమెరికా సంబంధాలపై చైనా ఆగ్రహం



బీజింగ్ : తైవాన్–అమెరికా సరికొత్త సంబంధాలపై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'తైవాన్ ట్రావెల్ యాక్ట్'పై శుక్రవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేసిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం తైవాన్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో కొత్త నిబంధనలకు ట్రంప్ ఆమోదం తెలిపినట్టైంది. ఈ నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో ఉన్నతస్థాయి అమెరికా దౌత్యవేత్తల బృందం ఒకటి తైవాన్ పర్యటనకు బయల్దేరనున్నది. అనధికారికంగా ఇరు దేశాల ఉన్నతాధికారుల రాకపోకలు సాగుతన్నప్పటికీ, ఇకపై ఇవన్నీ అధికారికంగా జరగబోతున్నాయి. తద్వారా తైవాన్‌కు ఒక సార్వభౌమికదేశ గుర్తింపు ఇవ్వాలని అమెరికా పావులు కదుపుతోంది.

'వన్ చైనా పాలసీ' ప్రకారం, ఈ ఒప్పందానికి కట్టుబడి చైనాతో ద్వైపాక్షిక సంబంధాలు కలిగివున్న దేశాలు తైవాన్‌ను ఒక సార్వభౌమిక దేశంగా గుర్తించడానికి వీల్లేదు. చైనాపై తీవ్ర వ్యతిరేకత కలిగివున్న డొనాల్డ్ ట్రంప్, తైవాన్ అంశాన్ని అడ్డుపెట్టుకొని చైనాను ఆర్థికంగా, రాజకీయంగా దెబ్బకొట్టాలని చూస్తున్నారు. అమెరికా తాజా నిర్ణయాలపై చైనా నాయకత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ద్వైపాక్షిక సంబంధాలకు అధికారిక గుర్తింపు ఇవ్వటం చాలా పెద్ద తప్పు అని...దీనిని సరిదిద్దుకోవాలని, తైవాన్‌తో సంబంధాలు ఏర్పర్చుకోవటమంటే, చైనా అంతర్గత సంబంధాల్లో కలుగజేసుకోవటమేనని చైనా ఆగ్రహం వ్యక్తంచేసింది.

సమాచార దుర్వినియోగానికి పాల్పడ్డ ఫేస్‌బుక్?

శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ క్యాంపెయిన్‌లో పనిచేసిన కేంబ్రిడ్జ్ అనాలిటికా కంపెనీకి ఫేస్‌బుక్ కంపెనీ దాని వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని అందజేసిందని ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై యూఎస్ కాంగ్రెస్‌లో వ్యక్తిగత సమాచార రక్షణపై శనివారం ప్రశ్నల పర్వం మొదలైంది. వ్యక్తిగత సమాచారాన్ని కాపాడేందుకు నూతన రెగ్యులేషన్‌లు తీసుకురావాలని ఫేస్‌బుక్ కంపెనీని కోరారు. దాదాపు 5కోట్ల మంది వినియోగదారుల సమాచారాన్ని ఫేస్‌బుక్ దుర్వినియోగం చేసినట్టు తెలుస్తోంది. ఫేస్‌బుక్ సహాయంతో అమెరికా ఓటర్లను రష్యా ప్రభావితం చేసిందన్న ఆరోపణలు ఇది వరకే వచ్చాయి. ఇప్పుడు తాజాగా మరోసారి వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలు రావడంతో ఫేస్‌బుక్ విశ్వసనీయత ప్రమాదంలో పడింది. 50కోట్ల మంది వినియోగదారుల వ్యక్తిగత సమాచారం కేంబ్రిడ్జ్ అనాలిటికా కంపెనీల చేతికి వెళ్లిందని న్యూయార్క్ టైమ్స్ శనివారం రిపోర్ట్ చేసింది. అయితే అధ్యక్ష ఎన్నికల్లో కేంబ్రిడ్జ్ అనాలిటికా కంపెనీకి ఫేస్‌బుక్ వినియోగదారుల సమాచారాన్ని వాడుకునే అవకాశాన్ని కల్పించినట్టు ఓ బ్లాగ్‌లో ఫేస్‌బుక్ వెల్లడించింది. అయితే వినియోగించిని సమాచారాన్ని ఆ కంపెనీ డిలీట్ చేయలేదని తెలిపింది.

త్రీడి ప్రింటింగ్ హోం నమునా



అమెరికా : అభివృద్ధి చెందుతున్న దేశాల్లో చాలా మందికి సొంత గృహాలు ఉండవు. అలాంటి వారికోసం అతి తక్కువ ఖర్చుతో, అత్యంత వేగంగా కేవలం 24 గంటల్లోనే అందమైన ఇంటిని నిర్మించడానికి టెక్సాస్ రాజధాని ఆస్టిన్ నగరంలో గల ఐకాన్ అనే సంస్థ ప్రయత్నాలు మొదలుపెట్టింది. న్యూస్టోరీ అనే మరో సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకుని? మధ్యతరగతి వారి సొంతింటి కలను నిజం చేయనుంది. ఈ ఇళ్లను అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానం త్రీడి ప్రింటింగ్‌తో నిర్మించనున్నారు.

ఐకాన్–న్యూస్టోరీ భాగస్వామ్యంలో ఒక సర్వే నిర్వహించింది. అందులో 1.2 బిలియన్ మంది జనాభాకు గృహ సదుపాయం లేదన్న విషయం తేలింది. దాంతో తక్కువ ఖర్చుతో ఇండ్లను నిర్మించాలని ఐకాన్ సంస్థ నిర్ణయించుకుంది. టెక్సాస్ నగరంలో జరుగుతున్న ఎస్ఎక్స్ ఎస్‌డబ్ల్యూ ఫెస్టివల్‌లో వీరు నిర్మించిన ఇంటి నమూనాను ప్రదర్శించారు. కేవలం రూ.2.6 లక్షలతోనే ఈ 3డీ ప్రింటెడ్ ఇళ్లు నిర్మిస్తామని, వాటికి సంబంధించి అన్ని ప్రమాణాలను పాటిస్తున్నట్టు ఐకాన్ సంస్థ తెలిపింది.

తక్కువ నీరు, విద్యుత్‌ను వాడి ఇండ్లు నిర్మిస్తామని సంస్థ తెలిపింది. ఇతర కాలనీ వాసులతో కూడా సంప్రదించి ఇందులో ఉండాల్సిన సౌకర్యాల గురించి సలహాలు స్వీకరిస్తున్నట్టు, భద్రత, పటిష్టత, పునరుద్ధరణ వంటి వాటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు కూడా సంస్థ పేర్కొంది. అయితే 2014లో కూడా ఇలాంటి త్రీడి టెక్నాలజీతో 24 గంటల్లోనే నిర్మించిన విషయం తెలిసిందే. కాకపోతే దాని నిర్మాణ వ్యయం ఎక్కువ.

కనీసం మనుషులుగా కూడా చూడటం లేదు..

- మహిళల పరిస్థితిపై ఐరాస ఆందోళన
- సిరియాలో లైంగిక దాడులపై తాజా నివేదిక వెల్లడి



వాషింగ్టన్: సిరియాలో మహిళలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక తేటతెల్లం చేసింది. సాటి మనుషులుగా కూడ మహిళలను చూసే పరిస్థితులు కన్పించడం లేదు. లైంగడిక దాడులతో మహిళలను తీవ్రంగా హింసిస్తున్నారని ఆ నివేదిక బట్ట బయలు చేసింది. సుమారు 450 మందిని విచారించిన తర్వాత ఈ నివేదికను విడుదల చేసినట్టు ఐక్యరాజ్యసమితి ప్రకటించింది.మరో వైపు స్త్రీలతో పాటు పురుషులు కూడా లైంగికదాడులకు గురౌతున్నట్టు ఆ నివేదిక వెల్లడించింది.

సిరియాలో నరమేథం సాగుతోంది. మరో వైపు మహిళలపై యథేచ్ఛగా లైంగిక దాడులు కొనసాగుతున్నాయి. సిరియా అంతర్యుద్ధంలో మహిళలు పావులుగా మారుతున్నారు. సభ్యసమాజం తలదించుకొనే రీతిలో మహిళలపై లైంగిక దాడులు చోటు చేసుకొంటున్నాయి. దౌర్జన్యంగా ఇండ్లలోకి వచ్చి మహిళలపై లైంగికదాడులకు పాల్పడుతున్నారని ఆ దేశ మహిళలు వివరించారు.

సోదాల పేరుతో వచ్చి...

సోదాల పేరుతో ఇంట్లోకి వచ్చిన వారు..మహిళలపై లైంగికదాడులకు పాల్పడుతున్నారని ఐరాస నివేదిక తెలిసింది. తమకు శత్రువులుగా భావించే వారి ఇండ్లను సోదా చేసే పేరుతో దుండగులు మహిళలపై లైంగికదాడులకు పాల్పడుతున్నారు.

ఆయా ప్రాంతాల్లోని మగవారిని లొంగదీసుకొనేందుకు మహిళలను పావుగా వాడుకొంటున్నారు. మహిళలపై లైంగికదాడులు చేస్తూ తాము చెప్పినట్టుగా మగవారు నడుచుకోవాలని వేధింపులకు పాల్పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో యుద్ధ ట్యాంకులకు ముందే మహిళలను నగ్నంగా నడిపించిన ఘటలను కూడ కొందరు బాధితులు చెప్పారని ఆ నివేదిక వెల్లడించింది.

బడ్జెట్‌లో సామాన్యులకు మొండిచెయ్యి

- టీఆర్ఎస్‌ను ఓడించాలి : బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్

నవతెలంగాణ - చౌటుప్పల్

రాష్ట్ర బడ్జెట్‌లో సామాన్య ప్రజలకు మొండి చెయ్యి చూపారని బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ (బీఎల్ఎఫ్) చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్ అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న టీఆర్ఎస్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలో తెలంగాణ లేబర్ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముత్యాల శ్రీరాములుతో కలిసి ఆయన ప్రారంభించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్, మహాత్మాగాంధీ, సావిత్రిబాయిపూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో దొరల పాలనకు చరమగీతం పాడేందుకు 28 పార్టీలతో బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ ఆవిర్భవించిందన్నారు.



ఫ్రంట్‌లో తెలంగాణ లేబర్ పార్టీ ప్రధాన భాగస్వామిగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్యులకు మొండిచెయ్యి చూపిందని విమర్శించారు. వెనుకబడిన తరగతులపై సీఎం కేసీఆర్‌కు ఎంత ప్రేమ ఉందో బడ్జెట్‌ను చూస్తే అర్థమవుతుందన్నారు. 93శాతం ఉన్న బడుగు, బలహీన వర్గాలకు బడ్జెట్‌లో అన్యాయం జరిగిందన్నారు. 2019లో జరిగే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాలకు బీఎల్ఎఫ్ పోటీ చేస్తుందన్నారు. లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గొర్రె రమేశ్ మాట్లాడుతూ.. పేదలకు రాజ్యాధికారం ఏకైక లక్ష్యంగా తెలంగాణ లేబర్‌పార్టీ పని చేస్తుందన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆర్.మూర్తి, ఎమ్‌డి.యాకుబ్ అలీ, సుధాకర్, స్వామి, రమేశ్, బోయ దేవేందర్, చెంచల శ్రీను, ఊదరి శ్రీనివాస్, బోసుబాబు, బర్రె సుధాకర్, చరణ్ పాల్గొన్నారు.



నేడు మహాజన పాదయాత్ర ముగింపు వార్షికోత్సవం

- ముఖ్య అతిథిగా గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవాని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'సామాజిక న్యాయం- రాష్ట్ర సమగ్రాభివృద్ధి' అనే నినాదంతో సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన మహాజన పాదయాత్ర ముగిసి సోమవారం నాటికి ఏడాది పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు వార్షికోత్సవ సభను నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సామాజిక ఉద్యమ నాయకులు, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవాని హాజరు కానున్నారు. సభలో సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు, టీ మాస్ ఫోరం చైర్మెన్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య, ప్రజా గాయకుడు గద్దర్, బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్, నాయకులు మజీబుల్లాఖాన్ తదితరులు ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీపీఐ (ఎం) ఒక ప్రకటనలో ప్రజలకు పిలుపునిచ్చింది.

నేడు బీఎల్ఎఫ్ కార్యాయలం ప్రారంభం

బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) రాష్ట్ర కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించనున్నారు. హైదరాబాద్ గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లోని సీపీఐ (ఎం) నగర కార్యాలయం వద్ద గల ఈ ఆఫీసును గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవాని ప్రారంభిస్తారు. సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో బీఎల్ఎఫ్ భాగస్వామ్య పక్షాల నేతలందరూ పాల్గొంటారని ఫ్రంట్ నేతలు తెలిపారు.

టార్గెట్ పూర్తయితేనే వేతనం

- ఎస్ఎస్ఏలో కొత్త నిబంధనలు
- సగం జిల్లాల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అందని వేతనాలు

విద్య మా హక్కు సర్వ శిక్షా అభియాన్ అందరూ చదవాలి-అందరూ ఎదగాలి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ)లో పనిచేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల చెల్లింపునకు అధికారులు కొత్త నిబంధనలు పెట్టారు. ఇచ్చిన పని వందశాతం పూర్తి చేస్తేనే ఉద్యోగులకు నెలనెలా వేతనాలు చెల్లించాలని ఇటీవల జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఎస్ఏ ప్రాజెక్టు అధికారి కిషన్...డీఈఓలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో ఇప్పటికీ ఫిబ్రవరి నెలకు సంబంధించిన వేతనాలు ఉద్యోగులకు అందలేదు. క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్(సీఆర్పీ)లకు సంబంధించి స్కూల్ విజిట్, ఆన్‌లైన్ విజిట్, ఆధార్ మరియు ఇతర అన్ని రకాల రిపోర్టులు, కార్యక్రమాలపై నివేదిక ఆధారంగానే వేతనాలు చెల్లించాలని అధికారులు నిర్ణయించారు. ఫర్మామెన్స్ ఉంటేనే వేతనాలు ఇవ్వాలని లేకపోతే నిలిపివేయాలని సూచించారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల పరిస్థితీ ఇంతే. ఆధార్ అప్‌డేట్స్, బీసీ సబ్‌క్యాస్ట్ డాటా ఎంట్రీ, ఎంఎస్‌సీ డాటా ఎంట్రీ, టీచర్స్‌డాటా ఎంట్రీ తదితర అంశాలను పరిశీలించాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాలోనూ ఎంఈఓలకు డీఈఓలు ఆదేశాలిచ్చారు.

దీంతో చాలా జిల్లాల్లో ఉద్యోగులకు ఆలస్యంగా వేతనాలు అందాయి. హైదరాబాద్, రంగారెడ్డి, నిర్మల్, మంచిర్యాల జిల్లాలతో పాటు పలు జిల్లాల్లో ఇప్పటికీ వేతనాలు అందలేదు. పది జిల్లాల ఉద్యోగులకు శుక్ర, శనివారాల్లో వేతనాలు అందాయి. అయితే ఇచ్చేదే తక్కువ జీతం..ఇది కూడా ఏదో ఒకసాకు చెప్పి ఆపడం సరికాదని ఎస్ఎస్ఏ ఉద్యోగులు వాపోతున్నారు. ఆయా పాఠశాలలు సమాచారం ఇవ్వకుంటే, దానికి తామెందుకు బాధ్యులం అవుతామని వారు ప్రశ్నిస్తున్నారు. సమాచారమివ్వని పాఠశాలలపై, ఆ ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలనీ, అంతేగానీ తమ వేతనాలు ఆపడం సరికాదని కోరుతున్నారు. ఎంఈఓ ఆఫీసుల్లో జూనియర్ అసిస్టెంటు, సీనియర్ అసిస్టెంటు ఉద్యోగులు లేకపోవడంతో వారిపని సైతం తామే చేస్తున్నట్టు చెబుతున్నారు.

పనిచేయనోళ్లు మాకెందుకు..?: జి కిషన్, ఎస్ఎస్ఏ పీడీ

చాలా మండలాల్లో ఉద్యోగులు సక్రమంగా పనిచేయడం లేదని మా దృష్టికి వచ్చింది. ఆధార్ సీడింగ్, బీసీ ఉపకులాల గణన వివరాలు..వీటికి నెలల సమయమిచ్చినా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయడం లేదు. దీంతోనే ఫర్మామెన్స్ చూడాలని ఆదేశించాం. పనివిధానం సరిగా లేని వారి వేతనాలు ఆపేయాలనీ, మరీ బాగలేకుంటే తొలగించాలని చెప్పాం.

'లైంగికదాడికి పాల్పడ్డ వారిని శిక్షించాలి '

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం జానంపేట పంచాయతీలోని అమరారంలో గిరిజన యువతిపై పాశవికంగా లైంగికదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా చందు నాయక్, ప్రధాన కార్యదర్శి మూడ్ శోభన్ నాయక్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జానంపేట పంచాయతీలోని పాండురంగాపురం గ్రామానికిచెందిన గిరిజన యువతి ఈనెల 11న అమరారంలో జాతరకు వెళ్లిందని తెలిపారు. అమరారం గ్రామానికి చెందిన పోలేబోయిన భరత్, ఏసుబాబుతోపాటు మరో 9 మంది యువకులు యువతిని ఆటోలో బలవంతంగా లాక్కొని తీసుకెళ్లారని పేర్కొన్నారు. అమరారం అడవుల్లో గిరిజన యువతిపై పైశాచికానికి పాల్పడారని తెలిపారు. తెల్లారి భూపాలపల్లి జిల్లా అభినపల్లి మల్లారం అడవుల్లో మరోసారి అఘాయిత్యానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమ్మాయిలు, మహిళలపై ఎంతటి నేరాలు జరిగినా రాష్ట్ర ప్రభుత్వం చలించడం లేదని తెలిపారు. గిరిజన యువతిపై దారుణానికి పాల్పడిన వారిని నిర్భయ చట్టం, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం, అత్యాచార నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రారంభమైన తిరు కల్యాణ వేడుకలు

నవతలెంగాణ-భద్రాచలం

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామ నవమి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అంతరాలయంలో మూలవరులకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి తిరువీధి సేవ చేశారు. స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. రాజవీధి మీదుగా తాతగుడి సెంటర్ వరకు స్వామి వారికి తిరువీధి సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడంతో ఆదివారం నుంచి స్వామి వారి నిత్య కల్యాణాలు ఆపేశారు. సాయంత్రం రామాలయంలో వేదపండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు.

ఔటర్ రోడ్డుపై ప్రమాదం

- లారీ బీభత్సం..
- ఇద్దరు మృతి

నవతెలంగాణ- పటాన్‌చెరు

ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డుపై ఆదివారం తెల్లవారుజామున లారీ బీభత్సం సృష్టించింది. ఎదురుగా వస్తున్న మరో లారీ బలంగా ఢీకొట్టుకుంటూ వెళ్లి విద్యుత్ స్తంభాన్ని తాకింది. చివరకు, రెండు లారీలు ఢీకొన్నాయి. దీంతో ఇద్దరు మృతిచెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. సిమెంట్ లోడ్ లారీ.. ఇటుకల లారీని ఢీకొన్నాక కరెంట్ స్తంభాన్ని ఢీకొంది. తర్వాత అక్కడే ఉన్న పెట్రోల్ బంక్ గోడను గుద్దుకుని ఆగిపోవడంతో పెను ముప్పు తప్పింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం బీడీఎల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్‌కు చెందిన లారీ ఇంద్రేశం శివారులో బట్టీ వద్ద ఇటుకలు లోడ్ చేసుకుని అత్తాపూర్ వైపునకు వెళ్తోంది. కర్దనూర్ శివారులో ఔటర్ రింగ్ రోడ్డుపైకి రాగానే, రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి వైపు నుంచి పటాన్‌చెరు వైపు వస్తున్న సిమెంట్ లారీ ఇటుకల లారీని వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మహబూబ్‌నగర్ జిల్లా దామరగిద్ద మండలం ఒత్తుగూడ తండాకు చెందిన ఇటుకల లారీ డ్రైవర్ ప్రవీణ్(21) అక్కడికక్కడే మృతి చెందాడు. దానిపై ఉన్న కూలీలు సంజీవ్(23), మరో ముగ్గురికి గాయాలయ్యాయి.



వారిని వెంటనే సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా సంజీవ్ మృతిచెందాడు. గాయపడిన వారిని సంగారెడ్డి నుంచి లాలక్‌నగర్‌లోని ప్రీమియర్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమీపంలోనే పెట్రోల్ బంక్ ఉంది. సిమెంట్ లోడ్ లారీ ఇటుకల లారీని ఢీకొన్న అనంతరం విద్యుత్ స్తంభాన్ని, ఆపై పెట్రోల్ బంక్ గోడను ఢీకొని ఆగింది. విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పెట్రోల్ బంక్ సమీపంలో తీగలు పడ్డాయి. లారీ బంక్ గోడను గుద్దుకుని ఆగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మృతదేహాలను పోస్టుమార్టం కోసం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

సంస్కృతిని విస్మరించడం ఆందోళనకరం

- తెలుగును బతికించుకోవాలి : ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- స్వర్ణభారత్ ట్రస్టులో ఉగాది వేడుకలు

నవతెలంగాణ- శంషాబాద్

ప్రపంచ దేశాలు భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను ఎంతో గౌరవిస్తున్నాయని, మనవాళ్లు మాత్రం విస్మరిస్తుండటం ఆందోళనకరమని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ రెవెన్యూ పరిధిలోని స్వర్ణభారత్ ట్రస్టులో ఉగాది వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఉప రాష్ట్రపతితోపాటు కేంద్ర మంత్రులు తోమర్, పూరి, తెలంగాణ ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ హాజరయ్యారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలు భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తున్నాయని తెలిపారు. మన దేశ ప్రజలు పాశ్చాత్య పోకడలతో మన సంస్కృతి, విలువలను వదిలేయడం ఆందోళనకరమన్నారు. తెలుగు ప్రజల సంవత్సర పండుగ ఉగాది ప్రత్యేకమైందన్నారు. పరభాషా వ్యామోహంలో పడి తెలుగును మరిచిపోవడం సరికాదని, తెలుగును బతికించుకోవడం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మాతృభాషలో చదివిన వారికి ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర మంత్రి తోమర్ మాట్లాడుతూ.. తెలుగు సంప్రదాయాలు దేశానికే ఆదర్శమని ప్రశంసించారు. అనంతరం స్వర్ణభారత్ ట్రస్టులో నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం ద్విచక్రవాహన మెకానిక్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేంరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పాము కాటుతో విద్యార్థి మృతి

- అందుబాటులో లేని వార్డెన్, డాక్టర్
- సమయానికి అందని వైద్యం

నవతెలంగాణ-కొల్చారం

ఎస్సీ బాలుర వసతి గృహంలో పాముకాటుకు గురై విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన కొల్చారం మండల పరిధిలోని రంగంపేటలో ఆదివారం జరిగింది. హాస్టల్ వార్డెన్ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా బ్యాతోల్ గ్రామానికి చెందిన వడిత్య అర్జున్(15) రంగంపేటలోని షెడ్యూలు కులాల వసతి గృహంలో ఉంటూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఉదయం హాస్టల్ ఆవరణలోని మూత్రశాలకు పోతుండగా పాము కాటేసింది. వెంటనే విద్యార్థి అరవడంతో తోటి విద్యార్థులు, వాచ్‌మెన్ వెళ్లి చూశారు. పాము కాటేసిందని గుర్తించి చికిత్స నిమిత్తం పక్కనే ఉన్న ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కానీ అక్కడ వైదులు లేకపోవడంతో పక్క గ్రామమైన తుక్కాపూర్‌లో నాటు వైద్యం చేయించారు. అనంతరం మెదక్ ఏరియాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. హైదరాబాద్ తీసుకుపోతుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు.



అందుబాటులో సిబ్బంది లేక..

ఎస్సీ బాలుర వసతి గృహంలో వార్డెన్ పోస్టు ఖాళీ ఉండటంతో కౌడిపల్లి మండలం వెల్మకన్నె హాస్టల్ వార్డెన్ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. విద్యార్థిని పాము కాటేసినప్పుడు ఆయన అక్కడ లేరు. అలాగే, రంగంపేట ప్రభుత్వాస్పత్రి డ్యూటీ డాక్టర్ డిప్యూటేషన్‌పై తూప్రాన్ ప్రభుత్వాస్పత్రిలో పని చేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ ఆస్పత్రిలోనూ వైద్యులు లేరు. అందువల్ల సమయానికి వైద్యం అందక విద్యార్థి మృతిచెందాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలపై నేడు వీసీలతో ఉన్నత విద్యామండలి సమావేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రవేశాల ప్రక్రియపై సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఉన్నత విద్యామండలిలో సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఉన్నత మండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి, వైస్ చైర్మెన్లు ఆర్ లింబాద్రి, వి వెంకట రమణ, విద్యాశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ మిట్టల్‌తోపాటు విశ్వవిద్యాలయాల వీసీలు హాజరుకానున్నారు. 2016-17 విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియ అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. 2018-19 విద్యాసంవత్సరానికి సంబంధించి డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల తేదీపై నిర్ణయం తీసుకునే అవకాశముంది. డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల వల్ల విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలు రాకుండా ఏం చేయాలన్న దానిపైనా ఆలోచించి నిర్ణయం తీసుకోనున్నారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)తో వచ్చే ఇబ్బందులను ముందుగానే పరిష్కరించుకునే అంశంపైనా చర్చించనున్నారు. ఇంకోవైపు డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలకు దరఖాస్తు విధానంలోనూ మార్పులు చేసే అవకాశముంది. విద్యార్థులు సులభతరంగా దరఖాస్తు చేసేకునే వెసులుబాటు కల్పించనున్నారు. ప్రయివేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు కోరుతున్నట్టుగా మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాలా? లేదా అన్న అంశంపైనా ఓ నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఇంకోవైపు డిగ్రీ కోర్సుల ఫీజులు దోస్త్ వెబ్‌సైట్‌లో ఒకటి, ఈపాస్ వెబ్‌సైట్‌లో మరొకటి ఉన్న విషయం తెలిసిందే. డిగ్రీ ఫీజులు దోస్త్, ఈపాస్ వెబ్‌సైట్‌లో ఒకేలా ఉండే అంశమూ చర్చకు రానుంది.


అత్యాధునిక పరిజ్ఞానంతో...

ఎక్లిప్స్ పరుపులు



హైదరాబాద్: సుఖమైన నిద్ర కోసం నాణ్యమైన మెత్తటి పరుపుల తయారీలో పేరుగాంచిన ఎక్లిప్స్ మ్యాట్రెస్ కంపెనీ.. తన కస్టమర్ల కోసం ఆర్థోపెడిక్ పరుపులను మార్కెట్లోకి తీసుకొచ్చినట్టు ఓ ప్రకటనలో తెలిపింది. 115 ఏండ్ల చరిత్ర కలిగిన ఎక్లిప్స్.. ఆరు ఖండాల్లోని 57 దేశాల్లో తన సేవలను అందిస్తోందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. భారత్‌లో దశాబ్దకాలం నుంచి తమ సేవలందిస్తున్నట్టు వారు తెలిపారు. అత్యాధునిక స్పైనల్ జోన్ పేటెంటెడ్ స్లీప్ టెక్నాలజీ పరుపులు, ఆర్థోపెడిక్ పరుపులు మార్కెట్లలో లభ్యమవుతున్నాయన్నారు.

భాగ్యరెడ్డివర్మ స్మారక రచనల పోటీ విజేతలు



దళిత ఉద్యమ వైతాళికుడు, సంఘ సంస్కర్త, హైదరాబాద్ సంస్థానంలో దళిత బాల బాలికల విద్యకోసం పాఠశాలలు స్థాపించిన అభ్యుదయవాది భాగ్యరెడ్డివర్మ. వారి పేరున నిర్వహించిన స్మారక రచనల పోటీకి తమ రచనల్ని పంపిన రచయితలకీ, కవులకీ ధన్యవాదాలు. ఈ పోటీ ఫలితాలను ఇక్కడ అందిస్తున్నాం. ఈ నెల 21వ తేదీన హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న నవతెలంగాణ మూడో వార్షికోత్సవాలలో బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం ఉంటుంది.

బహుమతికి ఎంపికయిన నవలలు

ప్రథమ బహుమతి : వాళ్ళు గెలవాలి – శిరంశెట్టి కాంతారావు
ద్వితీయ బహుమతి : కొంగవాలు కత్తి – డా. గడ్డం మోహన్‌రావు
నవలల న్యాయనిర్ణేతలు – ముదిగంటి సుజాతారెడ్డి, కె. ఆనందాచారి, పరమాత్మ అందోజు

బహుమతికి ఎంపికయిన పెద్ద కథలు

ప్రథమ బహుమతి : చిరుదివ్వె – సుంకోజి దేవేంద్రాచారి
ద్వితీయ బహుమతి : దారి తెలిసిన మేఘం – బి. నర్సన్
తృతీయ బహుమతి : తెగువ – పుప్పాల కృష్ణమూర్తి

ప్రత్యేక బహుమతులు


1. స్కావెంజర్ – పెద్దింటి అశోక్‌కుమార్
2. అదృశ్య శత్రువు – జి.అనసూయ
3. చివరి మజిలీ – పాండ్రంకి సుబ్రహ్మణ్యం
4. నువ్వు చాలా ఎదిగిపోయావు తల్లీ – మల్లాది మంజుల
5. పుణ్యానికి – నోముల సుదర్శన్‌రెడ్డి
6. రైతు బిడ్డలు – మహేష్ దుర్గే
7. అగ్నిపరీక్ష – చింతపట్ల సుదర్శన్
8. కొత్తచూపు – సి.ఎస్.రాంబాబు
9. రాధి – అనంతోజు మోహనకృష్ణ
10. ఉషోదయం – సబ్బని లక్ష్మీనారాయణ

బహుమతికి ఎంపికయిన సింగిల్ పేజీ కథలు

ప్రథమ బహుమతి : యశోధర నవ్వింది – డేవిడ్
ద్వితీయ బహుమతి : నైజం మారేనా? – దాసరి శిరీష
తృతీయ బహుమతి : పెద్దలు కుదిర్చిన పెళ్ళి – పెండెం జగదీశ్వర్

ప్రత్యేక బహుమతులు

1. గొడుగు – యు.విజయశేఖర్‌రెడ్డి
2. వీడ్కోలు – సిహెచ్. శివరామప్రసాద్
3. దుష్టశక్తి – ఎం.వి.ఎస్.ప్రసాద్
4. నిర్వాసితులు – సింహప్రసాద్
5. డి.ఎన్.ఏ. – పి.చంద్రశేఖర్ అజాద్
6. హలో బాగున్నారా! – బి.కె.ఈశ్వర్
7. సాయం – కూర చిదంబరం
8. ఏకపక్షం – బి.వి.ఎన్.స్వామి
9. రా(జు)జకీయం – గొట్టిపర్తి యాదగిరిరావు
10. గెలుపు – ఎం.సుగుణారావు



సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథలు

1. ప్రేమ ఒక ఆట విడుపు – పెళ్లి ఒక సాహసం– అంబల్ల జనార్దన్ 2. మై లాస్ట్ నోట్ – ఏలియా మన్నె, 3. యుద్ధం – మణి వడ్లమాని, 4. పరుసవేది – చిత్తలూరి సత్యనారాయణ, 5. శీను – మంత్రవాది మహేశ్వర్, 6. శరణార్థి– చెన్నూరి సుదర్శన్

కథల న్యాయనిర్ణేతలు – కాత్యాయనీ విద్మహే, కె.పి.అశోక్‌కుమార్, వంశీకృష్ణ

బహుమతికి ఎంపికయిన కవితలు

ప్రథమ బహుమతి : నీటివల – మడిపల్లి రాజ్‌కుమార్
ద్వితీయ బహుమతి : వానకు కరిగిన సజీవశిల్పం – చిత్తలూరి సత్యనారాయణ
తృతీయ బహుమతి : ఆయి – బి.వేణుగోపాల్‌రెడ్డి

ప్రత్యేక బహుమతులు

1. నిషిద్ధస్వప్నం – డి. బి.బాలకృష్ణ
2. మట్టికుండ – కటుకోజ్వల రమేష్
3. పురిటికేక – బండారి రాజ్‌కుమార్
4. అతడు రేపటిముఖచిత్రకారుడు – జనజ్వాల
5. అన్ని మరణాలు – కోటం చంద్రశేఖర్
6. నేను అమ్మనైతానేమో – తుమ్మల దేవరావ్
7. ఊచలపాన్పు – వి.శరణ్య
8. ఓ నా చార్మినార్ చలించు – మహమ్మద్ వలీ హుసేన్
9. శోధించాల్సిన నిజాలు – పురిమళ్ల సునంద
10. యిసిరె – వడ్లకొండ దయాకర్

సాధారణ ప్రచురణకు స్వీకరించిన కవితలు

1 నరుసలమ్మ – లలిత కోపల్లి, 2. తడిసిన నేల మీద – నేరెళ్ళ హన్మంతు, 3. వెదురు 'బొంగు' జీవితం – ఎ.వి.ఆర్.మూర్తి 4. తిరగబడింది సూర్యాకాంతం – మహ్మద్ అమ్జద్ అలీ, 6. దగాపడుతున్న అన్నదాత – సిహెచ్. ఆంజనేయులు, 7. మరుభూమి – సి.ఎస్.రాంబాబు, 8. ... ఉంది – పర్కపెల్లి యాదగిరి, 9. కులం – సబ్బని లక్ష్మీనారాయణ, 10. నేటి హోమో సెపియన్ – అబ్దుల్ వహీద్ ఖాన్, 11. అచ్చంగా ఆమెకే తెల్సు – నామని సుజనాదేవి, 12. ఇవాల్టి నిజం – పద్మావతి రాంభక్త, 13. నేను యుద్ధాన్ని మాట్లాడుతున్నా – కమలేకర్ శ్యామ్‌ప్రసాదరావు, 14. సామాన్య ఘోష – డేగల అనితాసూరి, 15. ఇప్పటి రాజకీయం – రఘువర్మ, 16. మానవత్వం భయపడుతున్నది– మహ్మద్ ఖాజా మైనోద్దీన్

కవితల న్యాయనిర్ణేతలు – శిలాలోలిత, ఎం.నారాయణశర్మ, వాహెద్

ధిక్కారం అతని కవిత్వ సారాంశం

కవిత్వంలో వస్తువు, శిల్పం రెండూ ప్రధానమైనవే. వస్తువును కాలం ఇస్తుంది. శిల్పాన్ని అధ్యయనం, అది ప్రతిఫలించిన సందర్భం ఇస్తుంది. నిజానికి ఈ ప్రతిఫలనాన్ని కూడ గట్టుకుని గొంతుక ద్వారా అంశం, ఇతివృత్తం కవిత్వంగా బయటికి వస్తుంది. ఒక కవిని ఇతరులకు భిన్నంగా నిలబెట్టేది ఈ గొంతుకే. వస్తువు శిల్పంలో వైచిత్రి ఉన్న కవిత్వంలో కూడా గొంతుక ఒక మార్గంలో వినిపిస్తుంది.ఆ కవి శైలిని నడిపించేది నిర్ణయించేది కూడా గొంతుకే. ఒక ప్రధాన స్రవంతి కవిత్వంలో వినిపించే గొంతుకకు అదే మార్గంలో కవిత్వంరాసే ఒక గొంతుకకు మధ్య భేదాలు చాల తక్కువ వర్తమానంలో. అలాంటి ఒక గొంతుక విల్సన్ రావు కొమ్మవరపు కవిత్వానిది. సాధారణంగా వస్తునిర్వహణలో వినిపించే గొంతుకకు రసము లేదా భావనకు విల్సన్ రావు గొంతుకకు వైరుధ్యముంది.

విల్సన్ రావు కవిత్వ వస్తువు సమకాలీన కవిత్వావస్తువులను అతిక్రమించి రాసిందేమీ కాదు. ఈ కాలంలో కనిపించే వైవిధ్యమైన బహుళ వస్తువే ఆయన కవిత్వంలోనూ ఉంది. వాటిని స్వీకరించే దిశ దృష్టిలోనూ ఇతర కవులతో భేదం లేదు. ఉన్నదల్లా ఆ వాక్యంలోని రస స్థితి (ఈస్తటిక్ టేస్ట్)లో ఉంది.

ఏళ్ళుగా నడచివచ్చిన కవిత్వంలో అభ్యుదయం దృష్టిసంబంధమైన భావనను, పీడనను తిరస్కరించడాన్ని చెప్పింది. విప్లవ కవిత సైద్ధాంతికతను, ధిక్కారాన్ని ఇచ్చింది. వర్తమానంలోని దళిత బహుజన కవిత్వం సామాజికాణచివేతకు సంబంధించిన లోచూపును ఇచ్చింది. స్త్రీవాద కవిత జెండర్ దృష్టితో, తెలంగాణా ప్రాంతీయోద్యమ కవిత ప్రాంతీయ నైసర్గిక దృష్టితో కనిపిస్తాయి. ఏ కాలంలోనైనా ఒక ప్రధాన రాజకీయ సామాజిక సాంస్కృతికోద్యమ ప్రభావం తరువాతి కాలాలనుంచి తప్పుకోదు. కాలానుసారంగా ఆవశ్యకతను అనుసరించి మళ్ళీ మళ్ళీ ముందుకొస్తాయి. కొన్ని వాక్యాలను గమనిస్తే విల్సన్ రావులో సమకాలీన వస్తువు అర్థం అవుతుంది.

1. పొగిలి పొగిలి/ రోదించిన రాత్రులెన్నో/ దళితుడి కన్నీటిని రుచి చూడలేక పోతున్నయి – (కన్నీటి రుచి.92.పే)

2. "విశ్వ విద్యాలయాలు/ ఓంకారనాదాలైన చోట/ నిరంతరం కళ్ళల్లో కళ్ళు పెట్టి చూసే/ కొత్త విద్యనొకటి నేర్చుకోవాలి/ అప్పుడెప్పుడో/ రాముడికీ రావణుడికీ/ యుద్ధం జరిగిందని తెలుసుకున్నాం కాని/ ఇప్పుడు సహనానికి అసహనానికి మధ్య/ యుద్ధం జరుగుతోందని మాత్రం అందరం తెలుసుకోవాల్సిన సమయం" – (అసహనం–పే.77)

3. "గోరుముద్దల మురిపెమింకా తీరక ముందే/ పారాణి ఇంకా ఆరని పత్తిపూల లాంటి పాదం/ నగరం నడి బొడ్డున పోరాడి ఓడి/ పశు కామ వాంఛకు బలైంది" – (ప్రశ్నల్తో ఉరి తీయండి.పే166)

దృష్టి స్వభావం గొంతుక ఇవి వరుసగా కవిలోని లేదా కవితలోని సామాజిక మానసిక స్థితి, అనుభవం అనుభూతిని చెబుతాయి. అనుభావానుభూతులు సారాంశభూతంగా భావనగా కనిపిస్తాయి. దృష్టి వస్తువును ఇస్తే, స్వభావం దాన్ని గమనించే మార్గాన్నిస్తుంది. దృష్టినుంచి సృష్టికి మధ్యలో స్వభావం గొంతుక కవిని మూసనుంచి తప్పించి నిలబెడతాయి. "1. దళితుడి కన్నీటిని రుచి చూడలేక పోతున్నాయి, 2. ఇప్పుడు సహనానికి అసహనానికి మధ్య యుద్ధం జరుగుతుంది, 3. నడి బొడ్డున పోరాడి ఓడి పశు కామవాంఛకు బలైంది" లాంటి వాక్యాలు దృష్టి సారంగా సమకాలీన సామాజికతను పెనవేసుకున్నవి. కవిత్వం నిండా కొన్ని ఎలిజీలు, ఆత్మీయులపై రాసిన కవితలను మినహాయిస్తే మిగతావన్నీ ఇలాంటి సామాజికమైనవే. అందులోనూ రాజకీయార్థికాంశాలే ఎక్కువ. కాని వీటి నుంచి వ్యక్తమయ్యే చిత్తవృత్తి (మూడ్), గొంతుక (టోన్), సృజన వేరు.

దృష్టినుంచి వచ్చిన సామాజికాంశం స్వభావంతో కలిసి ఒక మూడ్ ఏర్పరుస్తుంది. దాన్నుంచే గొంతుక ఏర్పడుతుంది. విమర్శలో మూడ్‌ను విశ్లేషించడానికి పన్నెండు అంశాలు, గొంతుకను విశ్లేషించడానికి ఇరవైఒక్క అంశాలను చెబుతారు. మూడ్ అంటే కవితలోని పూర్తి మానసిక స్థితి, దాని ప్రవర్తన. గొంతుక ఆ స్థితిని వ్యక్తం చేసిన మార్గం.

విల్సన్ రావు కవిత్వంలో సంఘటన నుండి ధిక్కారం కంటే సంవేదన ఎక్కువ. విమర్శ మూడ్‌ను విశ్లేషించడానికి చెప్పే దిగులు (ఫ్రెట్నింగ్), వ్యాకులత (గ్లూమీ), కరుణ (సారోఫుల్ నేచర్) ఎక్కువగా కనిపిస్తాయి. సాధారణంగా మూడులో నాలుగు అంశాలను చూడవచ్చు. 1.ఆగ్రహం, 2. ధిక్కారం, తిరస్కారం, 3. దుఃఖం, వ్యాకకులత, 4. మోహం, పరవశం. నవరసాలను స్థూలంగా ఇలా మూడ్‌లో వ్యక్తమయ్యే కవిత్వాన్ని బట్టి విభజించుకోవచ్చు. విల్సన్ రావు తీసుకున్న పై వాక్యాల తాలూకు వస్తువుల నుంచి ధిక్కారం, వేగవంతమైన భాష కనిపించాలి. సాధారణంగా కనిపిస్తున్నది ఇదే. ఈ సందర్భంలో సమకాలీనంగా కొంత సెటైర్ (వ్యంగ్యం) కూడా

> **అన్ని రకాల అణచివేతలపై ధిక్కార స్వరంగా అభివ్యక్తమైంది విల్సన్‌రావు కవిత్వం. వర్తమాన సామాజిక సందర్భాలకు ఈ కవి ప్రతిస్పందనలోని వైవిధ్యాన్ని తెలియజేస్తుందీ కవిత్వం. వస్తువుని కవిత్వంగా మలచడంలో చూపిన కౌశలాన్ని తెలియజేస్తుందీ వ్యాసం.**



వినిపిస్తుంది. విల్సన్ రావు గొంతుక సంజాయిషీ అడుగుతున్నట్టుగా ఉంటుంది. ఒక దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తున్నట్టు, దు:ఖాన్ని పంటి బిగువున ఆపుకుని నిలదీస్తున్నట్టుంటుంది. పై వాక్యాల్లో 1. దళితుడి కన్నీటిని రుచి చూడలేక పోతున్నాయి, 2. అందరం తెలుసుకోవాల్సిన సమయం. లాంటి వాక్యాలన్నీ ఈ దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తాయి. బహుశః ఎదుటివారి మద్దతును కూడగట్టే భావన ఇందులో ఉంది. భాషలో మార్దవానికి ఈ భావావేశంలోని కారుణ్యస్థితి ఒక కారణం. అనేక వాక్యాల్లో ఎన్నుకునే ప్రతీకల్లోనూ ఇలాంటి మార్దవం కనిపిస్తుంది. "పత్తిపూల లాంటి పాదం", "చైతన్యం మొలకెత్తాల్సిన తరుణం" లాంటి వాక్యాలు అందుకు ఉదాహరణ.

ఐ.ఏ.రిచర్డ్స్ "భావార్థక భాష" గురించి చెప్పాడు. అందులో కొన్ని భావనలను, అందులో చేసే పనులను చెప్పాడు. "ధ్వనిశాస్త్రకారులు పదాలు సంకేతించే అభిద– లక్షణాల గురించి శాఖోపశాఖలుగా చిత్రించారు. వాటిని తనలోకి తెచ్చుకోలేదు గాని రిచర్డ్స్ భావార్థక భాషను ఆలోచన, అస్పష్టత, మాయాగతమై అన్న వ్యాఖ్య (సూడో స్టేట్ మెంట్) గొంతుక, ఉద్దేశ్యం (ఇన్‌టెన్షన్), ప్రవర్తన, సందర్భం, అంతర్గతంగా చిత్రించే బొమ్మలు" మొదలైన వాటిని అనుశీలించడం ద్వారా విశ్లేషించవచ్చు నన్నాడు – (గుప్తేశ్వర ప్రసాద్.ఐ.రిచర్డ్స్–భావార్థక భాష. భారతీయ రససిద్ధాంతం. పే.195) విల్సన్ రావు గొంతులో ఇలాంటివన్నీ పలుకుతాయి. భావానికి విలువనివ్వటం వల్ల ఈగొంతును, స్థితిని ఆయన కవిత ధరిస్తుంది. "దేవుడు తప్పి పోయాడు" – (పే.63) అలాంటి కవితల్లో ఒకటి. ఉన్నాడో లేడో తెలియని దేవుని గురించి ఉన్నాడనుకునే భ్రమలో అలాంటి ఒక నమ్మకం లాంటి మోహం మాట్లాడడం ఈ కవిత. "దేవుడు తప్పిపోయాడనే"దే ఒక 'సూడో స్టేట్‌మెంట్'.

1. "నీతో నేనెప్పుడూ/ ముఖాముఖి మాట్లాడకపోయినా/ నువ్వెవరో నాకిప్పుడు తెలిసిపోయింది"

2. "శాంతివచనాలు పలుకుతూ/ దొంగ కొంగ జపం చేస్తున్న/ పనికి మాలిన వంకర ముఖపు శిలవి"

3. "నీదేహంలో నువ్వెప్పుడో తప్పిపోయావు/ కాకపోతే మరేంటి?"

4. "పత్తిపండించే రైతు/ బట్ట నేసే నేతగాడు/ కూటిగింజల కోసం అలమటిస్తున్నారు/ నేసిన బట్టను అమ్ముకునే దళారీ మాత్రం కోట్లకు పడగలెత్తుతున్నాడు/ భూమి భాష తెలిసి/ ధాన్యం పండించే అన్నదాత/ దారిద్ర్యాన్ని నెత్తికెత్తుకొని/ బతుక్కి చరమ గీతం పాడుతుంటే/ మధ్యవర్తులు తమ వ్యాపార పురోగమనానికి/ అనుకరణ విద్యను మా పుర్రెల్లో నాటి/ కిందిమెట్టునుండి పైమెట్టుకు ఎగబాకి/ ఆకాశయానం చేస్తున్నాడు"

5. "నిన్ను నిలదీయటం పెద్ద పనేం కాదుగాని/ కాలమెంత విలువైందో తెలుసు నాకు"

6. "దేవుడా/ నువ్వెప్పుడూ/ నీలోంచి నువ్వు/ తప్పిపోతూనే ఉండు/ నన్ను నేనే/ ఈ నేలలో విత్తుకుని కొత్త జలానికి దోసిలి పడతాను" – (పే.63/64)

ఈ మొత్తం కవితలో గొంతుక బాధతోనే ఉంది. ఆ సందర్భంలో దేవుణ్ణి నిలదీయటం కనిపిస్తుంది. మొదటి మూడు సంభాషణాత్మక వాక్యాలు (కన్వర్సివ్ సెంటెన్స్) మొదటి మూడు సూడో స్టేట్ మెంట్స్ కూడా. నిజానికి నాలుగులో చెప్పే సందర్భానికి కారకులెవరో తనకు తెలుసు. అయినా ఈ వాక్యాలను రాయడంలోనే కవిస్వభావం, దాన్ని ఆనుకున్న గొంతుక కనిపిస్తాయి. మూడవ వాక్యంలో రెండవభాగం "కాకపోతే మరేంటి?" లో ఒక అమాయకత్వం, పసిచేష్టలతో కూడిన దుఃఖం కనిపిస్తాయి. ఈ దుఃఖంలోంచే "వంకర ముఖపు శిల" అనే ఆక్రోశంతో కూడిన నింద. నిజానికి నాలుగో భాగంలోని వాక్యాలే ఆయన వస్తువు. కవిత్వ సందర్భం. ఇందులోనూ మళ్లీ రెండు రెండు చొప్పున భాగాలున్నాయి. మొదటి భాగాల్లో వ్యక్తుల ప్రతిపాదనలు. రెండవ దాంట్లో వాస్తవ స్థితి. అయిదవ వాక్యం మళ్లీ అమాయకత్వాన్ని పలికించే వాక్యం. ఆరులో తన నిర్ణయం. రిచర్డ్స్ వాస్తవాన్ని చెప్పే నిర్ధారిత శాస్త్రీయ మార్గం సూడో స్టేట్‌మెంట్– అన్నాడు. ఈభాగంలోని వాస్తవం కోసం విల్సన్ రావు గొంతుక ముందు వాక్యాలను చెప్పింది. నిజానికి ఇలాంటి దుఃఖంలో ఉన్నప్పుడు అస్పష్టమైన మాటలు వస్తుంటాయి. చివరివాక్యంలోని రెండవ భాగం అలాంటిదే. తాను సత్యం కోసం నిలబడతానని చెబుతున్నట్టుగా ఉండే ఈ వాక్యం కవితలోని మూడ్‌ను గొంతుకను పదిలంగా పలికిస్తుంది. అనేకసార్లు చిత్రించే పదబంధాలు కూడా అలాంటివే. "చరిత్ర నెగడు/ పచ్చి పాదాలు/ ఆకుపచ్చలోయ(65) ఊపిరితాళ్ళు/ ప్రాణ సూత్రం/ చెమట విత్తనం/ వెలుతురు కిరణం" లాంటివి కొన్ని అలాంటివి. ఊపిరి/ ప్రాణం లాంటి పదాల మీద విల్సన్ రావు కవిత్వంలో ప్రత్యేక శ్రద్ధ కనిపిస్తుంది. "ఊపిరితీగ (69)/ ఊపిరితాళ్ళు (65) ఊపిరిసంతకం (78)" అలాంటివి. "తెల్లని మల్లె పువ్వంటి మనసున్న నలుగురు మనుషులు తోడుండాలి" (పే.90) అని తపిస్తారు విల్సన్ రావు. బహుశః తననలా నిర్మించుకుంటున్నారు. అందుకే ఈ సత్యవంతమైన దుఃఖం ఆయన కవిత్వమంతా పారుతుంది. అందుకు సాక్ష్యం ఆయన గొంతుక. ఆయన గొంతుకే ఆ కవిత్వపు ప్రతినిధి.

– ఎం.నారాయణ శర్మ, 9848348502

తనబ్బి

–డా॥ఎన్. గోపి



ఒకప్పటి అపూరూప వస్తువులు
ఇవాళ
స్థలాభావ సంక్షోభంలో పడ్డాయి.

తనబ్బి తెరిస్తే
వెలిసిపోయిన ఫోటోలు,
చిట్లిన కాగితాలు
చెంబులూ బోల్టులూ
తుప్పు పట్టిన చాకులూ
వీటిని వరుసగా పేరిస్తే
గత వైభవ కాలాన్ని
పునర్నిర్మాణం చెయ్యొచ్చు.

ఫోటోల్లోని ముఖాల్లో
అప్పటి వర్తమాన తేజస్సు
వెలుగులీనుతుంది.
కాగితాలు తాళపత్రాలకు
తోబుట్టువుల్లా వున్నాయి.
చెంబులను సేకరించినప్పుడు
వెండిగింజల్లా తళతళలాడేవి.
సైకిల్ పయ్యలను
గమ్యాలకు చేర్చిన చరిత్ర వాటికుంది.

ఆ బోల్టులు
కొత్తలోకాలకు కాకపోయినా
సూర్యోదయంలోకి
తలుపులు తెరిచేవి.
మా అబ్బాయి బర్త్‌డే కేకును
కోసిన చాకులు
ఆనాటి తీపిని గుర్తుకు తెస్తున్నాయి.
ఇంట్లో ఎగిరే నల్ల తుమ్మెదలు
జ్ఞాపకాల్లా తిరుగుతున్నాయి.
ఎందుకో
వీటిని దాచిపెట్టినప్పటి
ఉద్వేగం ఇప్పుడు లేదు.

అంతలోనే
వాటి అవసరం తీరిపోవడం
ప్రాసంగికత
కనుమరుగైపోవడం
విషాదకర విస్మయం.
అప్పటి అపురూపం
ఇవాళ వెలిగీ వెలగని దీపం.


ఓసారి
నా చేతులవైపు చూసుకున్నాను
గీతలు అరిగిపోయి
ముడుతలు పడ్డ చర్మంతో
వొణుకుతున్నాయి.
రేపు ఇవి మ్యూజియంలో
పెట్టడానిక్కూడా పనికిరావు.

అయితే
ఇవి సాధించిన
సాఫల్యాలు మాత్రం
కాలయవనికపై
ఎప్పటికీ చెరిగేవి కాదు
ఈ వస్తువులు కూడా అంతే!
చరిత్రకు జీవన పరికరాలు

('తనబ్బి' తనాబీ అనే ఉర్దూ మాట నుంచి వచ్చింది. కప్‌బోర్డ్, అతల్‌మారి అని అర్థాలు)

భూమి పుత్రుల పాదయాత్ర

– అన్నవరం దేవేందర్



జొన్నచేన్ల మీంచి చిలుకల గుంపులు
వరి గొలుసుల జెండాలతో చెలుకలు
దాటినయి
రహదారి పొడుగూతా వ్యవసాయ
పాదముద్రలు

నాసిక్ నుంచి ముంబయి దాకా
గోదావరిలా వరదల పరుగులు
ఎక్స్‌ప్రెస్ హైవే కదిలే మోదుగువనం
నెత్తిన టోపీలు చేతిల జెండాల రెపరెపలు
కై గట్టి కదులుతున్న పాదాలు
ఆరు రోజులు ఇన్నూరు మైళ్ళ ప్రయాణం
మునుం పట్టిన కొడవండ్లు

'శేత్కారి కర్జా మాఫ్ కేలే జావే'
'ఆత్మహత్యా ఆసు నవే'
'పీకాసి కిమ్మత్ ద్యావే'
హామీల అమలుకే ఊరేగింపులు

అవి బురుద పొలం దున్నిన కాళ్ళు
ఎద్దూ ఎవుసం సుట్టు తిరిగిన అరికాళ్ళు
దుబ్బ చెల్కల నడిచిన పాదాలు
కొయ్యకాలు గుచ్చుకున్న అడుగులు

ఊరూరి దుక్కం ఒక్కటై పారిన
మరాఠా రైతాంగపు మర్లపడ్డ పౌరుషం

ఉరితాళ్ళు తరుముతున్న చప్పుడు
మదికట్లల్ల రాలిపోయిన గరుక పోసలు
నీళ్ళు లేని కాలువల్ల కన్నీళ్ళ తడి

సుతి మెత్తని షూస్‌తో నడిచే
పాదయాత్రల పటాటోపం కాదది
చెప్పుల్లేని అరికాళ్ళ సలపరింత

పొక్కులు పొక్కులై కారుతున్న నెత్తురు
గాయలై స్రవిస్తున్న హృదయాలు
కాళ్ళ ఏళ్లకు ఎన్ని పోట్రవుతుల దెబ్బలు

అరిపాదం మీద మంగ ముల్లు నొప్పి

కదులుతున్న కాళ్ళకు నీల్లిచ్చిన పల్లెలు
నడుస్తున్న అన్నదాతలకు
దండం పెట్టిన వూర్లు
కంఠ ఘోషలకు అందిన
ప్రాణ వాయువులు

మలబారు పోరు మదిల మెదిలి
తెలంగాణా రైతాంగ ఉద్యమం
హృదిన కదిలింది
పొలాల నుంచి దండెత్తిన
ముక్త కంఠ హలాలు
ఇది భూమి పుత్రుల మహా పాదయాత్ర

కవి సెల్ : 9440763479

తెలంగాణ వచన కవితా వికాసం

హన్మకొండలో మార్చి 22, 23 తేదీల్లో తెలంగాణ వచన కవితా వికాసం హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో బన్న అయిలయ్య సంచాలకులుగా 'తెలంగాణ వచన కవితా వికాసం' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు మార్చి 22, 23 తేదీల్లో జరుగుతుంది. ఈ సదస్సులో నందిని సిధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి, రామాచంద్ర మౌళి, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కాత్యాయనీ విద్మహే తదితరులు పాల్గొంటారు

– బన్న అయిలయ్య

మూడుతరాల కవిసంగమం - 37

హైదరాబాద్ బొగ్గులకుంట, తిలక్ రోడ్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ లో 25వ తేదీన సాయంత్రం 6 గంటలకు మూడు తరాల కవి సంగమం జరుగుతుంది. ఇందులో అల్లం నారాయణ, దయాకర్ వడ్లకొండ, పల్లిపట్టు, రమాదేవి బాలబోయిన, కృష్ణ గుగులోత్ పాల్గొంటారు.

స్ఫూర్తి పురస్కారాలు

ద్వా.నా.శాస్త్రి సప్తతి పూర్తి సంద్భంగా 'సాహిత్య విమర్శ' గ్రంథాలకు స్ఫూర్తి పురస్కారాలు జూన్ 15న హైదరాబాద్‌లో ఇస్తారు. 2016, 2017, 2018లలో ముద్రితమైన ఏ ప్రక్రియవైనా విమర్శ గ్రంథాలు 200 పేజీలు ఉండాలి. మొదటి బహుమతి పదివేలు, రెండో బహుమతి ఐదు వేల రూపాయలు. ఒకొక్కటి రెండు ప్రతుల చొప్పున డి.శశికాంత్, 1-1-428, ఆర్చిజ్‌నెస్ట్, గాంధీనగర్, హైదరాబాద్ – 500080 చిరునామాకు పంపాలి.

– కిన్నెర రఘురామ్

తెలంగాణ సాహితి లిటరరీ ఫెస్ట్ - 2018

ఏప్రిల్ 28,29, 30 తేదీలలో జరిగే లిటరరీ ఫెస్ట్ 2018 సందర్భంగా భాషా వికాసం కొరకు తెలంగాణ సాహితి పరిశోధనా వ్యాసాలను ఆహ్వానిస్తుంది. సాహిత్య మూలాలపై సమగ్రంగా సరళమైన భాషలో 1. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో వచ్చిన సాహిత్యం, 2. ప్రపంచీకరణ కవితంలో తెలంగాణ ప్రాదేశికత, 3. తెలంగాణ ఉద్యమ కవిత్వం – తొలి మలి దశలు, 4. సామాజిక మాధ్యమాలు – కవిత్వ ప్రమాణాలు, 5. తెలంగాణ కవిత్వం – తెలంగాణ భాషానుశీలన అనే అంశాలపై వ్యాసాలు ఉండాలి. అనుఫాంట్ 7లో ఐదు పేజీలకు మించకుండా ఏప్రిల్ 19వ తేదీలోపు పంపాలి. state bank of india/ AC.no : 20137804269/ Ananthoju Mohan Krishna, UFSCode : SBINooo916 పేరుమీద వ్యాసానికి 300 రూపాయలు చెల్లించాలి. వ్యాసాలు పంపాల్సిన ఇ మెయిల్ : mk.ananthoju@gmail.com. వ్యాసంతో పాటు రుసుము చెల్పించిన రసీదును కూడా జరపరచాలి.

యానాంలో ప్రపంచ కవితా దినోత్సవం

కవిసంధ్య, డా॥ఎస్.ఆర్.కె. ఆర్ట్స్ కళాశాల సంయుక్త నిర్వహణలో 21న యానాంలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఆధునిక కవిత్వంపై జాతీయ సదస్సు, కావ్య సంపుటాల ఆవిష్కరణ, కవితల పోటీ బహుమతి ప్రదానం, కవి సమ్మేళనం ఉంటాయి. మల్లాడి కృష్ణారావు, జయరాజ్ డానియల్, వాడ్రేవు సుందర్రావు, ఖాదర్ మొహియుద్దీన్, జి.లక్ష్మీనరసయ్య, రామతీర్థ ప్రసాదమూర్తి, యాకూబ్, మువ్వా శ్రీనివాసరావు, మధునాపంతుల, దాట్ల దేవదానంరాజు,

మానవి
నవతెలంగాణ
manavi@navatelangana.com
హైదరాబాద్
సోమవారం 19-3-2018

క్యాన్సర్ అన్న పదం వినగానే.. ఉలిక్కి పడతాం. ప్రపంచాన్ని వణికిస్తున్న ఈ జబ్బు బారిన పడినవారిని అంటరానివారిగా చూస్తాం. ఇక మరణం తప్ప మరో గత్యంతరం లేదు అన్నకున్న ఎంతో మంది క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు తన వైద్యంతోనే కాదు.. మంచిమాటలతో ధైర్యాన్నిస్తూ.. క్యాన్సర్ కూడా అన్ని జబ్బుల మాదిరిగానే నయం అవుతుందన్న భరోసాను కల్పిస్తున్నారు సుప్రసిద్ధ వైద్యులు డాక్టర్ సునీత, సీనియర్ కన్సలెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్. రెండుదశాబ్దాలుగా క్యాన్సర్ బారిన పడిన వారికి భరోసానిస్తూ.. తన వద్దకు వచ్చిన ఎందరో జీవితాలను అధ్యయనం చేసి ఈ వ్యాధి బారిన పడినవారికి అవసరమైన సమాచారం, కేసు స్టడీస్‌తో పుస్తకం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్న ఆమె మానవితో చెప్పిన విషయాలు..

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక



చీమలు చేరకుండా..!

చూడటానికి చిన్నగా కనిపించినా మన దైనందిన జీవితంలో చిన్న చిన్న పనులు చేసుకోవటానికి కూడా ఇబ్బంది కలిగించే జీవులు చీమలు. ఇవి మన వంటగదిలో తిరుగుతూ తెగ చికాకు పెడతాయి. చీమలు ఇంటి పునాదు లను దెబ్బతీసిన సందర్భాలను కూడా మనం చూడొచ్చు. వేలాది చీమలు సైన్యంగా మనకు ఇష్టమైన ఆహార పదార్థాలపై దండెత్తి రావడం మనకు తెలిసినదే! ఒక్క రాణి చీమ కొన్ని లక్షల చీమలకు జన్మనిస్తుందన్న విషయం మీకు తెలుసా? వినడానికే మీకు గగుర్పాటుగా ఉందా? అయితే కొన్ని సులువైన చిట్కాలతో చీమలను మన ఇంటికి దూరంగా నెట్టేయవచ్చు.



- వంటింట్లో మనం సాధారణంగా ఉపయోగించే వెనిగర్‌ను, నీటిని సమానంగా కలిపి చీమలు ఎక్కువగా తిరుగాడే వంట గది గట్టు, అల్మరాలను శుభ్రం చేయండి. ఇలా ఒకే రోజు నాలుగైదు సార్లు చేసి మంచి ఫలితం పొందండి. చీమలు వెనిగర్ వాసనను ఇష్టపడవు. అంతేకాక వెనిగర్ సువాసన చీమలు ఏర్పాటు చేసుకునే బాటలను తుడిచివేస్తుంది.
- చీమలు ఎక్కువగా ఉన్న చోట్లలో నిమ్మ, నారింజ తొక్కలను ఉంచండి. ఈ పండ్ల తొక్కలలో ఉండే రసాయనాలు చీమలకు ఆహారంగా ఉపయోగపడే శిలీంధ్రాలను నాశనం చేస్తాయి. కనుక చీమలు వెంటనే ఆ ప్రదేశాన్ని వీడి వెళ్ళిపోతాయి.
- చీమలు పిండి ఉండే ప్రదేశంలో సంచరించవు కనుక వంటగదిలో ఉండే అల్మరాలలో, చీమలు ప్రవేశించే చోట్లలో పిండిని వెదచల్లండి.
- చీమలు మన ఇంట్లోకి ప్రవేశించే తలుపులు, కిటీలు ఉన్న చోట్లలో ఉప్పును చల్లండి. ఉప్పును దాటి చీమలు ఇంటి లోనికి ప్రవేశించవు. ✿

మహిళల ఆరోగ్యమే ఇంటికి అందం



కడప జిల్లా జమ్మలమడుగు మండలంలోని చిన్నగ్రామం గండికోట కోటారిపల్లి మా సొంతూరు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన మా నాన్న సుబ్బయ్య ఎంతో కష్టపడి కర్నూలు మెడికల్ కాలేజీలో చదివి డాక్టర్ అయ్యారు. ఆయన తన పిల్లలంద రినీ డాక్టర్లు చేయాలని నిర్ణయించుకున్నారు. అమ్మ లక్ష్మీదేవి. మేం ముగ్గురం పిల్లలం. తమ్ముడు (డాక్టర్), చెల్లి (సాఫ్ట్‌వేర్). నేను మొదటి బిడ్డను కావడంతో నాన్న ఆశయం ముందుగా నాతోనే ప్రారంభమైంది. అమ్మకు డెలివరి చేసిన వ్యక్తి ప్రముఖ డాక్టర్ బాలాంబగారు. నన్ను తాకిన మొదటి స్పర్శ ఆమెది కావడం నా అదృష్టం. నాన్న గవర్నమెంట్ డాక్టర్ కావడంతో ప్రతి మూడేండ్లకు ఒకసారి బదిలీలు ఉండేవి. ప్రాథమిక విద్య జిల్లాల్లో సాగింది. పదవతరగతి, ఇంటర్ హైదరాబాద్‌లోనే పూర్తి చేశాను. నాకు టీచర్ కావాలన్న కోరిక మనసులో ఉన్నా.. నాన్నకు భయపడి ఎప్పుడూ చెప్పలేదు. ఎంసెట్ రాసిన తర్వాత కొద్దిరోజులు డిగ్రీ చదివాను.

ఓయూలో సీటు..

ఎంసెట్‌లో స్టేట్‌ర్యాంక్ 300 వచ్చింది. దాంతో ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. నాన్న సంతోషానికి అవధులు లేవు. నాకు మనసులో బాధగా ఉన్నా.. నాన్న కోసం మెడిసిన్‌లో చేరాను. క్లాసులు ప్రారంభం కావడం.. ప్రొఫెసర్‌లు వైద్యవృత్తి గొప్పదనం చెప్పడంతో నేను మంచి డాక్టర్‌ను కావాలని నిశ్చయించు కున్నాను. మాకు క్లాసులు తీసుకునేవారిలో ఎంతో మంది ప్రముఖ డాక్టర్లు ఉన్నారు. వారి వద్ద కేవలం హ్యూమన్‌బాడీ మెటబాలిజంతోపాటు హ్యూమన్ వ్యాల్యూస్, మెంటల్ స్ట్రెంత్ నేర్చుకున్నాం. క్లాసుకు లేటుగా వచ్చినా.. సరిగ్గా డయగ్నోసిస్ చేయకపోయినా.. అమ్మాయిలు అన్నది కూడా చూడకుండా తిట్టేవారు. వివక్ష అన్నది లేకుండా అందరినీ సమానంగా చూసేవారు. ఈరోజు డాక్టర్‌గా మంచి పేరు ఉందంటే ఆ క్రెడిట్ అంతా మా నాన్న, మా ప్రొఫెసర్లదే.

పాఠాలు చెప్పవచ్చని..

నాకు థియరీ క్లాసులు చెప్పాలంటే చాలా ఇష్టం. టీచర్ కావాలన్న కోరిక మెడిసన్‌లో తీరింది. ఎంబిబిఎస్ సెకండరీయర్‌లో ఉన్నప్పుడే ఫస్ట్ ఇయర్ వారికి లెసెన్సు చెప్పడం ప్రారంభించాను. ఆ తర్వాత ఎంబిబిఎస్‌లో ఉన్నన్ని రోజులు క్లాసులు చెప్పేదాన్ని. నా ఫ్రెండ్స్ కూడా వచ్చి థియరీ చెప్పమని అడిగేవారు. అలా బోధించా లన్న నా కోరిక తీరింది. సర్జికల్ స్కిల్స్ నాకు అంతగా లేవు అన్న విషయం నేను గుర్తించి.. ఫిజీషియన్ కావాలనుకున్నాను. డెర్మిటాలజీలో చేరాలని నాన్న సూచించారు. ఆయన కూడా డెర్మిటాలజిస్టు కావడంతో నన్ను అందులోనే స్పెషలైజేషన్ చేయమన్నారు. అయితే ఆంకాలజీ పై ఆసక్తి నన్ను ఆంకాలజీ, రేడియేషన్‌లో ఎం.డి చదివేందుకు కారణమైంది. రేడియాలజీలో చేరినప్పుడు రేడియేషన్ ప్రభావంతో ఆరోగ్యం పాడైతదని నా ఫ్రెండ్స్ భయపెట్టారు. అప్పుడు క్లాస్‌లో నేను మరో అమ్మాయి మాత్రమే ఉండేవాళ్లం. ఎం.డి, డిఎన్‌బి పూర్తి చేసిన తర్వాత యశోద హాస్పిటల్‌లో చేరాను. న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో, టాటా మెమోరియల్ హాస్పిటల్‌లోనూ శిక్షణ తీసుకున్నాను. ఆ తర్వాత బసవతారకం ఇండో అమెరికన్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో పన్నెండు సంవత్సరాలు పనిచేశాను. ఇప్పుడు కాంటినెంటల్ హాస్పిటల్‌లో హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్, సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజీస్ట్‌గా పనిచేస్తున్నాను.



వైద్యరంగంలో ఎఫ్ఆర్‌సిఆర్ పట్టా పొందడం ఒక మైలురాయి వంటిది. ఎంతో క్లిష్టమైన ఈ పరీక్షలో విజయం సాధించాలని ఎంతో ప్రయత్నించాను. చివరికీ మా బాబుకు మెడికల్ సీటు, నాకు ఎఫ్ఆర్‌సిఆర్ పట్టా ఒకే ఏడాది వచ్చాయి. నిజంగా చాలా హ్యాపీగా ఫీలయ్యాను.

పేషంట్ చెప్పింది వినాలి..

ప్రతి జబ్బుకు ఒక చరిత్ర ఉంటుంది. కొన్ని లక్షణాలనే బట్టి మనం జబ్బును అంచనా వేయలేం. ముఖ్యంగా క్యాన్సర్ సోకిన వారిలో వారి జీవనవిధానం, అలవాట్లు ప్రముఖపాత్ర పోషిస్తాయి. అవేమి తెలుసుకోకుండా కేవలం రిపోర్ట్స్ చూసి వైద్యం చేస్తే.. అవి జబ్బును పూర్తిగా నయం చేయవు. మొదటి నుంచి తెలుసుకోవడం అన్న అలవాటు ఉన్న నేను.. వైద్యం కోసం వచ్చే ప్రతిరోగి గురించి పూర్తిగా తెలుసుకుంటాను. వారితో ప్రేమగా మాట్లాడితే చాలు సగం జబ్బు తగ్గిపోతుంది. ఎందుకంటే క్యాన్సర్ వ్యాధి అనగానే ఇక జీవితం ముగిసిపోతుంది అన్న భయం, బాధ వారిలో ఉంటాయి. ఎన్ని మందులిచ్చినా.. రికవరీ అనేది చాలా తక్కువగా ఉంటుంది. అలాకాకుండా రోగితో ప్రేమగా మాట్లాడితే.. మెంటల్‌గా వారు స్ట్రాంగ్ అవుతారు. అప్పుడు మందులు కూడా పనిచేస్తాయి. ప్రతి పేషంట్‌కు దాదాపు గంటటైమ్ కేటాయిస్తాను. కంప్లీట్ ఫ్యామిలీ హిస్టరీ, డైలీ హాబిట్స్ తెలుసుకున్న తర్వాతే అవసరమైన వైద్యపరీక్షలు చేయిస్తాం. అప్పుడు వారికి ఇచ్చే చికిత్స చాలా త్వరగా కోలుకునేలా చేస్తుంది. మనోధైర్యం ఉంటే ఎలాంటి జబ్బులనైనా నయం చేయవచ్చు.

రెగ్యులర్‌గా చెకప్..

'కార్యేషుదాసి, కరణేషు మంత్రి అంటూ.. మహిళలను మల్టీటాలెంట్ పర్సన్‌గా అభివర్ణిస్తారు. ఆడవారు ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇల్లు, ఇంటిలోని వారంతా ఆనందంగా ఉంటారు అన్న విషయాన్ని మాత్రం విస్మరిస్తారు. రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ లేకపోవడంతో క్యాన్సం బారిన పడుతున్న మహిళల సంఖ్య అధికంగా ఉంది. మనదేశంలో మహిళల్లో సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్లతో పాటు గొంతు క్యాన్సర్ కూడా ఎక్కువగానే ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సర్వైకల్, గొంతు క్యాన్సర్లు కనిపిస్తాయి. పట్టణ ప్రాంతాల్లో బ్రెస్ట్ క్యాన్సర్ ఎక్కువగా ఉంటుంది. వీటికి కారణాలను పరిశీలించినప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో అధిక సంతానం, శుభ్రత పాటించకపోవడం, ఎక్కువగా పొగాకు ఉత్పత్తులను తినడం. ఇక పట్టణ ప్రాంతాల మహిళల విషయం గమనిస్తే.. 30ఏండ్ల వరకు పెండ్లి చేసుకోకపోవడంతో వారిలో హార్మోన్స్‌లో తేడాలు వస్తాయి. ఇవి క్యాన్సర్ రావడానికి కారణం అవుతాయి. ఇటీవల 16ఏండ్ల అమ్మాయిలో బ్రెస్ట్ క్యాన్సర్ ఐడెంటిఫై చేశాం. ఏ క్యాన్సర్ అయినా ఫస్ట్, సెకండ్ స్టేజీలో బయటపడితే పూర్తిగా నయం చేయవచ్చు. రెగ్యులర్ చెకప్‌లతో వీటికి చెక్ పెట్టవచ్చు. 35ఏండ్లు పై పడిన వారు ప్రతి పదేండ్లకు ఒకసారి పాప్‌స్మియర్ టెస్ట్, 50ఏండ్లు పై పడిన వారు ప్రతి రెండేండ్లకు ఒకసారి మమోగ్రామ్ టెస్ట్ చేయించుకుంటే చాలామందిలో క్యాన్సర్‌ను నివారించవచ్చు. మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలి. వారి ఆరోగ్యంపైనే కుటుంబం ఆరోగ్యం, ఆనందం ఆధారపడి ఉన్నాయన్న విషయం గుర్తుంచుకోవాలి.

వి. యశోద



సెల్ఫీతో ముఖంపై ముడతలు..

సెల్ఫీ దిగడం అనేది ఇప్పుడు ఒక ఫ్యాషన్ అయిపోయింది. ఎక్కడున్నా ఏ పని చేస్తున్నా సెల్ఫీ దిగడం చాలా మందికి అలవాటు. ఈ అలవాటు ముఖం మీద ముడతలకు కారణం అవుతుంది అంటున్నారు నిపుణులు. సెల్‌ఫోన్ నుంచి వెలువడే రేడియేషన్ కారణంగా చర్మం ముడతలు పడుతుందనీ, ఏ వైపు సెల్ఫీ తీసుకుంటున్నారో ఆ వైపు ముఖం మీద చర్మం ముడతలు పడుతుందనీ వారు హెచ్చరిస్తున్నారు. ఫోన్ల నుంచి వెలువడే నీలిరంగు కాంతి చర్మానికి హాని కలిగిస్తుందని వారు చెబుతున్నారు. అంతే కాకుండా ఫోను నుంచి వెలవడే ఎలక్ట్రో మాగ్నిటిక్ రేడిషయన్ కారణంగా డిఎన్ఏ దెబ్బతినే ప్రమాదం కూడా పొంచి ఉందని వారు హెచ్చరిస్తున్నారు. అందువలన ఎంతో అవసరం అయితే తప్ప సెల్ఫీలు దిగకుండా ఉంటేనే మంచిదని వారు సూచిస్తున్నారు. ✿

చిన్నారులు బలహీనంగా ఉన్నారా!

పిల్లలు బాగా సన్నగా, బలహీనంగా ఉన్నారంటే కాస్త ఆలోచించాల్సిందే ! కొంత మంది చిన్నారులు ఎంత ఆహారం తీసుకున్నా వారి శరీర బరువు చాలా తక్కువగా ఉంటుంది. శరీర బరువు తక్కువగా ఉండటం వల్ల వ్యాధి నిరోధక శక్తి కూడా చాలా తక్కువగా ఉంటుందని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. పిల్లలు బొద్దుగా, బలంగా కనిపించాలంటే రోజు వారికి కొవ్వు పదార్థాలు లేని అధిక క్యాలరీలున్న పోషకాలను ఆహారంలో చేర్చితే సరిపోతుంది.

- ప్రతిరోజు చిన్నారులకు ఒక గ్లాసు పాలు, ఒక అరటిపండుతో చేసిన షేక్ ను రోజుకు రెండు సార్లు తాగించండి. ఎక్కువ మోతాదులో ఖర్జూర పండ్లను తినిపించండి. అలాగే రోజు ఒక గ్లాసు తేనె కలిపిన వేడి పాలను తాగించాలి. ఒక కప్పు పెరుగును తినిపించండి. ఒకవేళ అరటి పండు తినకపోతే, వివిధ రకాల పండ్లను, పాలల్లో కలిపి తాగించాలి. ఇలా చేయడం వల్ల శరీరానికి అవసరమైన చక్కెరలు, పాల నుండి ప్రోటీన్లు అందుతాయి.
- ఖర్జూర పండ్లు శరీర బరువును పెంచడంలో సహాయపడతాయి. రోజుకు కనీసం మూడు సార్లు ఖర్జూర పండ్లను తినిపిస్తే పిల్లలు త్వరగా బరువు పెరుగుతారు.
- ఒక గ్లాసు వేడి పాలల్లో ఒక చెంచా తేనె, బాదం పొడిని కలిపి తాగించాలి. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు ఇది మంచి ఔషధంగా సహాయపడుతుంది.
- శరీర బరువును పెంచడంలో ఎండు ద్రాక్ష కూడా బాగా పని చేస్తుంది. కాబట్టి రోజుకు కనీసం 30 గ్రాముల ఎండు ద్రాక్షలు తినిపించాలి. ఎండు ద్రాక్ష తినడానికి ఇష్టపడని పిల్లలకు స్వీట్స్‌లో లేదా హల్వాలో కలిపి పెడితే సరిపోతుంది. ✿



చున్నీనే ఆయుధంగా..!

ఆడవారిని వెకిలి చేష్టలతో కొందరు, మాటలతో మరికొందరు వేధిస్తారు. వారిపై కక్షపెంచుకున్న మరికొందరు ఆయుధాలతో దాడిచేస్తారు. ఇలాంటి సందర్భాల్లో దాడులను ఎదుర్కొవడం చాలా కష్టం అన్న అపోహ మహిళల్లో ఉంటుంది. ఆత్మవిశ్వాసం అనే ఆయుధం వెంట ఉంటే మగవారి దాడులను సునాయాసంగా తిప్పికొట్టవచ్చు. చీర కుచ్చిళ్లకు పెట్టుకునే పిన్నీసు నుంచి భుజాలపై వేసుకునే చున్నీ వరకు ఎన్నో ఆయుధాలు తమతో ఉన్నాయన్న విషయం మహిళలు గుర్తుంచుకోవాలి. కత్తితో దాడి చేస్తున్న యువకుడి నుంచి ఈ మహిళ ఎలా తప్పించుకుందో ఈ వారం చూద్దాం..!

సెల్ఫ్ డిఫెన్స్



ఎవరూ లేని ప్రదేశంలో పరిచయం ఉన్న వ్యక్తి పలుకరింపుతో కాకుండా చేతిలో ఆయుధంతో ఎదురుపడగానే ఆమె బిత్తరపోయింది. తనపై దాడి చేయడానికే వచ్చాడన్న విషయం అర్థమైంది.



నిర్మానుష్యప్రాంతంలో ఆ వ్యక్తి చేతిలో తనప్రాణాలు పోకుండా కాపాడేవారి కోసం ఎదురుచూసేంత సమయం లేదు. వెను వెంటనే తన భుజాలపై ఉన్న చున్నీని తీసి అతడి చేయి తనపై పడకుండా చున్నీతో అడ్డుకుంది.



పదునైన ఆయుధం చేతిలో ఉన్నా.. ఆమెపై దాడిచేయడం సాధ్యపడకపోవడంతో అతడు కొంత కంగారు పడ్డాడు. మరింత బలంగా ఆమెపై దాడి చేసేందుకు ప్రయత్నిస్తాడు. కత్తి పట్టుకున్న చేయి తనపై పడకుండా అడ్డుకున్న ఆమె తన చున్నీని అతడి చేతి చుట్టూ తిప్పాలి. దాంతో అతడి చేయిని కట్టేసినట్టు అవుతుంది. కత్తిని ఎటు కదలలేడు.



చున్నీ రెండు కొనలను ఒకచేత్తో గట్టిగా పట్టుకుని వెనక్కి లాగాలి. దాంతో అతడు వెనక్కి బెండ్ అవుతాడు. ఇదే అదనుగా కుడిచేతి ఎల్‌బో తో అతడి ఛాతీపై అటాక్ చేయాలి. ఇవన్నీ వెంటవెంటనే చేయాలి. తప్పించుకునే అవకాశం ఇవ్వకుండా జాగ్రత్త వహించాలి.

ఎవరైనా మీ పై ఆయుధాలతో దాడి చేసినప్పుడు చురుగ్గా ఆలోచించాలి. కత్తి మీదికి దూసినప్పుడు, యాసిడ్ పోయడానికి వచ్చినప్పుడు వెంటనే కిందికి వంగితే చాలు. వారి గురి తప్పడమే కాకుండా ప్రాణాపాయం నుంచి చాకచక్యం తప్పించుకోవచ్చు. సో.. అమ్మాయిలు! కాస్త తెలివి.. మరికాస్త ధైర్యం జతచేసి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి. ఆల్ ది బెస్ట్!




ఎన్. లక్ష్మీ రవి,
ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్,
రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్,
గాంధీనగర్, హైదరాబాద్.
9490239170,
9949039049

పిప్పల్ల వెంకటేశ్

'పార్టీలకు విదేశీ విరాళాల' బిల్లు పాస్

ఎలాంటి చర్చ లేకుండానే లోక్‌సభ ఆమోదం



న్యూఢిల్లీ: దేశంలోని రాజకీయ పార్టీలకు అందుతున్న విదేశీ విరాళాలపై పర్యవేక్షణ మినహాయింపును సూచించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఎలాంటి చర్చ జరగకుండానే ఈ బిల్లు పాస్ కావడం గమనార్హం.



రాజకీయ పార్టీలకు విదేశాల నుంచి విరాళాలు అందడాన్ని సులభతరం చేసే చర్యలో భాగంగా మోడీ సర్కారు ఈ బిల్లును తీసుకొచ్చింది. ఫారెన్ కంట్రిబ్యూషన్ (రెగ్యులేషన్) యాక్టు-2010 ప్రకారం.. పార్టీలకు విదేశీ విరాళాలు అందే విషయమై షరతులున్నాయి. ఇదిలా ఉంటే.. ప్రతిపక్షాల తీవ్ర ఆందోళనల నడుమ ఆర్థిక బిల్లు-2018లో 21 సవరణలకు లోక్‌సభ బుధవారం ఆమోదం తెలిపింది. కాగా.. దీనిలో ఫారెన్ కంట్రిబ్యూషన్ (రెగ్యులేషన్) యాక్టు-2010 సవరణ బిల్లు కూడా ఉన్నది.

ప్రధానికి స్పెషల్ ఫ్లైట్



- **ఫ్లయింగ్ పీఎంఓగా రూపకల్పన**
- **క్షిపణిదాడులను ఎదుర్కొనేలా రాడార్ వ్యవస్థ**
- **2020 నాటికి అందుబాటులోకి..**

ఆకాశ ప్రయాణాలకు ఎప్పుడు ముప్పు పొంచి ఉంటుందో ఎవరికీ తెలియదు. ఇటీవల చిన్న ఏమరుపాటుతో జరిగే ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో దేశప్రధాని, రాష్ట్రపతి ప్రయాణాలు ఎంతవరకు సేఫ్..? ప్రస్తుతం మోడీ, రామ్‌నాథ్ కోవింద్‌లకు వాడుతున్న విమానాల భద్రతపై భద్రతా దళాలు దృష్టి పెట్టాయి. క్షిపణి దాడులతో నిరోధించే విధంగా విమానాలను వారికి సమకూర్చే దిశగా చర్యలు తీసుకుంటున్నాయి. ఇంతకీ పలు దేశాల అధ్యక్షుల అధ్యక్షులు వాడే విమానాలు ఏవీ..? అందులో ఎలాంటి సౌకర్యాలున్నాయో..ఓ లుక్కేద్దాం

నవతెలంగాణ జనరల్ డెస్క్

దేశ ప్రధాని, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కోసం ప్రత్యేక విమానాలు సిద్ధమవుతున్నాయి. ఈ విమానాల్లో రాడార్లతో జామ్ చేయవచ్చు. న్యూక్లియర్ దాడులను నిరోధించే శక్తి ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. ఎమర్జెన్సీ కోసం ఆపరేషన్ థియేటర్ కూడా అందుబాటులో ఉంచనున్నారు. ఈ విమానం 2020 నాటికి రెడీ కానున్నది. దీని కోసం బోయింగ్ 777.. 300 ఈఆర్ విమానాలను ఫ్లయింగ్ పీఎంఓ రూపాన్ని ఇవ్వనున్నారు. విమాన ఎత్తు 60 ఫీట్లు. ఇక ప్రధాని వినియోగించే విమానంలో అమర్చనున్న పలు సౌకర్యాలు గోప్యంగా ఉంచుతున్నారు.

ప్రత్యేకతలు ఇవే..

242 అడుగుల పొడవు, వింగ్‌స్పేస్ 212 అడుగుల వెడల్పు ఉంటుంది. విమానం టేకాఫ్ అయితే ఎక్కడా ఆగకుండా 13650 కిలోమీటర్ల వరకు ప్రయాణించేలా డిజైన్ చేస్తున్నారు. ఎయిర్ ఫ్యూయాలింగ్‌తో ఎమర్జెన్సీ సమయంలో..ఎన్నిగంటలైనా ఆకాశంలో ఉంచేలా రూపకల్పన చేస్తున్నారు. విమానంలో రెండు ఫుడ్ గ్యాలరీలు ఉంటాయి. ఈ గ్యాలరీలో ఒకేసారి వంద మంది భోజనం చేయవచ్చు. విమానంలో సుమారు రెండు వేల మందికి అవసరమైన ఆహారాన్ని స్టోరేజీ చేయవచ్చు. ఇక వైద్య పరంగా వెంటిలేటర్, ఐసీయూ, ఆపరేషన్ థియేటర్‌నూ అమర్చుతారు.

ప్రెస్ ఏరియా, కాన్ఫరెన్స్ రూమ్, డైనింగ్ రూమ్‌లు ఉంటాయి. అవసరాన్ని బట్టి గదుల సైజును పెంచుకోవచ్చు.లేక తగ్గించవచ్చు. .టెలివిజన్ సైట్స్, రేడియా సైట్స్, ఫ్యాక్స్ మిషన్ సౌకర్యాలతో పాటు 50కి పైగా టెలిఫోన్ లైన్స్ ఏర్పాటు చేయనున్నారు. విమానాన్ని గురిపెట్టే రాడార్లను జామ్ చేస్తాయి. ఆన్ ఎయిర్ దాడులతో నష్టం జరగకుండా స్పెషల్ విమానాన్ని సిద్ధం చేస్తున్నారు.

డొనాల్డ్ ట్రంప్
ఎయిర్‌ఫోర్స్ వన్..మరో రెండు విమానాలు



అమెరికా అధ్యక్షుడు వాడే ఎయిర్‌ఫోర్స్ విమానం గురించి పెద్దగా చర్చించుకుంటారు. బోయింగ్ 74..200 బీ డబుల్ డెక్కర్ ఇది. ఇది ప్రపంచంలోనే తొలి డబుల్ డెక్కర్ విమానం.


70 మంది ప్రయాణికులతో పాటు 26 మంది క్రూ మెంబర్స్ వెళ్లేలా వినియోగిస్తున్నారు. వీసీ 25 ఏ, బోయింగ్ సీ 32 కూడా వాడుతున్నారు. దీనికి ఎలక్ట్రోమ్యాగ్నెట్ దాడులను నిరోధించే సామర్థ్యం ఉన్నది.

2.వ్లాదిమిర్ పుతిన్..(రష్యా అధ్యక్షుడు)
ఒకే తరహా నాలుగు విమానాలు



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్వదేశీ ఇల్యూషన్ ఐఎల్..96 విమానాన్ని వినియోగిస్తున్నారు. ఇందులో రాడర్ జామింగ్ టెక్నాలజీ ఉన్నది. అయితే నాలుగు విమానాల్లో పుతిన్ ఎందులో ప్రయాణిస్తునారో తెలియకుండా రక్షణా బలగాలు అత్యంత గోప్యంగా ఉంచుతాయి.

3.జింగ్‌పింగ్..(చైనా అధ్యక్షుడు)



ఎయిర్ చైనా బోయింగ్ 747..400 విమానంలో ప్రయాణిస్తుంటారు. ఆయన పర్యటనకు వెళ్లేటప్పుడు విమానంలో ఉన్న సీట్లను తొలగించి..లివింగ్ రూమ్, బెడ్‌రూమ్ కం ఆఫీసుగా మార్చేస్తారు.

4.ఖతర్ అమీర్ తమీమ్ బిన్ హమద్ అల్‌థానీ



ఖతర్ అమీర్ వద్ద ప్రత్యేకమైన విమానాలు బోలెడున్నాయి. ఇందులో ఎయిర్‌బస్ ఏ 320, రెండు ఏ 330, మరో రెండు బోయింగ్ 747..8 ఉన్నాయి. ఆయన పర్యటన ఏర్పాట్ల కోసం వెయ్యిమంది సిబ్బంది అందుబాటులో ఉంటారు.

5.థెరిసా మే..



యూకే ప్రధాని థెరిసా మే వద్ద ప్రత్యేకమైన విమానం ఉన్నది. ఎయిర్‌బస్ ఏ 3301 విమానంలో ఫ్రంట్ క్యాబిన్ వద్ద చిన్న వీఐపీ జోన్ ఉంటుంది. ఇక్కడ 58 మంది కూర్చొనే విధంగా..ప్రీమియర్ స్టయిల్ సీట్లు ఉంటాయి. సిబ్బంది, మంత్రివర్గ బృందం వెళ్లవచ్చు.

6.ఏంజెలా మెర్కెల్..జర్మన్ ఛాన్సలర్



జర్మన్ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ అవసరాన్ని బట్టి విమానాలను వినియోగిస్తుంటారు. ఆమె వాడే రెండు విమానాలు పేరుల కోన్‌రాడ ఎకిన్వార్, థియోడోర్ హిఆమ్

రెండు ఎయిర్‌బస్ ఏ 340..212 ఎక్సను 2011లో ఆధునీకరించారు. ఇందులో 150 మంది ప్రయాణించవచ్చు. జర్మన్‌లోని అతిపెద్ద ఎయిర్‌లైన్ సంస్థ లూఫ్తాన్సా ఎయిర్‌బేస్ ఏ 340 ఛాన్సలర్ వెళ్లేలా ఆధునీకరించింది. ఈ విమానంలో బెడ్‌రూమ్‌తో పాటు భద్రతాపరమైన అంశాలపై ఎక్కువ దృష్టిపెట్టి డిజైన్ చేశారు.

మరో రెండు ఎయిర్‌బస్ ఏ 319, బాంబార్డియర్ గ్లోబియల్ 5000 విమానాలున్నాయి. వీటన్నింటిలో యాంటీ మిస్సైల్ టెక్నాలజీ ఉన్నది. దేశీయ పర్యటనకు యూరోక్రాఫ్ట్ ఏఎఎస్532ను వినియోగిస్తారు.

7.ఇమ్మానియూల్ మేక్రాన్ (ఫ్రాన్స్ అధ్యక్షుడు)



ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానియూల్ మేక్రాన్ ఎయిర్‌బస్ ఏ 330..200ను వాడుతున్నారు. ఇందులో బెడ్‌రూమ్, డ్రెస్సింగ్ రూమ్, కిచెన్, ఆఫీస్, సౌండ్ ప్రూఫ్ నెగిషియన్ రూమ్ కూడా ఉంటుంది. మీడియా సమావేశాలకు ప్రత్యేక వసతి ఉన్నది.

8.బ్రూనై సుల్తాన్ వద్ద పసిడి విమానం



బ్రూనై సుల్తాన్ వద్ద ఉన్న విమానాన్ని ఫ్లైయింగ్ ప్యాలెస్‌గా అభివర్ణిస్తారు. ఆయన వినియోగించే విమానంలో వజ్ర వైఢూర్యాల నగిషీలతో చెక్కి ఉంటుంది. ఈ విమానంలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి.

గన్‌మెన్లు...జాగ్రత్త

- **నక్సల్స్ ప్రభావిత మంత్రులు, ప్రజాప్రతినిధుల అంగరక్షకులకు ఐఎస్‌డబ్ల్యూ నుంచి హెచ్చరికలు**
- **అప్రమత్తంగా లేని గన్‌మెన్లను తప్పించే యోచనలో ఉన్నతాధికారులు**


ఫైల్

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో మంత్రులు మొదలుకుని ఇతర ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పిస్తున్న అంగరక్షకులు తమ విధుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సెక్యూరిటీ విభాగానికి చెందిన ఉన్నతాధికారులు హెచ్చరించినట్టు తెలిసింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ నక్సల్స్ ప్రభావిత జిల్లాలకు చెందిన మంత్రులు , ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఇతర ప్రజాప్రతినిధులకు ఉన్న గన్‌మెన్లకు ప్రత్యేకంగా సూచనలు అందినట్టు తెలిసింది. ఇటీవలన రాష్ట్ర సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో పది మంది మావోయిస్టులు మరణించడంతో ... ఉత్తర తెలంగాణలో మావోయిస్టులు ఏదేని భారీ సంఘటనలకు పాల్పడే ప్రమాదం ఉన్నదని నిఘా వర్గాల నుంచి హెచ్చరికలు ఉన్నాయి. అదే సమయంలో టీఆర్ఎస్ నాయకులపై దాడులు జరుపుతామంటూ మావోయిస్టులు చేసిన హెచ్చరికపైనా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేకించి దృష్టిని సారించారని తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిదుల రక్షణ కోసం నియమించబడ్డ గన్‌మెన్‌లలో చాలా వరకు అలర్ట్‌గా ఉండటం లేదని ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌కు చెందిన ఉన్నతాధికారులకు సమాచారం ఉన్నట్టు తెలిసింది. కొందరు ప్రజాప్రతినిధులతో కొందరు అంగరక్షకులు సొంత మనుషులుగా మెలుగుతూ వారికి కచ్చితంగా నిర్దేశించిన పనులకు బదులు సొంత పనులు చేయడంలో ఆసక్తిని చూపిస్తున్నారని అధికారులకు సమాచారం ఉన్నట్టు తెలిసింది. కేవలం ఆయుధాలను ధరించి 24 గంటలు తమ ప్రొటెక్టీ(రక్షితుడి)కి సెక్యూరిటీని కల్పించాలని, వారికి సంబంధించిన ఇతర పనులేమీ చేయరాదని గన్‌మెన్‌లకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. ఆ విధంగానే నిబంధనలు ఉన్నాయి. అయినప్పటికీ కొందరు ప్రజాప్రతినిధుల వద్ద ఉన్న గన్‌మెన్లు వీటిని అతిక్రమిస్తున్నట్టు తెలుస్తోంది. మరో వైపు ప్రొటెక్టీలు సైతం వారికి తమ సొంత పనులను అప్పగించడం వలన ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొందరు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఇతర వీఐపీల రక్షణ కోసం నియమితులైన గన్‌మెన్ల పని తీరుపైనా ఉన్నతాధికారులు అంతర్గతంగా ఆరా తీస్తున్నారని తెలిసింది. అలాగే దీర్ఘకాలం అంగరక్షకులుగా ఉన్న వారెంత మంది అనే వివరాలు కూడా సేకరిస్తున్నారని సమాచారం. అలాంటి వారిని ఈ విధుల నుంచి తప్పించి పీఎస్‌ఓలుగా శిక్షణ పొందిన వారికి ఈ విధులను అప్పగించాలనే యోచనలో ఉన్నతాధికారులు ఉన్నారని తెలుస్తోంది.

ఇక రక్షణ పొందుతున్న ప్రొటెక్టీలు సైతం గన్‌మెన్లను తమ సొంత విధులకు వాడుకోరాదని, అలా జరిగితే తమ ప్రాణాలకు శత్రువు నుంచి ముప్పు ఏర్పడుతుందనే నిజాన్ని మరువరాదని కూడా ఉన్నతాధికారులు సూచిస్తున్నారని తెలిసింది. రాష్ట్రంలో దాదాపు ఐదు వందల మందికి పై గా ఏఆర్ కానిస్టేబుళ్లు సెక్యూరిటీ విధుల్లో ఉన్నారని అధికార వర్గాలు తెలిపాయి.

బలవుతున్న బాల్యం

- **వారం రోజుల్లో మూడు నివేదికలు.. మూడింట్లో బాలలే బాధితులు!**
- **ఆరోగ్యం, మేని ఛాయ కలిగిన అనాథ పిల్లల్నే దత్తత తీసుకుంటున్న ఇండియన్స్..**
- **రుగ్మతలతో బాధపడుతోన్న అనాథ చిన్నారులను చేరదీస్తోన్న ఎన్ఆర్ఐ/విదేశీయులు: సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ**
- **ఫ్యామిలీ మెంబర్స్ ను చూసి పొగ తాగడాన్ని నేర్చుకుంటున్న 6.25లక్షల మంది చిన్నారులు: అమెరికన్ క్యాన్సర్ సొసైటీ**

కడవేర్గు

"పాప చురుగ్గా ఉన్నప్పటికీ, కొంచం రక్తహీనతతో బాధ పడుతున్నట్టు అనిపిస్తోంది. ఇంకొకరిని చూపించండి" దత్తత తీసుకోవడానికి వచ్చిన ఓ ఇండియన్ దంపతుల మాట!

"మా అన్నయ్య సిగరెట్ స్టైల్ గా కాలుస్తాడు. నేనెందుకు ట్రై చెయ్యకూడదు?" - ఆరో తరగతి అబ్బాయి ప్రశ్న.

గత వారం రోజుల్లో వెలువడిన మూడు అధ్యయనాలు.. చిన్నారుల ఆలోచనలు, పిల్లలపై పెద్దల, ప్రభుత్వాల వైఖరి తదితరాలను విభిన్న పార్శ్వాల్లో ఆవిష్కరించడం విశేషం.

లోపం ఉంటే మాకొద్దు:

అమ్మా నాన్నల ప్రేమకు, అయినవాళ్ళ అనురాగానికి నోచుకోలేని పసిపిల్లలు ఎందరో అనాథ శరణాలయాల్లో, చైల్డ్ కేర్ సెంటర్లలో స్వచ్ఛమైన ప్రేమ, ఆప్యాయత కోసం పరితపిస్తుండటం తెలిసిందే! మాత త్వపు పరిమళాలను ఆస్వాదిస్తూ.. తల్లిదండ్రులు లేని ఆ పసి హృదయాలను దత్తత తీసుకొని.. మాత మూర్తులుగా మారాలనుకొనే పిల్లలు లేని దంపతుల తపనను కూడా మెచ్చుకోవాల్సిందే! ఐతే, సదరు దత్తత ప్రక్రియలో కూడా పసివారిపై మన దేశీయులు వివక్షను చూపుతున్నట్టు తేలడం విస్తుగొలుపుతోంది. కాళ్లు, చేతులు, ముక్కు, నోరు, రంగు, ఆరోగ్యం, వయస్సు ఇలా ఇవన్నీ సరిగ్గా ఉంటేనే మన భారతీయులు పిల్లల్ని దత్తత తీసుకోవడానికి ముందుకు వస్తున్నారని, ఇదే విషయంలో ఎన్ఆర్ఐ/విదేశీయులకు అంతగా పట్టింపు ఉండట్లేదని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ(కారా) తాజా గణాంకాలు తెలిపాయి. 2017-18 లో సుమారు 552 మంది చిన్నారులను ఎన్ఆర్ఐ/విదేశీయులు దత్తత తీసుకోగా.. ఇందులో సుమారు 60శాతం మంది పసివారు శారీరకంగా లేదా మానసికంగా ఎంతో కొంత బాధతో ఉన్నవారేనని, సుమారు 90శాతం చిన్నారుల వయస్సు ఆరు సంవత్సరాల పైబడే ఉన్నట్టు తేలింది. అయితే, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను దత్తత తీసుకునే ఎన్ఆర్ఐ/విదేశీయులు గత సంవత్సరంతో పోలిస్తే, ఈ యేడాది పది శాతం పెరగ్గా, స్వదేశీయుల సంఖ్య మరింత తగ్గడం గమనార్హం. కాగా, మన పిల్లల్ని దత్తత తీసుకునే దేశాల్లో అమెరికా, ఇటలీ, స్పెయిన్ దేశాలు ముందు వరుసలో ఉన్నాయి.

వాళ్ళను చూసే :

తెలిసీ తెలియని పసి మనసు.. ఇతరులు ఏం చేస్తే, అదే అనుసరించే మనస్తత్వం... వెరసి, పొగరాయుళ్ళ ఆకర్షణకులోనై (



ముఖ్యంగా ఫ్యామిలీ మెంబర్స్ మూలంగా) తమ జీవితాలను కోల్పోతున్న బాలభారతంను చూసి పలువురు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. దేశంలో పది నుంచి 14ఏండ్ల వయసు కలిగిన సుమారు 6.25లక్షల మంది చిన్నారులు (4.29లక్షల మంది అబ్బాయిలు, 1.95లక్షల మంది అమ్మాయిలు) రోజూ పొగతాగుతున్నట్టు అమెరికన్ క్యాన్సర్ సొసైటీ(ఏసీఎస్), వైటల్ స్ట్రాటజీస్ సంస్థలు గ్లోబల్ టుబాకో అట్లాస్ డేటా పేరుతో



సంయుక్తంగా చేసిన తాజా అధ్యయనంలో తేలడం విస్తుగొలుపుతోంది. కాగా, భారత్‌లో పొగాకు మూలంగా సంభవించే క్యాన్సర్లు, గుండెపోటు సంబంధిత వ్యాధుల వల్ల ఏటా 9.32లక్షల మంది ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

ఎంత శాతం పెరిగారో తెలుసా?:

పేదరికం, సామాజిక, కుటుంబ ఆర్థిక పరిస్థితులను ఆసరా చేసుకొని కొన్ని ముఠాలు పిల్లల్ని బలవంతంగా అపహరించి



మహనగరాల్లో భిక్షాటనకు వినియోగిస్తుండటం.. ఇంకొన్ని సందర్భాల్లో బాలికలను పడుపు వ త్తిలోకి దింపుతుండటం తెలిసిందే! ఇలాంటి ఘటనలు దేశంలో ప్రతీ ఏటా క్రమంగా పెరుగుతున్నాయని తెలిసినా.. మన ప్రభుత్వాల్లో చలనం మాత్రం రావడం లేదు. గత దశాబ్ద కాలంలో మన దేశంలో చిన్నారులపై అఘాయిత్యాలు/ అపహరణ కేసులు ఏకంగా 500శాతం పెరగడం(2016 లో నమోదైన కేసులు1,06,958 కాగా, 2006 లో నమోదైన కేసుల సంఖ్య 18,967) ఆందోళనను కలిగిస్తోంది. గత పదేండ్లలో చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలపై నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో విడుదల చేసిన నివేదికలను పరిశీలిస్తే, ఈ విషయం అర్థమైందని.. ఇప్పటికైనా, పిల్లలను అపహరించే ముఠాలపై ప్రభుత్వాలు గట్టి నిఘాను పెట్టే అవసరమున్నదని 'క్రై చైల్డ్ రైట్స్ అండ్ యూ' స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు.

సర్కారు అనుమతి లేకుండానే లిస్టు వర్సిటీకీ..!

- **స్పోర్ట్స్‌కోటా మెడికల్ సీట్ల వ్యవహారం**
- **ఫైనల్ లిస్టుపై సాట్స్ డైరెక్టర్ సంతకం కూడా కరువు.?**

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్


స్పోర్ట్స్‌కోటాలో మెడికల్ సీట్ల కేటాయింపు వ్యవహారంలో మరో నిర్లక్ష్యం వెలుగుచూసింది. తుది ప్రాధాన్యత లిస్టు ప్రభుత్వ అనుమతి లేకుండానే కాళోజీ నారాయణ హెల్త్ యూనివర్సిటీకి చేరింది. చిత్రంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ(సాట్స్) డైరెక్టర్ సంతకం కూడా లేదని తెలుస్తోంది. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించి, విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకున్న అధికారులపై ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.



2017-18 విద్యాసంవత్సరానికి సంబం ధించి స్పోర్ట్స్ కోటా మెడికల్ సీట్లలో అక్రమాలు జరిగిన తీరును 'నవతెలంగాణ' గత రెండు నెలలుగా వరుస కథనాలతో వెలుగులోకి తీసుకొచ్చింది. దీనికి స్పందించిన సాట్స్ అధికారులు ద్విసభ్య కమిటీ నియమించారు. ఆ కమిటీ తన నివేదికనూ అధికారులకు అందించింది. ఈ రిపోర్టు సరిగా లేదని ఇద్దరు సీనియర్ అధికారులతో మరో కమిటీని ప్రభుత్వం వేసింది. ఆ కమిటీ విచారణ చేసింది. మొదటి కమిటీ నివేదికలోనే తప్పు జరిగినట్టు పేర్కొన్నారు. వాస్తవానికి స్పోర్ట్స్ కోటా సీట్ల కేటాయింపుపై జీవోనెంబర్ 8 ప్రకారం ప్రభుత్వ కార్యదర్శి(స్పోర్ట్స్) చైర్మెన్‌గా, సాట్స్ ఎండీ కన్వీనర్‌గా ఏడుగురితో కూడిన కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ సాట్స్ ఉన్నతాధికారులు అదేదీ పట్టించుకోకుండా కేవలం డిప్యూటీ డైరెక్టర్లు, కోచ్‌లతో కూడిన కమిటీని వేసి సర్టిఫికేట్ల పరిశీలన చేశారు.

చివరికి ప్రభుత్వ కార్యదర్శి అనుమతి తీసుకోకుండానే తుది ప్రాధాన్యత లిస్టును కాళోజీ నారాయణరావు హెల్త్‌యూనివర్సిటీకి పంపించారు. కనీసం సాట్స్ ఎండీ సంతకం కూడా ఆ లిస్టుపై లేదని తెలుస్తోంది. స్పోర్ట్స్‌కోటాలో మెడికల్, ఇంజినీరింగ్, ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి ఎలాంటి ఫైనల్ ప్రెయార్టీ లిస్టును సర్కారు ఆమోదించలేదని వారం రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. భరత్‌చంద్రారెడ్డి అనే విద్యార్థి సమాచార హక్కు చట్టం ద్వారా అడిగిన ప్రశ్నకు ప్రభుత్వ అధికారులు ఈ మేరకు సమాధానమిచ్చారు. అయితే ప్రాథమిక విచారణలోనే పొరపాటు జరిగినట్టు సర్టిఫికేట్లను పరిశీలించిన కమిటీ సభ్యులు ఒప్పుకున్నా, ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ తతంగంలో ఉన్నతాధికారుల పాత్ర కూడా ఉందనే వాదనలూ వినిపిస్తున్నాయి.

సిటిజెన్స్ స్పెషాలిటీ హాస్పిటల్ లాప్రోస్కోపిక్ కోలేసిస్టెక్టమీ సదస్సు



హైదరాబాద్ : సిటిజెన్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి... 'సాధారణం నుంచి కష్టంగా' అనే థీమ్‌తో లాప్రోస్కోపిక్ కోలిసిసెక్టమీ సదస్సు శనివారం నిర్వహించింది. హైదరాబాద్, నల్లగండ్లలోని ఆస్పత్రి ఆవరణలో అసోసియేషన్ ఆఫ్ సర్జన్ ఆఫ్ ఇండియా(ఎఎస్ఐ), తెలంగాణ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సిటిజెన్స్ స్పెషాలిటీ ఆస్పత్రి లాప్రోస్కోపిక్, బారియాట్రిక్స్ సర్జన్ చీఫ్ జనరల్ డాక్టర్ సురేశ్ చంద్ర హరి అధ్యక్షత వహించారు. ఈ సదస్సుకు భువనగిరి పార్లమెంట్ సభ్యులు బూర నర్సింహ గౌడ్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. గాల్ బ్లాడర్ స్టోన్స్(పిత్తాశయ రాళ్లు) శస్త్ర చికిత్స నిర్వహణలో చోటు చేసుకున్న తాజా పరిణామాలు, కొత్త చికిత్సలు, లాప్రోస్కోపిక్ కోలేసిస్టెక్టమీలో తాజా పురోగతిపై వైద్యుల సమాచారాన్ని సమీకరించుకోవడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సురేశ్ చంద్ర మాట్లాడుతూ... లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్స ద్వారా గాల్ స్టోన్స్ నిర్వహణలో ఇటీవల అభివృద్ధి చెందిన చికిత్సల ప్రకారం తక్కువగా నొప్పితో 2-3 రోజుల్లోనే కోలుకునే అవకాశముందని తెలిపారు. ఈ సదస్సులో 120కి పైగా ప్రముఖ శాస్త్ర వైద్యులు పాల్గొన్నారు.


'హౌస్‌బిల్డింగ్' అక్రమార్కులకు నోటీసులు

- **స్థల పరిశీలన కోసం ప్రత్యేకాధికారి నియామకం**
- **ఎట్టకేలకు కదిలిన పాఠశాల విద్యాశాఖ**
- **13 మందికి చెందిన ఫైల్ మాయం!**
- **అధికారులపై చర్యలకు రంగం సిద్ధం!**

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

హౌస్‌బిల్డింగ్ అడ్వాన్స్‌ల వ్యవహారంపై ఎట్టకేలకు పాఠశాల విద్యాశాఖ అధికారుల్లో కదలిక మొదలైంది. అడ్వాన్సులు పొందిన ఉద్యోగులందరికీ నోటీసులు జారీ చేయాలనీ ఆ శాఖ కమిషనర్ జి కిషన్...హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి వెంకటనర్సమ్మను ఆదేశించారు. ఈ వ్యవహారంతో సంబంధమున్న కొందరు ఉద్యోగులపై త్వరలో వేటు వేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. దీనికితోడు అక్రమంగా అడ్వాన్స్‌లు పొందిన వారి నుంచి మొత్తం డబ్బుంతా ఒకేసారి సర్కారుకు తిరిగి చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నది. అయితే మొదటి విడతలో రుణాలు పొందిన 13 మందికి చెందిన ఫైల్ మాయం అయినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రస్తుతం హౌస్‌బిల్డింగ్ అడ్వాన్స్‌ల వ్యవహారం విద్యాశాఖలో ప్రకంపనలు సృష్టిస్తోంది. 73మంది ఉద్యోగులు ప్రభుత్వం నుంచి అడ్వాన్స్‌లు పొందినా, నేటికీ ఏ ఒక్కరూ ఇల్లు కట్టలేదు సరికదా..కనీసం పునాదులు కూడా తీయలేదు. ఈ వ్యవహారాన్ని నవతెలంగాణ 'ఇంటిగుట్టు' శీర్షికతో వారం రోజుల క్రితం వెలుగులోకి తీసు కొచ్చింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం హైద రాబాద్ ఆర్‌జేడీ విజయలక్ష్మిబాయిని విచార ణాధికారిగా నియమించారు. ఇప్పటికే హైదరాబాద్ డీఈఓ వెంకటనర్సమ్మ ప్రాథమిక నివేదిక పాఠశాల విద్యాశాఖ అధికారులకు అందించారు. దీనిలో ఇండ్ల నిర్మాణం ప్రారంభం కాకుండానే అక్రమంగా నిధులు పొందినట్టు గుర్తించారు. దీనిపై స్పష్టత కోసం విద్యాశాఖ డిప్యూటీఈఈ ప్రదీప్‌ను నియమించారు. ఆయన ఉద్యో గులు ప్రభుత్వానికి చూపించిన స్థలాన్ని పరిశీలించి, నిర్మా ణాలు ఉన్నాయా..? లేదా అనే అంశంపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ సోమిరెడ్డి హయాంలో 13మంది ఉద్యోగులు మూడు విడతల హౌస్ బిల్డింగ్ అడ్వాన్స్‌లు పొందారు. డీఈఓ రమేశ్ హయాంలో అడ్వాన్స్‌లు పొందిన 60మంది ఉద్యోగుల్లో ఆరుగురు మూడు విడతలు, మిగిలిన వారంతా రెండు విడతల అడ్వాన్స్‌లు అందినట్టు సమాచారం. హౌస్‌బిల్డింగ్ అడ్వాన్స్‌లు పొందాలంటే కనీసం 8 సంవత్సరాల సర్వీస్ ఉండాలి. కానీ ప్రస్తుతం లోన్లు తీసుకున్న వారిలో కొందిమందికి అంత సర్వీస్ కూడా లేదని తెలుస్తోంది. హౌస్‌బిల్డింగ్ అడ్వాన్స్‌ల సెక్షన్‌తో సంబంధం లేని ఓ సీనియర్ అసిస్టెంట్ దీన్ని నిర్వహించడంపై పలు ఆరోపణలు వస్తున్నాయి. ఈ అడ్వాన్స్‌ల వ్యవహారంలో డీఈఓ ఆఫీస్‌లోని నలుగురు కిందిస్థాయి అధికారుల పాత్ర ఉన్నట్టు తెలుస్తోంది. ఇటీవల అడ్వాన్స్‌లు పొందిన ఉద్యోగులంతా ఉద్యోగ సంఘం నేతలతో కలిసి..విద్యాశాఖ కమిషనర్‌ను మూడురోజుల క్రితం కలిశారు. ఇండ్ల నిర్మాణానికి మరో ఏడాది సమయం ఇవ్వాలని కోరగా, ఆయన ససేమిరా అన్నట్టు తెలిసింది. అయితే ఈ వ్యవహారం నుంచి బయట పడేస్తామంటూ కొందరు ఒక్కో ఉద్యోగి నుంచి రూ.30వేల నుంచి రూ.50వేల వరకూ వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే స్థలం కొనుగోలుకు మొదటి విడత, నిర్మాణం ప్రారంభం అయ్యాకే రెండో విడత, రూఫ్ లెవల్ పూర్తయ్యాక మూడో విడత అడ్వాన్స్ తీసుకోవాలని నిబంధనలున్నాయి. కానీ అదేదీ లేకుండా నిధులు మంజూరు చేయడం వెనుక ఉన్నతాధికారుల హస్తం కూడా ఉన్నట్టు స్పష్టమవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా అడ్వాన్స్‌లు పొందిన ఉద్యోగులపై చర్యలు తీసుకోకుండా, ఉద్యోగం సంఘం నేతలు ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్టు తెలుస్తోంది. అయితే నిబంధనల ప్రకారం సమగ్ర విచారణ జరిపి, అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ జి కిషన్ 'నవతెలంగాణ'తో చెప్పారు.




ఉన్నతాధికారులకు టీఆర్ఎస్ నేత ఫిర్యాదు

హౌసింగ్ అడ్వాన్స్‌ల వ్యవహారంపై టీఆర్ఎస్ నాయకుడు సయీద్ సిరాజుద్దీన్ ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సర్కారును మోసం చేసి అక్రమంగా అడ్వాన్స్‌లు పొందిన ఉద్యోగులపై, వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యాశాఖతో పాటు ఈఎస్ఐ, జూపార్క్, కోఠి హాస్పిటల్, పే అండ్ అకౌంట్స్ ఆఫీస్ ఉద్యోగులూ సుమారు 350 వరకు ఇదే తరహాలో అడ్వాన్స్‌లు పొందారని వారిపైనా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులకు, విజిలెన్స్, ఏసీబీకి ఫిర్యాదు చేశారు.

నవతెలంగాణ 3వ వార్షికోత్సవం

ఆదర్శ కమ్యూనిస్టు మానికొండ



యు.రామకృష్ణ

సాధారణ విజ్ఞానం కలిగి, సాధారణ స్థానాల్లోనే వుండి బాధ్యత వహించి పని చేసిన విప్లవకారుడు మానికొండ సుబ్బారావు. ఆయన 1918లో కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా నందమూరులో జన్మించారు. బాల్యంలోనే తండ్రిని కోల్పోయారు. తల్లి బుల్లెమ్మ గొప్ప సంస్కారవతి. మానికొండ చదువులో ఆలస్యంగా ప్రవేశించాడు. బందరు హిందూ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులయ్యాక బీవీఎస్సీ కోర్సులో ప్రవేశించాడు. ఒకటి రెండేండ్లు చదివి అక్కడ జరిగే అన్యాయాలకు, అక్రమాలకు వ్యతిరేకంగా చదువుకు స్వస్తి చెప్పి స్వగ్రామం చేరాడు.

మానికొండకు 19వ ఏట వివాహమ్యైంది. అంత చిన్న వయసులోనూ వివాహ సందర్భంగా మానికొండ నూతన ప్రమాణాలు నెలకొల్పారు. కట్న కానుకలు లేకుండా సూర్యావతిని వివాహం చేసుకున్నారు. నాటి కమ్యూనిస్టు ప్రముఖుడు అన్నాప్రగడ కామేశ్వరరావు గుంటూరు జిల్లా మంతెనవారిపాలెంలో 'విద్యా వనం' అనే ఆదర్శ పాఠశాల ప్రారంభించారు. తుమ్మల వెంకట సుబ్బయ్య మొదలైన మిత్రులతో కలిసి సేవాదృష్టితో మానికొండ ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ప్రవేశించారు. కొంతమంది కమ్యూనిస్టుల ఆచరణను ప్రత్యక్షంగా చూడగలగటం, ఇవన్నీ పెనవేసుకొనే ఆయన కమ్యూనిస్టు పార్టీలో చేరడానికీ, కార్యాచరణకూ ప్రేరేపించాయి. పార్టీకి అతి క్లిష్ట సమయం అది. నందమూరులో మానికొండ ఇల్లు పార్టీ కార్యకర్తల రహస్య సమావేశాలకు స్థావరంగా, రక్షణ దుర్గంగా తయారైంది. కృష్ణాజిల్లా కమ్యూనిస్టు కమిటీ ఆ రహస్య కాలంలో జయప్రదంగా నడవడానికి మానికొండ ప్రధాన పాత్ర వహించారు. గన్నవరం తాలూకాలో బలమైన కమ్యూనిస్టు పార్టీని నిర్మించారు.

1945-46 నాటికే మానికొండ కుటుంబం ఆదర్శ విప్లవ కుటుంబంగా పేరొందింది. మానికొండ తాను కమ్యూనిస్టుగా ఉద్యమంలోకి దిగడంతోనే ఆగిపోకుండా భార్య సూర్యావతిని విప్లవనారిగా తయారు చేశారు. తల్లి బుల్లెమ్మను విప్లవ మాతగా తీర్చిదిద్దారు. సాధారణంగా తల్లులు తమ బిడ్డలు పెద్ద ఉద్యోగాలు సంపాదించి ఆర్జనాపరులై ప్రయోజకులు కావాలని ఆశిస్తారు. కానీ ఆవిడ తన ఒక్కగానొక్క కుమారుడు కష్టభూయిష్టమైన కమ్యూనిస్టు కార్యకర్త జీవితాన్ని ఎంచుకున్నందుకు చింతించలేదు. గోర్కీ నవల 'అమ్మ'లోని నిలోవ్నాను తలపింపచేసింది. మానికొండ ఇంటికెందరెందరో వచ్చి పోతుండేవారు. వారినందరినీ తన బిడ్డల్లాగా ఆదరించింది. ఆమె 'కమ్యూన్' నిర్వహించారు. పార్టీ కోసం సభ్యులు, కార్యకర్తలు తమ ఆస్తిపాస్తులను సమర్పించాలని పిలుపు ఇచ్చినప్పుడు మానికొండ దంపతులు తమ ఆస్తి యావత్తూ పార్టీకి సమర్పించారు. తన కొడుకూ కోడలూ వాళ్ల వంతు ఆస్తిని పార్టీ కోసం త్యాగం చేసినప్పుడు బుల్లెమ్మగారు వారిని ప్రోత్సహించారు.

మానికొండ సూర్యావతి సర్పంచ్‌గా, ఎంపీపీగా, శాసనమండలి సభ్యురాలుగా పని చేశారు. నాటి భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పిసి.జోషి మానికొండను ప్రజాస్వామిక భర్త అనీ, ఆదర్శ కమ్యూనిస్టు రివల్యూషనరీ భర్త అనీ అభివర్ణించారు. 1975 జనవరి 27వ తేదీన కృష్ణాజిల్లా కాటూరులో పార్టీ నిధి వసూళ్ల కార్యక్రమంలో వుండగా ఆయన గుండెపోటుకు గురయ్యారు. సొంత లాభం సొంతం మానుకొని ప్రజల కోసం అహర్నిశలూ పని చేసిన ఆదర్శమూర్తి మానికొండ. ■

నిరాడంబర జీవితం

చెన్నుపాటి చంద్రశేఖరరావు

నేను మొదటిసారిగా మానికొండ సుబ్బారావు గారిని 1973లో ఎన్.వి.భాస్కర్‌రావు గారి ఇంటివద్ద కలిశాను. వారి పెద్దమ్మాయి విజయవాణితో నా వివాహం గురించి మాట్లాడే సందర్భంలో ఈసమావేశం జరిగింది. నాగార్జుననగర్ కాలనీలో భాస్కర్‌రావుగారి ఇంటి ఎదురుగా ఉండే యలమంచిలి లక్ష్మయ్య గారి సతీమణి తాయారుగారు నా గురించి సుబ్బారావు, సూర్యావతిగార్లకు తెలియజేశారు. తాయారుగారు అభ్యుదయ రచయిత్రి, సీపీఐ అభిమాని. అప్పుడు నేను నక్సలైటు పార్టీకి గట్టి అభిమానిగా ఉన్నాను. నా తల్లితండ్రులు, పెదనాన్నలంతా వరంగల్ జిల్లాలో మార్క్సిస్టు పార్టీకి గట్టి అభిమానులు. మా ఇల్లు మార్క్సిస్టుపార్టీకి రాజకీయకేంద్రంగా ఉండేది.

మానికొండ దంపతుల గురించి మా కుటుంబంలోనూ, మా ఊరిలోని పార్టీ అభిమానులూ గొప్పగా మాట్లాడుకోవటం వింటూ ఉండేవాడిని కానీ వారినెప్పుడూ చూడలేదు. మొదటిసారి సుబ్బారావుగారిని కలిసినప్పుడు ఆయన చిరునవ్వుతో మాట్లాడే పద్ధతి నన్ను ఎంతగానో ఆకర్షించింది. ఆ సందర్భంలో ఆయనతో మాట్లాడిన రెండు గంటలలో గంటపాటు నా రాజకీయ అభిప్రాయాలను చెప్పటం జరిగింది. ఆ మొత్తం సమయంలో అంతపెద్ద నాయకుడు మధ్యలో ఎక్కడా జోక్యం చేసుకోలేదు. సావధానంగా చిరునవ్వుతో విన్నారు. ఆ తర్వాత ఒక అర్ధగంటసేపు ఆయన నక్సలైట్ ఆలోచనా విధానం ఏవిధంగా తప్పో వివరిస్తూ మాట్లాడారు. చివరగా ఆయన అన్న మాట నీకు రాజకీయ కమిట్మెంట్ ఎక్కువగా ఉంది. కానీ మా అమ్మాయికి అంత అవగాహన లేదు. పార్టీమీద అభిమానం వుంది. మీరు ఇద్దరూ మాట్లాడుకోండి. ఇద్దరూ ఇష్టపడితే నాకు అభ్యంతరంలేదు అన్నారు. సుబ్బారావుగారు పెండ్లి విషయం ఐదు నిమిషాలు మాత్రమే మాట్లాడారు. ఆస్తిపాస్తుల వివరాలు ఏవీ అడగలేదు. నా రాజకీయ అభిప్రాయాలు తెలుసుకొని అవి ఎలా తప్పో వివరించారు.

ఆతర్వాత 26 డిసెంబర్ 1973న నాగార్జుననగర్‌లో కడియాల గోపాలరావుగారి ఇంటిలో సూర్యావతిగారిని మొదటిసారిగా చూశాను. వాణితో మాట్లాడిన తర్వాత మేమిద్దరం పెండ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నాం. 1974 మార్చి 17న కడియాల గోపాలరావుగారి ఇంటిలో 50 మంది బంధుమిత్రులు, రిజిస్ట్రారు సమక్షంలో నిరాడంబరంగా ఉద్దరాజు రామంగారు మా వివాహం జరిపించారు. అతిధులను గోపాలరావుగారు కాలనీలోవున్న పెద్దలను మాత్రమే పిలిచారు. సుబ్బారావుగారి సూచనమేరకు నేను కూడా పదిమంది బంధుమిత్రులను మాత్రమే పిలిచాను. ఆతర్వాత మాఇంటికి వెళ్లి భోజనం చేసి సుబ్బారావుగారు, సూర్యావతిగారు, వాణిలతో కలసి విజయవాడ వెళ్లాం. అప్పుడే ఖమ్మంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయి. మోటూరు ఉదయంగారు వచ్చి సూర్యావతిగారు ఖమ్మం వెళ్లవలసి వుందని కొత్త అల్లుడిని ఇంటికి తీసుకొచ్చి వెళ్లిపోతే ఎట్లాగా అని మదనపడుతున్నదని చెప్పారు. నాకు ఏవిధమైన ఇబ్బంది లేదనీ ఆమెను మహాసభలకు వెళ్లమని చెప్పాను. ఆతర్వాతి రోజు వాణి, నేను వరంగల్ వెళ్లటానికి ఉదయం ఆరు గంటలకు బయలుదేరాము. సుబ్బారావుగారు సైకిల్ వేసుకుని స్టేషన్‌కి వచ్చారు. రైలు కదలటానికి 20 నిమిషాలు సమయముంది. ఆసమయంలో మాట్లాడింది చైనా విప్లవంలో ఎత్తుగడల గురించే. అదంతా నా ఆలోచనలు మార్చే ప్రయత్నమే. ఈ సంబంధం కుదిరిన విషయం తెలిసి కొండపల్లి సీతారామయ్యగారు అభినందిస్తూ కబురు పంపారు. రెండునెలల తర్వాత సుబ్బారావుగారి పినతల్లి చనిపోయిన సందర్భంగా కాసరనేనివారిలంకలో మళ్లీ సుబ్బారావుగారిని కలిశాను. ఆయన నన్ను వేరే బంధువుల ఇంటికి తీసుకువెళ్లి ఒకగంటసేపు విప్లవ ఎత్తుగడలు, పరిస్థితులను అంచనావెయ్యటం వంటి విషయాలు చర్చించారు.

దసరా పండుగకు మేము విజయవాడ వెళ్లాము. అప్పుడు రెండురోజులు ఆయనతో కలసివున్నాం. అదే ఆయనను ఆఖరిసారి చూడటం. ఆయన సైకిల్‌పై తిరగటం, ముఖంలో చిరునవ్వు, కార్యకర్తలతో మాట్లాడే విధానం, ఎదుటివాళ్లు మాట్లాడుతున్నప్పుడు ఎంతసేపైనా ఓపికగా విని ఆ తర్వాత ఆయన అభిప్రాయం చెప్పటం నన్నెంతో ఆకర్షించాయి. ముఖ్యంగా సూర్యావతిగారిని ప్రోత్సహించి మంచి గుర్తింపున్న నాయకురాలిగా చేయటం ఆయన ఔన్నత్యానికి నిదర్శనం. నాకు ఆయన ఇచ్చిన సలహా వ్యాపారం గురించి ఆలోచన వద్దనీ, నాకున్న కమిట్‌మెంట్‌తో పార్టీ పూర్తికాలం కార్యకర్తగా పనిచేస్తే బాగుంటుందనీ, వీలుకాకపోతే ఏదైనా ఉద్యోగం చేస్తూ పార్టీకి సేవచేయమనీ వ్యాపారంచేస్తూ పనిచేయటం సాధ్యంకాదని చెప్పారు. అప్పటికే సంవత్సరంపాటు పరిశ్రమ ఏర్పాటు ప్రయత్నాల్లో ఉన్న నేను నా నిర్ణయాన్ని మార్చుకోలేకపోయాను. కేవలం సంవత్సర కాలంలో అందులోనూ అతికొద్ది సమయం మాత్రమే సాన్నిహిత్యం కలిగిన నాకు జీవితమంతా ఆరాధ్యుడే.

సెల్ : 7382619025

సిద్ధాంతమే బలం... త్యాగాలే పునాదులు



దయ్యపు రాధాకృష్ణ

"న్యాయం గెలుస్తుందన్న మాట నిజమే కానీ గెలిచేదం తా న్యాయం కాదు" అని అం టారు కారల్‌మార్క్స్. కారణా లు ఎన్ని ఉన్నా పరిమితులు తెలిసినా.. త్రిపుర ప్రజలను తమ బిడ్డలుగా చూసుకునే "మాణిక్యం" లాంటి నిరాడం బర ఆదర్శంగల త్యాగధను లున్న "ఎర్రజెండా" పార్టీ ఓడిపోవడం కమ్యూనిస్టులు, అభ్యుదయవాదులు, వామపక్ష అభిమానులు, హేతువాదులు, ప్రగతి కాముకులకు తీవ్రమైన బాధను కల్గించింది.

ముఖ్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ ఈ దేశంలోని పేదప్రజలు, కార్మికుల ప్రయోజనాలే అతిముఖ్యంగా భావించి నిబద్ధత, నిస్వార్థం, త్యాగంతో పని చేయడమే కాకుండా తాము ఏలిన రాష్ట్రాలలో ఆదర్శవంతమైన పాలన అందించింది. ఈ గమనంలో పార్టీ ఎన్నో పరీక్షలకు గురైంది. రాజకీయంగా నష్టపోయింది. ఎంతో మంది నాయకులను, కార్యకర్తల ను బలిదానం చేసుకున్నది. దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులని నమ్మి ఒక మనిషిని మరొక మనిషి, ఒక జాతిని మరో జాతి దోపిడీ చేయని సమసమాజంతో కూడిన అత్యంత మానవీయ సమాజ నిర్మాణం కోసం ఆటంకాలెదురైనా అలుపెరగని ప్రయాణం కొనసాగిస్తూనే ఉన్నది.

ప్రజల ఐక్యతకు, జీవితాలకు అవరోధాలైన అతివాద, మితవాద మత ఉన్మాద, ఉదారవాద విధానాలను సైద్ధాంతికంగా ఎదిరించింది. ఉద్యమాలు చేపట్టింది. మా దేహం ముక్కలైనా ఈ దేశాన్ని ముక్కలు కానివ్వమని అస్సాంలో బోడో వేర్పాటువాద ఉద్య మం, త్రిపురలో త్రిపుర జుబా ఉపజాతి సమితి, బెం గాల్‌లో గూర్ఖాలాండ్ సైద్ధాంతికంగా ఎదురొడ్డింది. దేశంలో మతోన్మాద భావాజాల దాడులను నిలువ రించడానికి విశేషమైన కృషి చేస్తున్నది. ఇది ఎర్రజెండా పార్టీ (సీపీఐఎం) సైద్ధాంతిక నిబద్ధతకు నిలువుటద్దం. సోవియట్ యూనియన్ కుప్పకూలిన అనంతరం ఇంకెక్కడుంది ఎర్రజెండా, కమ్యూనిస్టుల కు కాలం చెల్లిందని భయంకరమైన దాడి చేసిన ఆ సందర్భంలోనే ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలను కూడగట్టి సోషలిజం అజేయమని పెట్టుబడిదారుల విషప్రచారాన్ని సహితం ఎదుర్కొని నిలబడ్డది.

దేశాన్ని సుదీర్ఘకాలంపాటు ఏలిన కాంగ్రెస్ బెంగాల్ అభివృద్ధికి సహాయం చేయలేదు. పారిశ్రా మిక రంగం అభివృద్ధికి తగిన తోడ్పాటునివ్వలేదు. రాష్ట్రాలకున్న అధికారాల మేరకు, ఉన్నంతలోనే పేదప్రజలకు సేవ చేయడం భూపంపిణీ, కౌలుదార్ల కు హక్కులు కల్పించడం, విద్య, ఆరోగ్యం, భద్రత వంటి అంశాలకు ప్రాధాన్యతనివ్వటం జరిగింది. ప్రస్తుతం కేరళ రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన అందిస్తోంది.

ఏ రాష్ట్రంలో పరిపాలనలో ఉన్నా ఆ రాష్ట్ర వనరులలో ఆత్యధిక భాగం అట్టడుగున ఉన్న పేద ప్రజల కొనుగోలు శక్తి పెంచుకోవడానికి మత సామరస్యం, శాంతిభద్రతల వంటి అతిముఖ్యమైన అంశాలకు ప్రాధాన్యతనివ్వటం జరిగింది. నేతలు ఆదర్శంగా ఉండటం, తక్కువ జీతాలు తీసుకోవడం నిరాడంబరంగా ఉండటం, ఎక్కడైనా పొరపాటు జరిగితే సరిదిద్దుకోవడం జరుగుతున్నది. అందుకే ఇన్నేండ్ల వామపక్ష ప్రభుత్వ పాలనలో ఏ ఒక్క అవినీతి అరోపణ వచ్చిన సందర్భాలు లేవు. అంతా నిజాయితీగా, నిబద్ధతతో బూర్జువా ప్రజాస్వామ్య దేశంలో ఇంతకాలం పేదలకు, కష్టజీవులకు అనుకూలమైన ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం, నిలుపుకోవడం అంటే... నేడున్న ప్రపంచీకరణ సామ్రాజ్యవా ద పెట్టుబడిదారుల, మతవాదుల ప్రమాదకర విధానాలను అడ్డుకోవడం, ప్రభుత్వాలను కాపాడుకోవడం పరీక్షగానే ఉంటున్నది. సామ్రాజ్యవాదం, దేశ పెట్టుబడిదారుల దోపిడీ ఆర్థిక విధానాలను వామపక్షాలు అడ్డుకుంటున్నందువల్లనే అందరు కలిసి బెంగాల్‌పై దాడి చేసి తమ దోపిడీకి అడ్డు తొలగించుకున్నారు. ఆర్థిక విధానాలు, కుంభకోణాలలో విసిగి వేసారిన ప్రజలు ప్రత్యామ్నాయం కోరుతున్నారన్న సందర్భంలో అంతవరకు కాంగ్రెస్‌కు అండ గా వున్న కోటీశ్వరులు, కుబేరులు, కాంగ్రెస్‌కు ప్రత్యా మ్నాయంగా బీజేపీని బలపర్చడం మొదలైంది. దే శంలో వామపక్షాలు అభ్యుదయశక్తులు బలహీనమవ డం, ప్రాంతీయ పార్టీల అవకాశవాద రాజకీయాల వలన నేడు బీజేపీ విష కౌగిలిలోకి భారత ప్రజలు చేరువవుతున్నారు.

సూత్రబద్ధ సైద్ధాంతికతతో నిలబడ్డది. కాలానికి తట్టుకొని నిల్చింది. ఆయా సందర్భాలలో దాడులకు, హత్యలకు గురయ్యారు. అయినా తన సైద్ధాంతిక నిబద్ధతను తాకట్టు పెట్టలేదు. కానీ బూర్జువా మతోన్మాద పార్టీలు కుల, మత, వేర్పాటువాద, ఉగ్రవాదు ల ఇలా ఏది, ఏ సందర్భంలో ఉపయోగ పడ్డా, ఆ సందర్భాన్ని ఉపయోగించుకోవడం, లాభపడటం, అవకాశవాదంగా వ్యవహరించడం జరుగుతున్నది. నేడు బీజేపీ త్రిపురలో కుల, మత వేర్పాటువాద ఉగ్రవాద సంస్థలలో జతకట్టి లాభపడింది. వీటికితోడు గా వీరంతా ప్రపంచబ్యాం కుకు తాబేదార్లుగా వ్యవహరించడం, పెట్టుబడిదారు లకు అనుకూలమైన ఆర్థిక విధానాలు అమలు చేయడం, దోచిపెట్టడం, తిరిగి వారి డబ్బుతోనే ప్రజలను కుల, మతాలవారి గా విభజించడం, బలహీనపర్చడం జరుగుతున్నది.

ఎంత అనైతికతా! మెజార్టీ పార్టీలను అధికారంలోకి రానివ్వరు, 2,3, సీట్లు వచ్చినా వారే ముఖ్యమంత్రులు అవుతారు. నేడు దేశంలో ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టించి ఆర్థిక అరాచకాలతో దేశంలో తిరుగులేని శక్తిగా ఎదగాలని బీజేపీ తీవ్ర ప్రయత్నం చేస్తున్నది. చిన్న రాష్ట్రం త్రిపురకు వేల కోట్లు పంచడమా.. ఎంత దారుణం? మళ్లీ దాడులు, హత్యలు, విధ్వంసాలు, ఇదేనా ప్రజాస్వామ్యం? ఇదేనా దేశభక్తి? ఇప్పుడు బీజేపీకి గల ఒక లక్ష్యం స్పష్టంగా ప్రజలకు కన్పిస్తున్నది. ప్రజల కోసం పనిచేయాల్సిన అవసరం లేదనీ జీవన ప్రమాణాలు, అభివృద్ధి, సామరస్యం సాధించడానికి ఆపసోపాలు పడాల్సిన పని లేదని, కారణం ఎంతటి బలమైన రాష్ట్రాన్నైనా "బడ్జెట్"తో కొనేయగలమనీ దాని ద్వారా దేశంలో భయోతోత్పాలను సృష్టించి తాననుకున్న ఏకీకృత పాలనన సాధ్యం చేసుకోవ్చని బీజేపీ భావిస్తున్నది. ఈ ఫాసిజం పోకడలను దేశంలోని అభ్యుదయ, లౌకిక, ప్రజాస్వామిక శక్తులు కలిసికట్టుగా ఎదుర్కోవలసిన అవసరం ఉన్నది.

ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమే. కానీ గెలుపన్నది ప్రజాస్వామ్యయుతంగా ఉండాలి. గతం కన్నా మెరుగైన పాలన అందించడానికి గెలుపు దోహదం కావాలి. కాని అరాచకాలకు, విధ్వంసాలకు వ్యక్తుల, సమూహాల నిర్మూలనకు కాదు. మార్క్సిజం మానవతా సిద్ధాంతం. మార్క్సిజాన్ని నిర్మూలించాలంటే మనిషి నిర్మూలనే జరగాలి. అది మతోన్మాద శక్తులవల్ల కానేకాదు. చరిత్రలో హిట్లర్, ముస్సోలినీలు అంతర్ధానం అయ్యారు. మార్క్సిజ సిద్ధాంతాన్ని మనస్ఫూర నమ్మి ఆచరిస్తున్న కమ్యూనిస్టులు ఎల్లప్పుడు త్యాగాలకు సిద్ధంగానే ఉంటారు. దోపిడీ రహిత సమసమాజం కోసం ప్రయాణిస్తూనే ఉంటారు.

సెల్: 7730877841

సమానత్వంతో కూడిన విద్య కోసం పోరాడుదాం




ఏ.డి.రాము

మనువాద బ్రహ్మణీయ, సాంఘిక, సాంస్కృతిక భావజాల కేంద్రాలుగా విశ్వవిద్యాలయాలను పునరు ద్ధరించడానికి ప్రయత్నాలు జరుగుతున్న సందర్భమిది. విద్యాహక్కును, ఇతర ప్రజాతంత్ర హక్కులను రద్దుచేసే దిశగా పాలకవర్గ విధివిధానాలు రూపుదిద్దుకుంటున్న కాలమిది. 2005లో భారత విద్యారంగాన్ని సేవల రంగంలో చేర్చడం ద్వారా గాట్ ఒప్పంద రథచక్రాలకు కట్టి వేసింది. ఫలితంగా ప్రజలకు విద్య అందించాలన్న సామాజిక బాధ్యత నుండి పాలకులు వైదొలిగారు. ఇది తమ బాధ్యతకాదంటూ బహిరంగంగానే నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నారు. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు అవసరమైన కమిషన్లను ఏర్పరిచి అనుకూలమైన సిఫార్సులను పొందుతున్నారు. బిర్లా, కుమారమంగళం, అల్‌ఫ్రెడ్, యశ్‌పాల్ తదితర కమిషన్ల సిఫార్సులే ఇందుకు ఉదాహరణ. చదువుకయ్యే ఖర్చు విద్యార్థే భరించాలి. విద్యారంగం నిర్వాహణకు అయ్యే వ్యయాన్ని స్వయంగా సమకూర్చుకోవాలన్నది ఈ సిఫార్సుల సారాంశం. పారిశ్రామిక రంగంలో ఉమ్మడి కంపెనీలు ఏర్పడినట్టే విద్యారంగంలోనూ స్వదేశీ, విదేశీ విద్యాసంస్థలు ఉమ్మడిగా ఏర్పడుతున్నాయి. బిర్లా, అంబానీ, జిందాల్, టాటా వంటి కంపెనీలకు "స్పెషల్ ఎడ్యుకేషన్ జోన్ల"ను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారు. తద్వారా ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. విదేశీ పెట్టుబడులు, విద్యాసంస్థలు మనదేశంలోకి ప్రవేశించడానికి పూర్తి స్వేచ్ఛ కల్పించారు. దీనితో విద్య అంగడి సరుకైంది. లాభాపేక్షతో అన్ని స్థాయిల్లో విద్యాసంస్థలు ఏర్పాటై నడుస్తున్నాయి. కొనుక్కున్నవారికే చదువు అన్న నియమం ప్రకారం చదువులు కొనసాగుతున్నాయి. దీంతో ఉన్నత విద్య మౌలికంగా అంతర్జాతీయ చట్టబద్ధ సరుకుగా మారింది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)కు చట్టబద్ధ విభాగమైన ట్రేడ్ పాలసీ రివ్యూ మెకానిజం (టీపీఆర్‌ఎం) మనదేశ ఉన్నత విద్యా చట్టాలను, కార్యకలాపాలను సమీక్షిస్తుంది. ఇది రాజ్యాంగం కల్పించిన సమానత్వం, సమన్యాయ పంపిణీ సిద్ధాంత స్ఫూర్తికే వ్యతిరేకం. సామాజిక న్యాయానికి విఘాతం. అందరికీ సమానత్వంతో కూడిన విద్య అందుబాటులో లేకుండా సామాజిక అసమానతలు మరింత పెరగడానికి దారితీస్తుంది. విద్యార్థుల మధ్య అంతరాలు, విద్యా అసమానతలు పెరుగుతాయి. విశ్వవిద్యాలయాల్లో ప్రజాస్వామిక వాతావరణం దెబ్బతిన్నది. విద్యార్థుల ప్రజాస్వామిక హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతున్నది. విద్యార్థి సంఘ ఎన్నికలు లేకపోవడం ఇందుకు నిదర్శనం. విశ్వవిద్యాలయాల నిర్వాహణకు అవసరమైన విధివిధానాల రూపకల్పనలో విధిగా ఉండవలసిన బోర్డ్ ఆఫ్ స్టడీస్, స్టాండింగ్ కమిటీ వగైరాలలో విద్యార్థులకు భాగస్వామ్యమే లేకుండా పోయింది.

దేశంలో బ్రాహ్మణీయ హిందుత్వ భావాజాలం విద్యారంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తూ విశ్వ విద్యాలయాలను వెంటాడుతున్నది. ప్రత్యామ్నాయ భావజాలం కలిగి ప్రశ్నించే విద్యార్థులపై భౌతిక దాడులకు, హత్యలకు పూనుకోవడం, వారిని అదృశ్యం చేయడం వంటి చర్యలకు హిందుత్వ శక్తులు పాల్పడుతున్నాయి. ఢిల్లీ జేఎన్‌యూ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీల్లో జరిగిన పరిణామాలు దీనినే స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణలోని శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతపైన, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణపైన సభ్య సమాజం తలదించుకునే విధంగా సోషల్ మీడియాలో ఈ శక్తులు మానసిక దాడికి, విద్యార్థులపై భౌతిక దాడులకు తెగబడ్డాయి. ఈ శక్తులు విద్యాసంస్థలను మనువాద బ్రహ్మణీయ భావజాలపు కేంద్రాలుగా పునరుద్ధరించడానికి, తమ తాత్విక, సైద్ధాంతిక నిర్దేశకాలుగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. విద్యా కాషాయీకరణ పేరుతో చరిత్రను తిరగరాయడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. 'భారతీయ ఇతిహాస్ సంకలన యోజన సంస్థ' ఐదువేల సంవత్సరాల భారతీయ చరిత్రను తిరగరాసే పనిలో ఉన్నది. 'భారతీయ అధ్యాపక్ పరిషత్' హిందూత్వ సిద్ధాంతంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే పనిలో ఉంది. చరిత్ర పాఠాలను కాషాయీకరించడానికి బరితెగించాయి ఈ శక్తులు. యూనివర్సిటీల్లోనే కాదు, బాహ్య సమాజంలోనూ భిన్న సామాజిక వర్గాలపైన తమ మతోన్మాద చర్యలను సాగిస్తున్నాయి. అఖ్లాక్ మొదలు, గౌరీ లంకేశ్ వరకూ జరిగిన ఉదంతాలే ఇందుకు నిదర్శనం. ప్రాథమిక స్థాయిలో విద్యాభివృద్ధికి భిన్న సామాజిక వర్గాలకు విద్యావకాశాలను అందుబాటులోకి తేవడానికి అవసరమైన నిధుల కేటాయింపు, మౌలిక వసతులను సమకూర్చడం, బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు చేపట్టడం వంటి విషయాలలో పాలకులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఫీజుల రూపకల్పనకు, నియంత్రణకు సమగ్రమైన చట్టం లేదు. బోధన ప్రమాణాల పెంపుకు ఉపాధ్యాయులకు అసరమైన ఓరియంటేషన్ క్లాసులు నిర్వహించే విధానాన్ని వదిలివేశారు. విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ విధానాలకు తెరలేపి వాటి అమలులో నిమగ్నమైన పాలకులు ఈ విషయాన్ని పట్టించుకోరు. అందరికీ విద్య, సమానత్వంతో కూడిన విద్య అందుబాటులోకి రావాలంటే విద్యార్థులు సంఘటితపడి నిర్మాణాత్మకమైన ఉద్యమాలలో భాగస్వామ్యం అయినప్పుడే సాధ్యమవుతుంది.

సెల్ : 9704189282

గొల్లకురుమలు, సెమి-నోమాడిక్ ట్రైబ్ రిజర్వేషన్ ఉద్యమం



డా॥భీనవేణి రామ్‌ షఫర్డ్

స్వాతంత్ర్యం సిద్ధించింది 1947లో, రాజ్యాంగ రచన డా॥బి.ఆర్.అంబేడ్కర్ నేతృత్వంలో మొదలైంది. అధికరణ 16(4) కింద ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు దొరికాయి. కానీ ఇతర వెనకబడిన తరగతులకు, సంచార నేపథ్యమున్న కులాలకు రిజర్వేషన్లు అందలేదు. దీనితో రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 1950 సంవత్సరంలోనే కేరళ రాష్ట్రంలో పెద్ద ఎత్తున రిజర్వేషన్ హక్కు కోసం ఉద్యమాలు చోటుచేసుకున్నాయి. అప్పటి నెహ్రూ ప్రభుత్వం రిజర్వేషన్ అంశాన్ని పరిశీలించడానికి నంబూద్రిపాద్ కమిషన్‌ను నియమించింది. నంబూద్రిపాద్ ఎస్సీ, ఎస్టీలకు కులం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలనీ బీసీలకు మాత్రం ఆర్థికాంశాల ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని రికమండ్ చేశారు. ఈ కమిషన్ తీర్పుతో సంతృప్తిపడని బీసీ ప్రజానీకం మళ్లీ ఉద్యమాలు మొదలుపెట్టాయి. ఫలితంగా 29 జనవరి, 1953లో కాకా కలేక్కర్ చైర్మన్‌గా మొదటి బ్యాక్‌వర్డ్ క్లాస్ కమిషన్ అధికరణ 340 కింద రాష్ట్రపతి ఉత్తర్వు మేరకు ఏర్పాటైంది. 30 మార్చి 1955లో సమర్పించబడిన ఈ నివేదిక 2,399 కులాలను వెనకబడిన తరగతులుగా గుర్తించింది. అందులో 837 కులాలను అత్యంత వెనుకబడిన కులాలుగా గుర్తించింది. 1961 నుండి కులగణన చెయ్యాలని, సాంకేతిక, ప్రొఫెషనల్ కాలేజీలకు చెందిన 70 శాతం సీట్లను వెనుకబడిన తరగతులకు రిజర్వు చేయాలని సూచించింది. అన్ని వర్గాలకు చెందిన స్త్రీలను బీసీలుగా గుర్తించాలని చెప్పింది. మొత్తం ఓబీసీ కేటగిరీని నాలుగు వర్గాలుగా విభజించాలని కూడా వివరించింది. రెండు సంపుటాల సమగ్రమైన కాకా కలేక్కర్ కమిషన్ చేసిన సిఫార్సులను అప్పటి నెహ్రూ ప్రభుత్వానికి అమలు చేయడం సాధ్యం కాలేదు. వ్యూహాత్మకంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను కేంద్రం పరిధిలో ఉంచుతూ, మిగతా రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వాలకు బదిలీ చేసింది.

కాక కాలేక్కర్ నివేదిక సమర్పించే నాటికి పాత హైదరాబాద్ రాష్ట్రం అస్తిత్వంలో ఉంది. (నవంబర్ 1, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది). కలేక్కర్ తన రిపోర్టు రెండోభాగం, 66 పేజీలో పాయింట్ నెంబర్ 27 కింద నాటి బొంబాయి, హైదరాబాద్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో గొర్రెల, మేకల పెంపకందార్లయిన గొల్లకురుమలు (దన్‌ఘర్, గోల, గోల్కార్) అత్యంత వెనకబడిన కులస్తులుగా వివరించింది. ఈ క్రమంలోనే సంచార జీవనం చేస్తున్న పలు కులాలకు సంచార జాతుల (నోమాడిక్ ట్రైబ్) రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాయి. గొల్లకురుమలతో పాటుగా పలు కులాలు డినోటిఫైడ్, నోమాడిక్, సెమి-నోమాడిక్ ట్రైబ్ రిజర్వేషన్లు పొందాయి. ఈ పరంపర 1970 వరకు కొనసాగింది.

బీసీలకు రిజర్వేషన్లులేని కాలంలో, 1965లో అనంతరామన్ కమిషన్‌ను అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయగా, 1970లో నివేదిక సమర్పించిన ఈ కమిషన్ బీసీలకు 29 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ, వారిని బీసీ-ఎ, బీ, సీ, డీలుగా విభజించింది. సంచార, అర్థ సంచార, వనజాతి సంబంధిత కులాలను బీసీ-ఎ గ్రూపులో చేరుస్తూ వారికి 7 శాతం వాటాను కేటాయించింది. వృత్తి కులాలను బీసీ-బీ గ్రూపులో చేర్చి 12 శాతం వాటా ఇవ్వగా, ప్రభుత్వం 10శాతం మాత్రమే అమలు చేస్తుంది. బీసీ-సీ కింద క్రైస్తవ మతం తీసుకున్న దళితులకు కేటాయించగా, వారికి 1 శాతం వాటా దక్కింది. బీసీ-డీ గ్రూపు కింద ఇతర కులాలను చేరుస్తూ 9 శాతం వాటా ఇవ్వగా, 7 శాతం వాటాను అమలు చేస్తున్నారు. స్థూలంగా మొత్తం 29 శాతం రిజర్వేషన్లకుగాను, 25 శాతం అమలు చేయగా 4 శాతం రిజర్వేషన్లు మిగిలిపోయాయి. ఈ 4 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు కేటాయిస్తు బీసీ-ఈ గ్రూపును రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఈ అంశం సుప్రీంకోర్టు విచారణలో ఉంది.

వాస్తవానికి సంచార నేపథ్యమున్న గొల్లకురుమలను బీసీ-ఎ గ్రూపులో చేర్చవలసి ఉండేది. ఎందుకంటే ఆ గ్రూపు వనజాతి, సంచార, అర్థ-సంచార జాతులకు డిజైన్ చేయబడింది. కానీ అనంతరామన్ కమిషన్ సంచార నేపథ్యంలో గొర్రెల పెంపకందార్లయిన గొల్ల కురుమలకు బీసీ-బీ, డీ గ్రూపులుగా విభజించింది. ఆనాటి అక్షరాస్యత తక్కువ గానున్న గొల్లకురుమలు ఎలాంటి ప్రతిఘటనలు, ఉద్యమాలు చేయలేనందున బీసీ-బీ, డీ రిజర్వేషన్‌లే కులాలుగా భ్రమించే పరిస్థితుల్లోకి నెట్టబడ్డారు. నిజానికి 1970 నుండే గొల్లకురుమలు బీసీ కులస్తులు గా గుర్తించబడ్డారు. అంతకు పూర్వం 1955 నుండి 1970 వరకు అర్థ-సంచార జాతుల ధృవ పత్రాలను పొందినవారే. ప్రస్తుతం గొల్లకురుమలు చేస్తున్న సెమి-నోమాడిక్ ట్రైబ్ (ఎస్‌ఎన్‌టీ) రిజర్వేషన్ ఉద్య మం మిగతా వాటికి భిన్నమైనవి. ఎందుకంటే ఈ రిజ ర్వేషన్‌ను వారు కేవలం విద్యా, ఉద్యోగాల్లోనే కావాలని అడుగుతున్నారు. ఈ ఎస్ఎన్‌టీ రిజర్వేషన్ ప్రాతిపది కలను పరిశీ లిస్తే గతంలో 1955 నుండి 1970 వరకు అమల్లో ఉండడం నేటికీ మన పొరుగు రాష్ట్రమై న మహారాష్ట్ర లో సంచార జాతులకు 11 శాతం రిజర్వేషన్ అమల్లో ఉండడం, 2003లో ఎన్‌డీఏ ప్రభు త్వం ఏర్పాటుచేసిన బాలకృష్ణ రెన్‌కే కమిషన్ కూడా గొల్ల కురుమలను సంచార జాతులుగా గుర్తించడం. దీని ప్రాతిపదికగా తీసుకున్న ప్రస్తుత నేషనల్ కమిషన్ ఫర్ డినోటిఫైడ్, నోమాడిక్ మరియు సెమి-నోమాడిక్ ట్రైబ్స్ చైర్మన్ బిఖ్ రాంజీ ఇడాటే కూడా ఒక డ్రాఫ్టు నివేదికను 2012లో తయారు చేశారు. ఆయన కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గొల్లకురుమలను సీరియల్ నెం.19, 20 & 40 కింద సంచార జాతులుగా గుర్తించారు.

ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో అక్షరాస్యత తక్కువ ఉండి, ఎక్కువ బాల్య వివాహాలను చేస్తూ, గొర్రె-మేకలతో సంచార జీవనం చేస్తున్న గొల్లకురుమలు ఒక ప్రత్యేక రిజర్వేషన్‌ను అడగడంలో అతిశయోక్తి లేదు. తోలు చెప్పులు వాడకం, దోతి, రుమాలు ధరించడం, పాత కాలపు పేర్లు పెట్టుకోవడం, పశువుల పెంపకం మూలంగా పర్యావరణ పరిశుభ్రత లేని ఇంటి ఆవరణలు, స్కూలు డ్రాపౌట్స్, నోటి పండ్లతో జంతువులను బలి ఇచ్చే (గావు) సంప్రదాయం వంటి పలు లక్షణాలను బేరీజు వేస్తే ఈ గొల్లకురుమ కులం ఆధునీకరణలో ఆమడ దూరంలో ఉంటుంది. కనుక విద్యా, ఉద్యోగాల్లో వీరికి ఈ ప్రత్యేకమైన సెమి-నోమాడిక్ ట్రైబ్ రిజర్వేషన్ అందిస్తే ఖచ్చితంగా మంచి ఫలితం ఉంటుంది.

సెల్ : 9492574081

కన్నీరు కూడా ఏడుస్తుంది



ఆజాద్ ఎర్రోల్ల

"మీరు మా కొడుకు లాంటి వాళ్లు, మీకేం చెప్పమంటారు?" అని వాళ్లు అనగానే ఒక్కసారి నా గుండె ఆగి నా మరణం నన్ను పిలిచినట్టు అనిపించింది. వాళ్లు ఎవరో కాదు, పగలు గుడిలో ప్రవేశానికి అర్హత లేని, రాత్రి అయితే అదే గుడిలో ఊళ్లోని కామ వాంఛతో రగిలే ప్రతి మగాడూ వాడుకునే "శరీరాలు"... నాగరిక సమాజం సాంప్రదాయపు అంగడి బొమ్మలు.. "జోగినీలు".


వాళ్లు చెప్పే ప్రతి మాట నా గుండెల్లో గునపం దింపి కండ్ల నుంచి కన్నీరు ప్రవహిస్తుంటే వాళ్లను ఇంకా ఇబ్బంది పెట్టొద్దని వాటిని అక్కడే ఆపేసిన... ఆ తల్లులపై ఆనాటి సమాజం చేసిన వికృత చేష్టలకు, నేటి సమాజం వారిని చిన్న చూపు చూస్తుందని, వారి పిల్లలను మానసికంగా వేధిస్తూ, వెక్కిరిస్తున్నారని ఒక్కొక్కరు వాళ్ల బాధను చెప్తుంటే వారి కంటి నుండి కారుతున్న "ఆ కన్నీరు కూడా ఏడుస్తుంది".

సృష్టికి మూలం స్త్రీ అని చెప్పే సమాజం కామవాంఛతో, మూఢాచారంతో, మగ బిడ్డ పుట్టాలనే మమకారంతో, దేవుడికిచ్చి పెండ్లి చేసి అదే దేవుడి భార్యతో వెర్రి కామ కోరికలు తీర్చుకోడానికి కామాంధులకు స్థానం కల్పించిన సమాజం. వయసులో ఉన్నప్పుడు వాడుకొని, ఇప్పుడు ఒంటిపైకి ముసలి తనం రాగానే మనుషుల్లా కూడా చూస్తలేరని అంటున్నప్పుడు ఆ కంట కారుతున్న కన్నీరు కూడా ఏడుస్తుంది. "మా శరీరం అంత పుండు అయ్యింది, ఎంతోమంది జోగినీలు క్షయ, ఎయిడ్స్‌తో చచ్చిపోయారు. మా గతి ఏం కానుందో? మా తరువాత మా బిడ్డల పరిస్థితి ఏందో?" అంటూ కుమిలి కుమిలి ఏడుస్తుంటే .....ఆ కంట కారుతున్న కన్నీరు కూడా ఏడుస్తుంది.

ఇంత అభివద్ధి చెందిన కంప్యూటర్ సమాజం కూడా తమను వెక్కిరిస్తూ వేధిస్తోందని చెప్తూ కన్నీరు మున్నీరై గుండె పగిలేలా రోదిస్తుంటే ఆ కన్నీరు కూడా కంటతడి పెడుతుంది. మండుటెండల్లో నీడలేక మాడిపోతున్న బతుకులు వారివి. ఆ కంటి చూపుల్లో ఎన్నెన్నో అగాధాలు. సామాజిక వివక్షకు నిలువుటద్దంలా ఉన్నారు వారు. నా మనసు నిండా ప్రశ్నలే... నా గుండె నిండా రోదనే... ఇవి నేను జోగిని వ్యవస్థ గురించి తెలుసుకునే ప్రయత్నం చేసినప్పుడు నాకు కలిగిన కొన్ని అనుభవాలు. వీటిని పంచుకోవాలి, మానవీయ హదయాలు స్పందించాలి, ఆ అభాగ్యుల కోసం ఒక్క ఆలోచన.... ఒక్క కన్నీటి చుక్క.... ఒక్క ప్రశ్న..... మీ గుండెల్లో మెదలాలి..... మానవ జాతి చరిత్రకే కళంకమైన ఈ దురాచారం మాసిపోవాలి. జోగినులుగా జీవచ్ఛవాలుగా బతుకు వెళ్లదీస్తున్న వాళ్లు కోరుకునే వాటిలో కొన్ని.. మిగిలిన శేష జీవితానికి ప్రభుత్వ తోడు. నేటి ఆడ పిల్లలను జోగినీలుగా మార్చొద్దు. బాల్య వివాహాలు చేయొద్దు. మనతో చదువుకుంటున్న వారి పిల్లలను అందరితో సమానంగా చూడడం. వారితోపాటు, వారి పిల్లలకు అన్ని రంగాల్లో ప్రత్యేక రేజర్వేషన్స్ కావాలని కోరుకుంటున్నారు. ఆ తల్లులను సమాజం, ప్రభుత్వం గుర్తించి తోడు నిలిచేలా అందరం ప్రయత్నిద్దాం. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నిర్ణయానికి వద్దాం.

సెల్ : 8499994232

విద్య పట్ల ఎందుకింత నిర్లక్ష్యం



వినోద్‌కుమార్ స్వర్ణాల

"అంత పెద్ద పుస్తకం చంకలోవుంటే పంచాంగం చెప్పలేవా" అన్నట్టుగా తయారైంది నేటి మన చదువుల పరిస్థితి. నిజానికి అక్షరాస్యత రానురాను పెరుగుతుండటం హర్షణీయమే కానీ అదే సమయంలో పెరుగుతున్న కళాశాలలు విద్యార్థుల సంఖ్యకు ధీటుగా నాణ్యత కొరవడుతున్నదన్నది వాస్తవం. ప్రాథమిక స్థాయి నుండి కూడా నాణ్యమైన విద్య అందక నాసిరకం చదువులతో నెట్టుకొచ్చిన విద్యార్థి నైపుణ్యం, సజనాత్మకత కొరవడి అనంతర కాలంలో నిరక్షరాస్యుడి కంటే దీనంగా కాలం వెల్లదీస్తున్న నిరుద్యోగులు కోకొల్లలు. నిజానికి విద్యా సంస్కరణలపై అనేక కమిటీలు చేసిన విలువైన సిఫార్సులను లెక్కచేయని మన ప్రభుత్వాలు అభివద్ధి అనగా నాణ్యమైన విద్యా, వైద్య సదుపాయాలు ఎలాంటి వివక్ష లేకుండా అందరికీ అందిస్తే చాలు అన్న విషయాన్ని నిర్లక్ష్యం చేయడమే కాక తాత్కాలిక బడ్జెట్ కేటాయింపుల పెంపు (అంకెల గారడీ)తో అత్యద్భుతమైన ఫలితాలు ఆశించటం దురదష్టకరం.

ప్రభుత్వ విద్యాలయాలకు పోటీగా లాభాపేక్ష లక్ష్యంగా ప్రైవేటు విద్యవల్ల విద్యా వ్యవస్థ అనేక ఒడిదుడుకులకు లోనవుతోంది. ముఖ్యంగా తల్లిదండ్రులలోనూ ర్యాంకుల పట్ల ఆసక్తి, పాఠ్యాంశాల బట్టీతో ఫలితాలు చూపి, మాట తీరుపై వాంఛ పెంచి, సకల సౌకర్యాలను సాకుగా చూపి పిల్లలను చేర్చుకుంటున్నారు. లాభాలు ఆర్జిస్తూనే, పలు సందర్భాల్లో వారి అపసవ్య పోకడలైన సెలవుల రద్దు, విపరీతమైన ఒత్తిడి, శారీరక మానసిక హింస, ఫీజుల కోసం వేధింపులకు పాల్పడుతున్నారు. సిబ్బందికి కనీస వేతనాలు చెల్లించకపోవడం, అనర్హులను ఎంపిక చేసుకోవడం లాంటివి నేటికాలంలో సర్వసాధారణం అయిపోయాయంటే కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే.

ఇక పరీక్షల విషయానికి వస్తే హైదరాబాద్ లాంటి నగరాన్ని కాస్త మినహాయిస్తే, పర్యవేక్షణ అధికారులు లేక నిరంతర పర్యవేక్షణ కొరవడి విద్యావ్యవస్థ అస్తవ్యస్తమైంది. దీని ఫలితాలు ఎక్కడ బయటపడతాయోనన్న ఆందోళన, ఫలితాలపై రాజకీయ ఒత్తిడి, ర్యాంకులు, ఉత్తీర్ణత శాతం మెరుగుపరుచుకోవాలనే ఆరాటంలో "సంతప్తీకరణ" విధానం గత కొన్నాళ్లుగా కొనసాగుతున్న తంతు. ఇది కేవలం పదో తరగతికే పరిమితం అనుకుంటే పొరపాటు. ఉన్నత విద్య వరకు కూడా, విద్యార్థులు రాసే దానికి, వారి భావ వ్యక్తీకరణకు, వేసే మార్కులకు సంబంధం లేకుండా పోయింది. అయినా సజనాత్మకతకు చోటులేని, నైపుణ్యాన్ని పెంచలేని, నవ్య ఆలోచనలకు నాంది వేయించలేని ఆ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రతీ స్థాయిలో ప్రస్తుతం పరీక్షల నిర్వహణ ఒక తంతులాగా మారింది. విద్యార్థిలో ఆసక్తి, అభిరుచి, సజనాత్మకత, నైపుణ్యం, భావవ్యక్తీకరణ, సమాజ సమస్యలపై అవగాహన, అధ్యయనానికి పురికొల్పేలా గాక మార్కులు, ర్యాంకుల ప్రాతిపదికగా తయారైంది. నిజానికి పబ్లిక్ పరీక్షల వల్ల చిన్న వయసులోనే విద్యార్థులపై అనవసర ఒత్తిడి తప్ప లాభం లేదు. పైగా దానికి విద్యార్థిపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం ఒత్తిడి, తోటి విద్యార్థులతో పోలికలు, సమాజం మొత్తం దష్టి తనపైనేనన్న ఆందోళనలతో విద్యార్థిలోకం తీవ్రంగా సతమతమవుతున్నారు. అసలే నైతికత పతనమై, విలువలు దిగజారుతూ స్వార్థ చింతన పెరిగిన సమాజం మరోవైపు మానసిక దఢత్వాన్నివ్వని విద్య వల్ల అనాలోచిత నిర్ణయాలు (ఆత్మహత్యలు) కూడా ఈ మధ్య కాలంలో అధికమవుతున్నాయి. అందువల్ల ఇప్పటికైనా ప్రభుత్వాలు పరీక్షల్లో సంస్కరణలు త్వరితగతిన ప్రవేశపెట్టాలి. భవిష్యత్తుపై భరోసా ఉండేలా, సజనాత్మకత పెంపొందించే విధంగా, నైపుణ్యాన్ని మెరుగుపర్చేలా, విద్యార్థి చొరవకు ప్రాధాన్యత ఇచ్చేలా, నవీన ఆవిష్కరణలకు పురికొల్పేలా మార్పులు చేయాలి.

సెల్ : 9908312949

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228

నవచిత్రం

పంచెకట్టుతో భరత్ సందడి


'భరత్ అనే నేను' చిత్రంలో మహేష్‌బాబు

మహేష్‌బాబు, కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'భరత్ అనే నేను'. కైరా అద్వాని కథానాయికగా డి.పార్వతి సమర్పణలో డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దానయ్య డి.వి.వి. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పంచెకట్టుతో సరికొత్తగా ఉన్న మహేష్ లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత దానయ్య డి.వి.వి. మాట్లాడుతూ, 'మన తెలుగు సంవత్సరాది పండుగ కళ ఉట్టిపడే పంచె కట్టుతో ఉన్న మహేష్ పోస్టర్‌ను విడుదల చేశాం. మహేష్ పంచెకట్టులో కనిపించడం మొదటిసారి. ప్రేక్షకులకు, అభిమానులకు మహేష్ కొత్త లుక్ కనువిందు చేస్తోంది. ఈ లుక్‌కి అత్యద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించి ఓ పాట చిత్రీకరణ రాజు సుందరం నేతృత్వంలో జరుగుతోంది. భారీ టెంపుల్ సెట్‌లో 100 డాన్సర్లు, 1000 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులతో చాలా గ్రాండ్‌గా ఈ సాంగ్‌ను షూట్ చేస్తున్నాం. ఈనెల 25 నుంచి స్పెయిన్ ఓ షెడ్యూల్ ఉంటుంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి ఏప్రిల్ 20న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు.



శ్రీలేఖకు కళారత్న

ప్రముఖ గాయని, సంగీత దర్శకురాలు ఎం.ఎం.శ్రీలేఖకు ఉగాది పండుగని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'కళారత్న' పురస్కారాన్ని అందించింది. ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అమరావతిలో ఈ పురస్కారాన్ని స్వీకరించారు. 'ఈ పురస్కారం రావడం చాలా హ్యాపీగా ఉంది. నా సంగీత దర్శకత్వంలో మొదటి పాట రచన చేసిన సిరివెన్నెల సీతారామ శాస్త్రికి కూడా ఇదే ఏడాది 'కళారత్న' పురస్కారం రావడం అదృష్టంగా భావిస్తున్నాను' అని శ్రీలేఖ అన్నారు. 12వ ఏట నుంచి సినిమాలకు సంగీత దర్శకత్వం అందించడం మొదలు పెట్టిన శ్రీలేఖ ఇప్పటి వరకు 5 భాషల్లో 75 సినిమాలకు సంగీతం సమకూర్చిన ఏకైక మహిళా సంగీత దర్శకురాలిగా రికార్డు సృష్టించారు. దాసరి నారాయణరావు రూపొందించిన 'నాన్నగారు' సినిమాతో సంగీత ప్రస్థానం మొదలై, మూవీ మొఘల్ రామానాయుడు నిర్మించిన 'తాజ్ మహల్', 'ధర్మచక్రం', 'ప్రేమించు' వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాలకు సంగీతం అందించి మెలోడీ పాటలకు కేరాఫ్‌గా శ్రీలేఖ నిలిచారు.


శ్రీలేఖ, చంద్రబాబునాయుడు తదితరులు



నితిన్, మేఘా ఆకాష్

ఛల్ మోహన్‌రంగ పాటలొచ్చాయ్

నితిన్, మేఘా ఆకాష్ జంటగా కృష్ణచైతన్య దర్శకత్వంలో నిఖితా రెడ్డి సమర్పణలో, పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్, శ్రేష్ఠ్ మూవీస్ పతాకాలపై ఎన్.సుధాకర్‌రెడ్డి 'ఛల్ మోహన్‌రంగ' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్రివిక్రమ్ కథ అందించిన ఈ చిత్ర పాటల ఆల్బమ్‌ను ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, 'ఇంతకు ముందు విడుదలైన మూడు పాటలకు మంచి స్పందన లభించింది. తాజాగా మరో మూడు పాటలతో కలిపి ఆల్బమ్ మొత్తం విడుదల చేశాం. పాటలన్నీ భిన్నశైలిలో సాగుతాయి. ప్రతీ పాట కొత్తగా చాలా ఫ్రెష్‌గా అనిపిస్తుంది. తన ప్రతి పాటను హిట్ చేయగల సమర్థుడు సంగీత దర్శకుడు థమన్. ఈ చిత్రానికి మాస్ నుంచి క్లాస్ వరకు, ప్రేమ నుంచి విరహం వరకు, సంతోషం నుంచి బాధ వరకు ఇలా.. అన్ని రకాల భావోద్వేగాలను ఎంతో బాగా స్వరపరిచి ఒక పూర్తి స్థాయి ఆల్బమ్ ఇచ్చారు. యు.ఎస్, ఊటీ, హైదరాబాద్‌లోని అందమైన లొకేషన్లలో చిత్రీకరణ జరిపాం. ఏప్రిల్ 5న చాలా గ్రాండ్‌గా సినిమాను విడుదల చేయనున్నాం' అని అన్నారు.

నయా ప్రాజెక్టులకు రెడీ..


కళ్యాణ్‌రామ్


వరుణ్‌తేజ్


అఖిల్

ఉగాది పండుగని పురస్కరించుకుని కొత్త చిత్రాలను ప్రకటించి హీరోలు, దర్శకులు, నిర్మాతలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశారు. 'ఎంఎల్‌ఎ', 'నా నువ్వే' చిత్రాల్లో నటిస్తున్న కళ్యాణ్‌రామ్ నెక్ట్స్ 'మజ్ను' ఫేమ్ విరించి వర్మ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై జెమినీ కిరణ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఇటీవల 'తొలిప్రేమ'తో సూపర్ హిట్ అందుకున్న వరుణ్ తేజ్ కూడా నూతన చిత్రాన్ని ఎనౌన్స్ చేశారు. ప్రస్తుతం 'ఘాజి' ఫేమ్ సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో సైన్స్ ఫిక్షన్‌లో నటించేందుకు సిద్ధమవుతున్న ఆయన తదుపరి 'అప్పట్లో ఒకడుండేవాడు' ఫేమ్ సాగర్ చంద్ర దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నారు. 14 రీల్స్ ప్లస్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కనుంది. రామ్ ఆచంట, గోపీ ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గతేడాది 'హలో'తో కాస్త నిరాశ చెందిన అక్కినేని అఖిల్ నెక్ట్స్ 'తొలిప్రేమ' ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నట్టు ప్రకటించారు. బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మించే ఈ సినిమా ఈ నెల 26న పూజతో ప్రారంభమై, ఏప్రిల్ రెండో వారం నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనుంది.

సరికొత్త మిస్టరీ థ్రిల్లర్..


నాగ చైతన్య, ఈషా, సుమంత్

సుమంత్, ఈషా హీరో,హీరోయిన్లుగా సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో టారస్ సినీ కార్ప్ పతాకంపై ధీరజ్ బొగ్గరం, బీరం సుధాకర్‌రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న నూతన చిత్రం 'సుబ్రహ్మణ్యపురం'. ఆదివారం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో ఈ చిత్ర ప్రారంభోత్సవం జరిగింది. హీరో, హీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి హీరో నాగచైతన్య క్లాప్‌నివ్వగా, దర్శకుడు ప్రశాంత్ వర్మ కెమెరా స్విచాన్ చేశారు. తొలి సన్నివేశానికి చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించారు. చిత్ర లోగోను ఏపీ ఎంపీ జె.సి.దివాకర్‌రెడ్డి, రాజశేఖర్, జీవిత సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ, 'నాకిది 25వ సినిమా. దర్శకుడు సంతోష్ కథ చెప్పేటప్పుడే సినిమా మొత్తం చూపించాడు. సూపర్ నేచురల్ అంశాల మేళవింపుతో సాగే మిస్టరీ థ్రిల్లర్ చిత్రమిది. ఇలాంటి జోనర్‌లో చేయడం ఇదే తొలిసారి. కథ వింటున్నప్పుడు నెక్ట్స్ ఏం జరుగుతుందనే ఉత్కంఠతతో ఎదురుచూశాను, థియేటర్‌లో ప్రేక్షకులు కూడా అలానే ఫీలవుతారు' అని అన్నారు. 'నాకిది తొలి చిత్రం. ఇంతకు ముందు మూడు లఘు చిత్రాలను రూపొందించాను. ఏప్రిల్ మూడవ వారం నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుపనున్నాం' అని దర్శకుడు తెలిపారు. నిర్మాత ధీరజ్ బొగ్గరం చెబుతూ, 'మాగ్నస్ సినీ ప్రైమ్ సహకారంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. సుధాకర్‌రెడ్డి మంచి సపోర్ట్ అందిస్తున్నారు. అన్ని వర్గాలను ఆకట్టుకునే చిత్రమవుతుంది' అని చెప్పారు. 'సుమంత్‌కు నేను వీరాభిమానిని. ఆయనతో పనిచేయబోతున్నందుకు హ్యాపీగా ఉంది' అని హీరోయిన్ ఈషా తెలిపారు.

ఆద్యంతం నవ్వించే నర్తనశాల


నాగశౌర్య, వంశీ పైడిపల్లి

'ఛలో' వంటి విజయవంతమైన సినిమా తర్వాత నాగశౌర్య హీరోగా నటిస్తున్న నూతన చిత్రం 'నర్తనశాల'. శ్రీనివాస చక్రవర్తిని దర్శకుడిగా పరిచయం చేస్తూ శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఐరా క్రియేషన్స్ పతాకంపై ఉషా ముల్పూరి నిర్మిస్తున్న ఈ సినిమా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం సంస్థ కార్యాలయంలో ప్రారంభమైంది. నాగశౌర్యపై వంశీపైడిపల్లి క్లాప్‌నిచ్చారు. ఈ సందర్భంగా నాగశౌర్య మాట్లాడుతూ, 'కృష్ణవంశీ దగ్గర పనిచేసిన శ్రీనివాస చక్రవర్తిని మా సంస్థ ద్వారా దర్శకుడిగా పరిచయం చేస్తున్నందుకు హ్యాపీగా ఉంది. నా నిర్ణయాన్ని నమ్మిన అమ్మ(ఉషా ముల్పూరి)కి థ్యాంక్స్. ఇది పాత 'నర్తనశాల'కు రీమేక్ అని, డాన్స్ ప్రధాన చిత్రమని అనుకుంటున్నారు, కానీ ఇది పూర్తి వినోదాత్మక చిత్రం. ఆద్యంతం నవ్వుకునేలా ఉంటుంది. 'ఛలో'కు 'చూసి చూడంగానే..' వంటి సూపర్ హిట్ సాంగ్స్ అందించిన సాగర్ మహతి ఈ చిత్రానికి కూడా స్వరాలు సమకూరుస్తున్నారు. ఎడిటర్ చంటిగారు మా సంస్థలో భాగమయ్యారు. కెమెరామెన్ విజయ్‌తో చాలాసార్లు పనిచేయాలనుకున్నాను. ఈ చిత్రంతో కుదిరినందుకు హ్యాపీగా ఉంది. మా బ్యానర్‌లో నిర్మించే రెండో సినిమాలో కూడా నన్నే హీరోగా పెట్టుకున్నందుకు నిర్మాతకు థ్యాంక్స్' అని అన్నారు. 'తల్లిదండ్రులు, దేవుడు తర్వాత ఈ చిత్ర నిర్మాతలకు థ్యాంక్స్ చెప్పుకుంటాను. ఎందుకంటే ఈ తరహా కథను నమ్మి సినిమా చేస్తున్నందుకు, పెద్ద టెక్నీషియన్లను ఇచ్చినందుకు. ఈ బ్యానర్‌లో వచ్చిన 'ఛలో' కంటే పెద్ద హిట్ సినిమా చేస్తానని మాటిస్తున్నాను. ఆద్యంతం కామెడీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. పాత 'నర్తనశాల'కు సంబంధించిన కొన్ని ఛాయలు నేటి కనుగుణంగా ఉంటాయి. ఏప్రిల్‌లో రెగ్యులర్ షూటింగ్ జరుపనున్నాం' అని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రంలో నరేష్, జయప్రకాష్‌రెడ్డి, అజయ్, పోసాని, సత్యం రాజేష్, వెన్నెల కిషోర్, గుండు సుదర్శన్, జెమిని సురేష్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు.

హాలీవుడ్ వేసవి వినోదం షురూ..


షో

మన దగ్గరే కాదు హాలీవుడ్‌లోనూ సమ్మర్ సీజన్‌ని క్యాష్ చేసుకోవటానికి బోల్డెన్ని సినిమాలు విడుదలకు రెడీ అవుతున్నాయి. రొమాంటిక్ డ్రామా, సైన్స్ ఫిక్షన్ యాక్షన్, సైకలాజికల్ హర్రర్ థ్రిల్లర్.. ఇలా రకరకాల జోనర్ల నేపథ్యంతో ఈనెల ఐదు సినిమాలు వేసవి వినోదానికి కర్టెన్ రైజర్‌గా ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి.











మిడ్‌నైట్ సన్..

అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఓ అమ్మాయి జీవిత సంఘర్షణను తెలిపే చిత్రమిది. 17 ఏండ్ల టీనేజ్ అమ్మాయి కేటీ, తన తండ్రితో కలిసి ఉంటుంది. సూర్యరశ్మి తగిలితే ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉన్న ఒక అరుదైన వ్యాధితో కేటీ బాధపడుతుంటుంది. ఈ వ్యాధి కారణంగా ఆమెకు ఇల్లే ప్రపంచం అవుతుంది. లైఫ్‌లాంగ్ ఇంట్లోనే గడపాల్సి వస్తుంది. బయటి ప్రపంచాన్ని చూడలేని నిస్సహాయ స్థితిలో ఉన్న కేటీకి ఛార్లీ అనే కుర్రాడు పరిచమయవుతాడు. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారుతుంది. ఛార్లీని ప్రేమించిన తర్వాత కేటీ జీవితం ఎలా మారింది?, సూర్యరశ్మిని ఎదిరించి సాధారణ జీవితం గడిపేందుకు కేటీ ఏం చేసిందనేది సినిమా. స్కాట్ స్పీర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కేటీ పాత్రలో బెల్లా తోర్నె, ఛార్లీ పాత్రలో పాట్రిక్ స్క్వార్జ్‌నెగ్గర్ నటించారు. రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా సమ్మర్ స్పెషల్‌గా ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

పసిఫిక్ రిమ్: అప్ రైజింగ్

2013లో వచ్చిన 'పసిఫిక్ రిమ్' చిత్రానికిది సీక్వెల్. రహస్య సాంకేతిక శక్తులు కలిగిన కైజు వర్గం, భయానక రూపాలు కలిగిన సముద్ర జాతులకు చెందిన రోగ్స్ పదేండ్ల తర్వాత భూమిపై, మానవ నివాసాలపై దాడి చేస్తుంటాయి. అంతేకాదు నిబంధనలను సైతం ఖాతరు చేయకుండా యుద్ధానికి దిగుతాయి. దీంతో వాటిని కంట్రోల్ చేయడానికి స్టాకర్ పెంటకోస్ట్ తనయుడు జేక్ పెంటకోస్ట్ టీమ్ చేసే పోరాటమే ఈ చిత్ర కథాంశం. ఈ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ చిత్రానికి నూతన దర్శకుడు స్టీవెన్ ఎస్.డెనైట్ దర్శకత్వం వహించారు. ఇందులో జేక్ పెంటకోస్ట్ పాత్రలో జాన్ బోయేగా, ఇతర పాత్రల్లో స్కాట్ ఈస్ట్‌వుడ్, కైలీ స్పాయినీ నటించారు. విజువల్ వండర్‌గా, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా ఈ నెల 23న విడుదల కానుంది. వేసవిలో చల్లటి వినోదాన్ని పంచేందుకు రెడీ అవుతోంది.

అన్సాన్

తనకు తాను భయంతో ఇబ్బంది పడుతున్న ఓ మహిళ ఆవేదనను తెలిపే చిత్రమిది. సాయెర్ వాలెంటిని మానసికంగా ఇబ్బందులు పడుతున్న బిజినెస్ ఉమెన్. ఆమెకు తరచూ పాత బాయ్‌ఫ్రెండ్‌కు సంబంధించిన జ్ఞాపకాలు గుర్తొస్తుంటాయి. తనను ఎవరో వెంటాడుతున్నట్టు ఆందోళన చెందుతుంది. దీంతో మెంటల్ ఇనిస్టిట్యూట్‌లో జాయిన్ అవుతుంది. అక్కడ రూల్స్ చాలా కఠినంగా ఉంటాయి. బయటి వాళ్ళను కలిసే అవకాశామే ఉండదు. దీంతో తను మరింతగా భయాందోళనకు గురవుతుంటుంది. ఈ నేపథ్యంలో ఆ భయాందోళనల నుంచి ఎలా బయటపడింది?, ఇంతకి తనలో ఉన్నది భయమా లేక భ్రమ? అనేది సినిమా కథాంశం. ప్రముఖ దర్శకుడు స్టీవెన్ సొడెన్‌బర్గ్ ఈ చిత్రాన్ని సైకలాజికల్ హర్రర్ థ్రిల్లర్‌గా రూపొందించారు. ఇందులో సాయెర్ పాత్రలో క్లైర్ ఫోయ్ నటించారు. ఈ సినిమా ఫిబ్రవరిలో జరిగిన బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమై ప్రశంసలందుకుంది. వేసవి కానుకగా ఈ నెల 23న రిలీజ్ అవుతోంది.

రెడీ ప్లేయర్ వన్

సమీప భవిష్యత్‌లో మనిషి జీవన విధానాన్ని తెలిపే చిత్రమిది. 2045లో భూమిపై కాలుష్యం పెరిగిపోతుంది, అధిక జనాభా, అవినీతి, వాతావరణ మార్పులు చోటు చేసుకుంటాయి. ఆ టైమ్‌లో కొత్తగా క్రియేట్ చేయబడిన డిస్టోపియన్ ఎర్త్‌లో మనుషులంతా ఓవాసిస్ అనే వర్చ్యువల్ స్పేస్‌తో కనెక్ట్ అయి ఉంటారు. అదొక రకమైన గేమ్ లాంటిది. ఎక్కువ సమయం అందులోనే గడిపేస్తుంటారు. దాన్ని కనిపెట్టిన వ్యక్తి చనిపోయిన తర్వాత ఎదురైన సమస్యలేంటి?, దాన్ని కంట్రోల్ చేసేందుకు వేడ్ వాట్స్ అనే కుర్రాడు ప్రయత్నిస్తుంటే, దాన్ని మిస్‌యూజ్ చేసేందుకు కొంతమంది ట్రై చేస్తుంటారు. ఈ క్రమంలో విజయం ఎవరికి దక్కిందనేది సినిమా. హాలీవుడ్ గ్రేట్ డైరెక్టర్ స్టీవెన్ స్పీల్‌బర్గ్ దర్శకత్వంలో రూపొందిన ఈ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ చిత్రంపై సర్వత్రా క్రేజ్ నెలకొంది. వేడ్ వాట్స్ పాత్రలో టై షెరిడన్ నటించిన ఈ సినిమా ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకొస్తోంది.

ఎక్రిమోని

నమ్మి ప్రేమించి పెళ్ళి చేసుకున్న భర్త కొద్ది రోజులకే మరో అమ్మాయితో అక్రమ సంబంధం పెట్టుకుంటాడు. తాను మోసపోయానని తెలుసుకున్న భార్య, భర్తపై రివేంజ్ తీర్చుకునేందుకు చేసే పోరాటమే ఈ చిత్రం. ఓ మహిళలోని సంఘర్షణను తెలిపే ఈ సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రానికి టైలర్ పెర్రీ దర్శకత్వం వహించారు. ఇందులో భార్య పాత్రలో తరాజీ పి.హెన్సన్, భర్త పాత్రలో లిరిక్ బెంట్ నటించారు. ఈ చిత్రం ఈ నెల 30న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది.

ఖాళీగానైనా కూర్చుంటా..

'నాకు సెట్ అయ్యే కథ దొరికే వరకు ఖాళీగా ఇంట్లోనైనా కూర్చుంటాను తప్ప ఏది పడితే అది చేయను' అని అంటోంది సోనమ్ కపూర్. విభిన్న కథా చిత్రాలతో బాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సోనమ్ ప్రస్తుతం మహిళా ప్రాధాన్యత కలిగిన చిత్రాలకు ప్రయారిటీ ఇస్తోందట. ఆ విశేషాలను మీడియాతో పంచుకుంటూ, 'ప్రస్తుతం నటిస్తున్న 'ఏక్ లడఖీకో దేఖా తో హైసా లగా', 'ది జోయా ఫ్యాక్టర్' చిత్రాల్లో నటించే ఛాన్స్‌లు రావడం ఈజీ. ఎందుకంటే గతంలో ఇలాంటి పాత్రలు చేశా. వీటికంటే మహిళా ప్రాధాన్యత కలిగిన పాత్రలు వస్తే బాగుంటుంది. రచయితలు కూడా అలాంటి డెప్త్ ఉన్న పాత్రలు రాయాలని కోరుకుంటున్నాను' అని చెప్పింది. సోనమ్ ప్రస్తుతం 'సంజు', 'వీర్ ది వెడ్డింగ్' చిత్రాల్లోనూ నటిస్తోంది.


సోనమ్ కపూర్

నిశబ్దమే ఆయుధం..


మంత్రి పత్తిపాటి పుల్లారావు, నారా రోహిత్

నారా రోహిత్ హీరోగా నటిస్తున్న నూతన చిత్రం 'శబ్దం'. 'హిజ్ సైలెన్స్ ఈజ్ హిజ్ వెపన్' అనేది ట్యాగ్‌లైన్. పి.బి.మంజునాథ్ దర్శకత్వంలో శ్రీవైష్ణవి క్రియేషన్స్ పతాకంపై నారాయణరావు అట్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రం ఆదివారం ఏపీ రాజధాని అమరావతిలో వైభవంగా ప్రారంభమైంది. నారా రోహిత్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ఏపీ మంత్రి పత్తిపాటి పుల్లారావు క్లాప్‌నివ్వగా, ఎమ్మెల్యే కొమ్మలపాటి శ్రీధర్ కెమెరా స్విచాన్ చేశారు. దర్శకుడు పి.బి.మంజునాథ్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ, 'ఈ సినిమా సూపర్ హిట్ అయి నారా రోహిత్‌కు, దర్శక, నిర్మాతలకు మంచి పేరును తీసుకురావాలి' అని అన్నారు. 'నా చిత్రం అమరావతిలో ప్రారంభం కావడం ఆనందంగా ఉంది. అందరినీ ఎంటర్‌టైన్ చేయడం కోసం టీమ్ అంతా కష్టపడతాం. కథకి సరిగ్గా సూట్ అయ్యే టైటిల్ ఇది' అని నారా రోహిత్ చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ, 'నా మొదటి సినిమా 'లేడీస్ అండ్ జెంటిల్మన్'కు నంది అవార్డు అందించి దర్శకుడిగా నన్ను ఎంతగానో ప్రోత్సహిస్తున్న సీఎం చంద్రబాబుకు థ్యాంక్స్. కథను నమ్మి సినిమా చేసేందుకు ఓకే చెప్పిన నారా రోహిత్‌కు కృతజ్ఞతలు. రిచర్డ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ సినిమాకు పెద్ద అస్సెట్. ఏప్రిల్ చివరి వారం నుంచి వైజాగ్, కాకినాడ, హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. అవకాశం ఇచ్చిన నిర్మాతలకు ధన్యవాదాలు' అని తెలిపారు. 'సరికొత్త కాన్సెప్ట్‌తో అందరిని అలరించే చిత్రమిది' అని నిర్మాత నారాయణరావు అట్లూరి తెలిపారు.

టిక్కెట్లు కావాలంటే..

హైదరాబాద్‌లో కాదు.. జనంలో ఉండాలె...





నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'పంచాగకర్త సంతోష్‌శర్మ చాలా చతురుడు.. ఈ సంవత్సరం ఎన్నికల సంవత్సరం కాబట్టి ఏ రాశి వారికి టిక్కెట్లకు ఢోకా లేదో.. ఏ రాశి వారికి ఇబ్బంది కలుగుతుందోననే విషయాన్ని ఆయన చెప్పారు. మరి ఆయా రాశుల వారు జాగ్రత్తగా ఉండాలె. టిక్కెట్లు సంపాదించాలంటే హైదరాబాద్‌లో ఎక్కువగా ఉండకుండా.. ప్రజల్లో ఉండి మంచిపేరు తెచ్చుకోవాలె. అప్పుడు ఆటోమేటిగ్గా టిక్కెట్లొస్తయ్...' అని ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులనుద్దేశించి వ్యాఖ్యానించారు. సీఎం క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ యేడాది రాష్ట్రంలోని దుర్మార్గుల ప్రకోపం కూడ తగ్గుతుందంటూ పంచాగకర్త చెప్పడం సంతోషదాయకమని అన్నారు. 'పంచాగకర్త తెలంగాణ రాష్ట్రానిది కర్కాటక రాశి అని చెప్పారు.. ఆ ప్రకారంగా మన ఆదాయం 8, వ్యయం 2.. అందువల్ల తెలంగాణ మిగులు రాష్ట్రమేనని...' విశదీకరించారు. మన రాష్ట్రం తనను తాను అభివృద్ధి చేసుకుంటూ దేశ నిర్మాణంలోనూ ప్రత్యేక పాత్ర పోషిస్తున్నదని తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ అద్భుతమైన వెలుగుజిలుగులతో విరాజిల్లుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని రైతులంతా సంతోషంగా ఉన్నారని చెప్పారు. మన రాష్ట్రం అద్భుతమైన సిరిసంపదలతో తుల తూగుతున్నదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం దేవ భూమి అని.. అందువల్ల ఇక్కడ అద్భుతంగా పూజలు జరుగుతున్నాయని తెలిపారు. అన్ని వర్గాల పండుగలను రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా నిర్వహిస్తున్నదని చెప్పారు. సకల జనులను అభివృద్ధి చెందించటమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఆ దిశగా పయనించి బంగారు తెలంగాణ సాధిస్తామని తెలిపారు. రాష్ట్రంలో హోం, వైద్య, ఆరోగ్య శాఖల పనితీరు బాగుందంటూ పంచాంగకర్త చెప్పడంతో ఆయా శాఖల మంత్రులకు ఎలాంటి ఢోకా లేదన్న సీఎం.. మంత్రులు లక్ష్మారెడ్డి, నాయిని నర్సింహారెడ్డిని ప్రశంసించారు. డీజీపీ మహేందర్‌రెడ్డి నేతృత్వంలో పోలీసు యంత్రాంగం బాగా పని చేస్తుందన్నాదని కితాబిచ్చారు. తెలంగాణ రాష్ట్రం అవతరించడం.. తదనంతరం మంచి ఫలితాలు సాధించడంతో మన రాష్ట్రం దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నదని తెలిపారు. కార్యక్రమంలో స్పీకర్ మధుసుదనాచారి, మండలి చైర్మెన్ స్వామిగౌడ్‌తోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, భద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయ అర్చకులు.. సీఎంకు భద్రాచల రాముడి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు.

'రాలుతున్న' మామిడి ఆశలు

మొదటిపేజీ తరువాయి

రైతులకు అందుబాటులో ఉండని పరిస్థితి. దీంతో మామిడి సోకుతున్న బూడిద, తేనెమంచు తదితర తెగుళ్ల నివారణకు సరైన మందులు తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సారి జనవరి, ఫిబ్రవరి నెలల్లో కొంత వరకు పూత వచ్చింది. ఏప్రిల్ నెలాఖరుకు కాయలు వచ్చే పరిస్థితి నెలకొంది.

ఈ నేపథ్యంలో పంట మొత్తం ఒకేసారి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. ఆ ప్రభావం ధరలపై పడే అవకాశం ఉంటుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వాతావరణ మార్పులే కారణం

శ్రీనివాసరావు (ఏడీ హార్టికల్చర్, ఖమ్మం జిల్లా)

ప్రస్తుత సీజన్‌లో వాతావరణం మామిడికి సహకరించకపోవడంతోనే పూత ఆలస్యంగా వచ్చింది. పూత ఆలస్యమైనా కాయ నిలిస్తే రైతులకు మేలు. వాతావరణ మార్పు ప్రభావం దిగుబడిపై ఉంటుంది. మంచు వల్ల బూడిద తెగులు, తేనెమంచు పురుగు, బూజు తెగులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

రాష్ట్రంలో అత్యధికంగా మామిడి సాగు వివరాలు

జిల్లా పేరు	మండలాలు	ఎకరాలు	దిగుబడి (మెట్రిక్‌టన్నుల్లో)
ఖమ్మం	21	43,195	55,180
జగిత్యాల	18	41,148	61,450
మంచిర్యాల	18	16,010	27,258
నాగర్ కర్నూల్	20	16,260	20,465
సూర్యాపేట	23	15,388	51,498
సిద్దిపేట	22	14,768	25,139
రంగారెడ్డి	27	14,880	25,331
యాదాద్రి	16	10,678	35,730
వనపర్తి	14	10,688	13,451
మహబాద్	16	11,760	23,828

న్యాయమా నీవెక్కడ ?

మొదటిపేజీ తరువాయి

ఇటీవల ఆదేశించింది. పోక్సో చట్టం ప్రకారం.. బాలికలపై లైంగికదాడులకు పాల్పడిన కేసుల చార్జ్‌షీట్.. ట్రయల్ కోర్టు దృష్టికి వచ్చాక ఏడాది కాలంలో తుదితీర్పు వెలువరించాలి. ఎనిమిది నెలల బాలికపై ఆమె బంధువు లైంగికదాడికి పాల్పడిన కేసులో న్యాయవాది అలాక్ అలోక్ శ్రీవాస్తవ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. 2016 నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) రిపోర్టును ఉటంకిస్తూ..పోక్సో చట్టం కింద మొత్తం 1,01,326 కేసులు నమోదు కాగా అందులో కేవలం 229 కేసులు మాత్రమే తీర్పును పొందాయని పిల్‌లో పేర్కొన్నారు. ఇందులో 70,435 పోక్సో కేసులు 2015నుంచి కొనసాగుతుండగా 2016లో కొత్తగా 30, 891 కేసులు ట్రయల్ కోర్టుకు వచ్చాయని, దీంతో 2016లో మొత్తం పెండింగ్‌లో ఉన్న పోక్సో కేసులు లక్షకు చేరుకున్నాయని తెలిపారు. 12 ఏండ్ల లోపు బాలికలు లైంగికదాడికి గురైన కేసుల దర్యాప్తు, కోర్టుల విచారణ ఆరు నెలల్లోగా పూర్తి చేసేలా పోక్సో చట్టాన్ని రూపొందించాలని ఆయన కోరారు. ఈ పిల్‌ను విచారిస్తూ..అన్ని విధాలుగా పరిశీలించి ఈ కేసులు పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలను తెలుసుకంటామని, ఆ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ధర్మాసనం వివరించింది. జిల్లాల వారీగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసుల వివరాలను సేకరించేలా హైకోర్టు జనరల్స్‌కు సూచించాల్సిందిగా సుప్రీంకోర్టు రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 20కు వాయిదా వేసింది.

పొలిటికల్ ఫన్ చాంగం

మొదటిపేజీ తరువాయి

ప్రతిపక్షాల పంచాంగం... నవ్విపోదురు గాక... అన్నట్టు తయారైంది తెలుగురాష్ట్రాల్లో పంచాంగ శ్రవణాల తీరు. పంచాంగ శ్రవణం పేరుతో పండితులు చెప్పే వాక్కులు విని వేదికపైనున్న వారు ఆహా...ఓహో అని భ్రమించొచ్చుగాక! వినే జనం విస్తుపోతున్నారు. అధికారపక్షానికి మళ్లీ మీదే అధికారం అని...ప్రతిపక్షాలకు మీరే అధికారంలోకి వస్తారంటూ ఎవరికి అనుకూలంగా వారికి నివేదికలు ఇచ్చి.. పండితులు తమ నివేదనల నైవేద్యంతో సంతృప్తి పడుతున్నారు. ప్రపంచంలో ఏ ఒక్కరి హస్తరేఖలు మరొకరితో మ్యాచ్ కావు అనే సత్యాన్ని సైన్స్ తేల్చిచెప్పింది. అందుకే సర్కారు స్కీములన్నింటికీ బయోమెట్రిక్ పేరుతో వేలిముద్రల్ని తప్పనిసరి చేశారు. రేషన్‌షాపులో రూపాయి కిలో బియ్యం తీసుకోవాలన్నా...వేలిముద్ర వేయాల్సిందే అనే నిబంధనను ఈ ప్రభుత్వాలే కదా అమలు చేస్తోంది. ఓ తల్లి గర్భం నుంచి పుట్టిన కవల పిల్లలకు కూడా ఒకే తరహా జాతకాలు ఉండవని ఈ పంచాంగ కర్తలే చెప్తుంటారు. అలాంటప్పుడు అధికార, ప్రతిపక్షాలకు 'మీదే అధికారం' అంటూ స్తోత్కర్షలు చేస్తే...జనం ఎలా నమ్ముతారు. ఖచ్చితంగా పంచాంగం హేతుబద్ధతను ప్రశ్నిస్తారు! పంచాంగాలతోటే ప్రభుత్వాలు నడిస్తే...ఇన్ని రాజకీయ పార్టీలు, ఎత్తుగడలు, పోరాటాలు, ప్రజాఉద్యమాలు ఏం అవసరం. "గతి లేని రాజుకు మతి లేని మంత్రి" అని ఓ సామెత...అలాగే 'యథారాజా...తథా ప్రజ' అనీ అంటారు. ఇప్పుడు రెండు తెలుగురాష్ట్రాల సర్కార్ల వారు చెప్పించిన పంచాంగ శ్రవణాలు ఈ కోవలోవే! ఏ మాత్రం హేతుబద్ధత లేని అంధ విశ్వాస విషయాలకు సెంటిమెంట్‌ను రంగరించి పాలకులు ప్రజల్లోకి వదులుతున్నారు.తెలంగాణ సర్కారు ప్రగతి భవన్‌లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి పంచాంగ శ్రవణం చేస్తూ..దిగ్విజయ పథకాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, బంగారు తెలంగాణ అతి త్వరలో సిద్ధిస్తుందని చెప్పుకొచ్చారు. ఇక సీఎం కేసీఆర్‌కు రాజయోగం మరింత ఉన్నత స్థానంలో ఉంటుందని చెప్పారు. ఇక గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ పంచాంగ శ్రవణంలో రాష్ట్రంలో అధికార మార్పు తథ్యమని, ఆపార్టీ అధికారంలోకి వచ్చేస్తుందని చెప్పారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఉగాది వేడుకల్లో సీఎం చంద్రబాబునాయుడు భార్య, మనుమడితో హాజరయ్యారు. రాజమండ్రికి చెందిన వాసి సుబ్రహ్మణ్య శర్మ ఇక్కడ పంచాంగ శ్రవణం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాటమీద నిలబడతాయని సెలవిచ్చారు. సీఎం చంద్రబాబుకు రాజయోగం కొనసాగుతుందని చెప్పుకొచ్చారు. ఇక అక్కడి ప్రతిపక్ష వైఎస్‌ఆర్‌సీపీ శ్రీశైలంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో రాష్ట్రంలో అధికార మార్పు జరుగుతుందని, వైఎస్ జగన్మోహనరెడ్డి అధికారంలోకి వస్తారని చెప్పారు. అమరావతిలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ నిర్వహించిన ఉగాది వేడుకల పంచాంగ శ్రవణంలో ఆయనకు మహరాజయోగం ఉన్నదని, అత్యంత ఉన్నతమైన పదవుల్ని అధిరోహిస్తారని అక్కడి సిద్ధాంతి చెప్పారు. అసలు 'పంచాంగం' అర్థం ఎంతమందికి తెలుసు. దీన్ని పరిగణించని వారూ బతుకుతున్నారు కదా! తెలుగు రాష్ట్రాల్లో అమావాస్య అంటే ఆమడదూరం పరిగెడతారు. అదే అమావాస్యను తమిళనాడులో పుణ్యతిథిగా గుర్తిస్తారు. ఒకే దేశంలో భిన్న సంస్కృతులు ఉన్నప్పుడు...ఒకరికి తప్పు అయ్యింది, మరొకరికి ఒప్పు అయినప్పుడు ఈ పంచాంగాల విశ్వసనీయత ఏంటనే కనీస ఆలోచన కూడా పాలకులకు లేకుండా పోతోం దంటే...వారు ప్రజల్ని ఏ దిశకు తీసుకెళ్తున్నారో ఇట్టే అర్థమౌతోంది. ఆవు చేలో మేస్తే...దూడ గట్టున మేయదు కదా! ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్నదీ అదే. పండగలు, పబ్బాల సమయంలో తటస్థంగా వ్యవహరించాల్సిన పాలకులు అక్కడా సెంటిమెంట్‌ను పండించి, ఓట్‌బ్యాంక్ కోసం కక్కుర్తి పడుతుండటం చూస్తున్నదే. పంచాగ కర్తలు బతుకుదెరువుకోసమేమో... ఎవరి బాకా వారికి ఊదేసి 'మమ' అనిపించడమే చిత్రంగా అనిపిస్తుంది.

కడుపునకు అన్నం తింటలేరా..

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రతినిధి

నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో ఎరుకలి తిరుపతయ్య పందులు కాస్తూ, బుట్టలు అల్లుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సొంత ఆస్తులేమీలేవు. ఈత కర్రలతో బుట్టలు తయారు చేసి ఊర్లు తిరుగుతూ అమ్మి జీవనం సాగిస్తారు. కొన్ని పందులను కూడా పెంచుతూ.. వాటి నుంచి వచ్చే ఆదాయంతో అతికష్టం మీద బతుకెళ్లదీస్తున్నారు. ఆయనకు 2014లో 'మాడా' పథకం కింద కోడేరు మండల కేంద్రంలోని ఆంధ్రాబ్యాంకు నుంచి ప్రభుత్వం రూ.50 వేలు రుణం ఇచ్చింది. ముందుగా లబ్దిదారు వాటా కింద రూ.5వేలు కడితే, రూ.50 వేలు రుణం మంజూరైంది. ఇందులో రూ.25 వేలు సబ్సిడీ. తిరిగి చెల్లించాల్సిన అప్పు రూ.20 వేలు. అయితే, వడ్డీ చెల్లిస్తూ వస్తున్న తిరుపతయ్య అసలు రుణం కట్టలేకపోయాడు.ఇటీవల బ్యాంకు మేనేజరు పిలిపించి అప్పు చెల్లించాలని అడిగాడు. వారం రోజుల తర్వాత (సోమవారం) చెల్లిస్తానని తిరుపతయ్య బతిమిలాడాడు. అయితే, తిరుపతయ్య పని మీద ఊరెల్లి గత సోమవారం సాయంత్రం వరకు రాలేదు. ఈ సమయంలోనే బ్యాంకు మేనేజరు, క్లర్క్ సాయంత్రం తిరుపతయ్య ఇంటికి వచ్చారు. ఆయన భార్యను నానా రకాలుగా దుర్భాషలాడారు. 'నీ మొగుడు యేడికి పొయ్యిండు. ఈ రోజు బ్యాంకు లోను చెల్లిస్తానన్నాడు' అని అన్నారు. దీంతో తిరుపతయ్య భార్య లలిత 'నా దగ్గర డబ్బులు లేవు. మా అయన వచ్చిన తర్వాత రేపు చెల్లిస్తాం సారు..' అని చెప్పింది. అయినప్పటికీ వినకుండా నానా మాటలు అని కుట్టుమిషన్‌ను లాక్కెళ్లారు. డబ్బులు కట్టకుంటే ఇల్లు కూడా జప్తు చేస్తామని హెచ్చరించారు. తరుపతయ్య విషయం తెలుసుకొని, డబ్బులు కట్టలేదని కుట్టు మిషన్ లాక్కెళ్లడంతో ఊర్లో పరువు పోయిందని మనస్తాపానికి గురయ్యాడు. బ్యాంకు మేనేజరుపై పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టాడు.

కోడేరు మండల కేంద్రంలోని ఆంధ్రాబ్యాంకు నుంచి ఆ ప్రాంత ప్రజలు దాదాపు రూ.నాలుగు కోట్ల వరకు వివిధ రకాల రుణం తీసుకున్నారు. వీరిలో రెండు నుంచి 10 లక్షల వరకు తీసుకున్న వారూ ఉన్నారు. 15 ఏండ్లుగా ఈ అప్పులు తిరిగి చెల్లించలేదు. అందులో పెత్తందారులే ఎక్కువ. వారందరినీ వదిలేసి ఎరుకల కులానికి చెందిన తిరుపతయ్య రూ.20 అప్పు కింద బ్యాంకు మేనేజర్ కుట్టుమిషన్ లాక్కెళ్లడం గమనార్హం.

కాళ్లావేళ్లా పడ్డ కనికరించలేదు: ఎరుకల లలిత

రోజూ బట్టలు కుడుతూ కుటుంబాన్ని పోషించుకునే కుట్టు మిషన్‌ను లాక్కెళ్లారు. కాళ్లా వేళ్లా పడ్డా వినలేదు. నా భర్త లేనప్పుడు బ్యాంకు మేనేజర్ వచ్చి నన్ను హెచ్చరించాడు. కన్నీరు పెట్టుకున్నా కనికరించలేదు. మేం భూమి, బుట్ట లేనోళ్లం. మిషన్ కుడితేనే పూట గడిచేది. రుణం చెల్లించలేదని నానా దుర్భాషలాడి చేతికింది మిషన్‌ను లాక్కెళ్లారు.

పై అధికారుల ఒత్తిడి ఉండబట్టే: ఆంధ్రా బ్యాంకు మేనేజర్

కుట్టు మిషన్‌ను తీసుకెళ్లడం నా సొంత నిర్ణయం కాదు. పై నుంచి ఒత్తిడి ఉండబట్టే గట్టిగా అడిగి మిషన్ తీసుకెళ్లాల్సి వచ్చింది. డబ్బులు కడితే మిషన్ ఇచ్చేస్తాం. అతనికి మరో రూ.రెండు లక్షల రుణం కూడా ఇస్తాం. దీన్ని ఇంతటితో వదిలేయండి. నేను ప్రజల కోసం పని చేస్తున్నాను. రుణం తీసుకున్నవారు తిరిగి చెల్లిస్తేనే కదా.. మేం ఇతరులకు రుణ సౌకర్యం కల్పించేది.

కేసు నమోదు చేస్తాం :ఎస్ఐ షఫీ- కోడేరు

నాకు మూడు రోజుల కిందటే బాధితుని నుంచి దరఖాస్తు వచ్చింది. మేనేజరును కూడా ఫోన్‌లో సంప్రదించాను. ఆయన వ్యవహార శైలి బాగా లేదు. నేను ఫోన్ చేస్తే కేసు పెట్టుకోండి అన్నారు. బాధితులకు న్యాయం చేస్తాను.

కోర్టు ప్రిసైడింగ్ అధికారి అరెస్టు

ఛాతినొప్పి రావడంతో గాంధీ ఆస్పత్రికి తరలింపు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి



అవినీతికి పాల్పడి కోట్ల రూపాయల ఆదాయానికి మించి ఆస్తులను సంపాదించిన నాంపల్లి లేబర్ కోర్టు ప్రిసైడింగ్ అధికారి మల్లంపల్లి గాంధీని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. కాగా నిందితుడికి హఠాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో ఆదివారం రాత్రి గాంధీ ఆస్పత్రికి చంచల్‌గూడ జైలు అధికారులు తరలించారు. ఏసీబీ డీఎస్పీ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న గాంధీ ఆస్తులపై శనివారం ఏసీబీ అధికారులు దాడులను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో హైదరాబాద్ తో పాటు పశ్చిమ గోదావరి జిల్లాల్లో రూ. 3.57 కోట్ల రూపాయల ఆస్తులను గాంధీ కలిగి ఉన్నట్టు ఏసీబీ తేల్చింది. అదే రోజు రాత్రి గాంధీని వారాసీగూడలోని ఆయన నివాసంలో అరెస్టు చేసింది. అయితే తనకు ఛాతిలో నొప్పి వస్తున్నదంటు గాంధీ చెప్పడంతో ఏసీబీ అధికారులు అతన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స జరిపించారు. తర్వాత డాక్టర్లు నిందితుడిని డిశ్చార్జ్ చేయడంతో అతన్ని ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి నివాసంలో హాజరుపర్చారు. దీంతో నిందితుడిని పదిహేను రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉంచాలని న్యాయమూర్తి ఆదేశించడమే గాక అవసరమైతే మరో సారి ఆస్పత్రికి తరలించి చికిత్స జరిపించాలని ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం చంచల్‌గూడ జైలుకు ఏసీబీ అధికారులు గాంధీని తరలించారు. అక్కడికి వెళ్లిన తర్వాత తిరిగి తనకు ఛాతిలో నొప్పి వస్తున్నదంటు గాంధీ తెలపడంతో తిరిగి రాత్రి గాంధీ ఆస్పత్రికి తరలించారు.

బహుజనులు ఏకమవ్వాలి

నవతెలంగాణ-గండిపేట్



సామాజిక న్యాయం కోసం బహుజనులు ఏకమవ్వాలని టీమాస్ రాష్ట్ర చైర్మెన్ కంచ ఐలయ్య పిలుపునిచ్చారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం కిస్మత్‌పూర్‌లో టీమాస్ బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ కోసం అన్ని వర్గాల ప్రజలు పోరాటం చేస్తే కేసీఆర్ ప్రజలకు ఏమీ చేయడం లేదన్నారు. మోడీ మధ్యన ఇద్దరు చంద్రులున్నారని అన్నారు. రాష్ట్రాలను కులాల పేరుతో ముక్కలు చేస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు ఉన్నా చట్టాలను అమలు చేయడం లేదని, కేవలం సీట్లకే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. అందువల్లే ప్రజా సమస్యలపై టీమాస్ ద్వారా గడపగడపనూ తట్టి ప్రజలను చైతన్యవంతం చేస్తామని చెప్పారు.టీమాస్ కన్వీనర్ తమినేని వీరభద్రం మట్లాడుతూ... రాజకీయాల్లో సమన్యాయం కోసం పోరాటం చేయాలన్నారు. సామాజిక వర్గాలందరికీ ఫలాలు అందాలంటే రాజకీయ వ్యవస్థను మార్చాలన్నారు. రాష్ట్రంలో ప్రజాసమస్యలను వదిలేసి.. కొత్తగా కేంద్రంలో థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తామనడం సిగ్గు చేటన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించడమే టీమాస్ లక్ష్యమన్నారు. జీఎస్‌టీ పేరుతో కేంద్రం ప్రజలను మోసం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవస్థలో అన్ని వర్గాల వారికి సమన్యాయం కావాలన్నారు. రాష్ట్రాలకు అధికారాలు వచ్చే విధంగా కేంద్రంతో పోరాటం చేయాలని అన్నారు. విద్య, వైద్య, పరిశ్రమలు వంటి రంగాలు రాష్ట్రాల ఆధీనంలోనే ఉండాలని చెప్పారు. గిరిజనులకు, ఇతర సామాజిక వర్గాలకు రిజర్వేషన్లను పెంచాలన్నారు. అన్ని కులాలను కలుపుకొని బహుజన ఫ్రంట్‌ను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.

టీమాస్ కన్వీనర్లు విమలక్క, గద్దర్ మాట్లాడుతూ.. తెలంగాణ కోసం దెబ్బలు తిన్నాం, కేసుల్లో ముందున్నాం... కానీ వచ్చిన తెలంగాణ ఎవరి చేతిలో ఉందో తెలుసుకోవాలని ప్రజలకు సూచించారు. రాష్ట్రంలో రాచరిక పాలన సాగుతోందన్నారు. మీడియా, పోలీసు వ్యవస్థను చేతుల్లోకి తీసుకుని నిరంకుశ పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. పోరాటాలను అణచివేసే ధోరణితో కేసీఆర్ సర్కార్ పని చేస్తోందన్నారు. ఉన్న కంపెనీలను మూసేయడం, కొత్త కంపెనీల పేరుతో భూ దందాలు చేయడం దారుణమన్నారు. నిరంకుశ నైజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గడ్డ ఇది అని గుర్తుచేశారు. ఆదే స్ఫూర్తితో కేసీఆర్ సర్కార్‌పై పోరాటం చేయాలన్నారు.

టీమాస్ కన్వీనర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. దళితులు, గిరిజనులు, మైనార్టీలు, గౌడ్స్, రెడ్డి వంటి అన్ని కులాల్లోనూ పేదలున్నారని తెలిపారు. దొరలు దొరలుగానే ఉన్నారని, పేదలు మరింత పేదలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు ఉద్యోగాల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. టీమాస్ కన్వీనర్లు శ్రీనివాస్ బహుదూర్, నాగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆశయ్య, భూపాల్, ఇఎస్ఎన్ రెడ్డి, రుద్రకుమార్, వీరేందర్‌గౌడ్ ముక్తాల రేఖా, రాఘవేందర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, స్కైలాబ్‌బాబు, నర్సింగ్‌రావు, యాదవసంఘం నాయకులు లక్ష్మణ్, అఖిలేష్, మల్లేష్, కుర్మయ్య, రాములు పాల్గొన్నారు.

పెండ్లింట విషాదం

నవతెలంగాణ-కౌడిపల్లి

వివాహ వేడుకకు వచ్చిన బంధువులు ఊరి పక్కనే ఉన్న చెరువులో సరదా కోసం చేపలు పట్టేందుకు వెళ్లి ప్రాణం కోల్పోయారు. ఐదుగురు చెరువులో మునిగి మృతిచెందారు. ఈ ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కన్నారం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నారం గ్రామానికి చెందిన ఖాజా ఇంతియాజ్(40) కొన్ని సంవత్సరాల కిందట హైదరాబాద్‌లోని యాకత్‌పూరలో స్థిరపడ్డాడు. స్వగ్రామంలోని దస్తగిరి ఇంట్లో ఈనెల 20న వివాహం ఉంది. అందు కోసం యాకత్‌పూర, మెదక్ నుంచి బంధువులు కన్నారం వచ్చారు. ఈ క్రమంలో ఆదివారం పక్కనే ఉన్న చెరువులో సరదాగా చేపలు పట్టేందుకు ఇంతియాజ్‌తోపాటు ఇసాక్ అలీ(11), మహ్మద్ అలీ(8), మహ్మద్ అఫీజ్(35), హుదా కరీమా(16) సుభాన్, సయ్యద్ జుబెదుల్లా, మరియాఫాతిమా వెళ్లారు. మిషన్ కాకతీయ పనుల్లో భాగంగా చెరువులో పూడిక తీయడంతో పెద్ద గుంత ఏర్పడింది. ఆ విషయం వారికి తెలియక అందరూ వరుసగా దిగారు. ఐదుగురు నీటిలో మునిగిపోయారు. దీన్ని గమనించిన సుభాన్ అరుస్తూ సయ్యద్ జుబెదుల్లా, మరియాఫాతిమాను నీటిలోకి దిగకుండా అడ్డుకున్నాడు. విషయాన్ని వెంటనే గ్రామస్తులకు తెలిపాడు. స్థానికులు వచ్చి కాపాడే ప్రయత్నం చేశారు. కానీ, అప్పటికే ఐదుగురూ చనిపోయారు. తూప్రాన్ డీఎస్పీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. డీఎస్పీ వెంట తూప్రాన్ సీఐ లింగేశ్వర్‌రావు, నర్సాపూర్ ఎస్ఐ వెంకటరాజాగౌడ్, చిలప్‌చెడ్ ఎస్ఐ మల్లయ్య, కౌడిపల్లి ఏఎస్ఐలు వెంకటేశం, కలీమోద్దిన్, డీసీసీబీ జిల్లా వైస్‌చైర్మెన్ గోవర్దన్‌రెడ్డి, సర్పంచ్ దివ్యమహిపాల్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

ప్రొఫెసర్ల భర్తీకి పడిగాపులు!

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఇప్పట్లో లేనట్టే కనిపిస్తున్నది. వర్సిటీల్లో ఖాళీల భర్తీకి ఏదో ఒక రూపంలో అడ్డంకులు వస్తూనే ఉన్నాయి. తాజాగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనల్లో మార్పు తేవడమే ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియ మరింత ఆలస్యం కావడానికి కారణం కానుంది. యూజీసీ రిజర్వేషన్ల విధానంలో సవరణ చేసింది. ఇప్పటి వరకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ విశ్వవిద్యాలయం యూనిట్‌గా ఉండేది. కానీ యూజీసీ మార్చిన నిబంధనల ప్రకారం విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ యూనిట్‌గా పరిగణనలోకి తీసుకోవాలని ఈనెల 5న యూజీసీ ప్రకటించింది. ఈ నిబంధన వెంటనే అమల్లోకి వస్తుందని విశ్వవిద్యాలయాలను ఆదేశించింది. దీంతో తెలంగాణలో విశ్వవిద్యాలయాల్లో ప్రకటించిన 1,061 అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియ ఆలస్యం కానుంది. విశ్వవిద్యాలయాల్లో డిపార్ట్‌మెంట్ వారీగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం రోస్టర్ పాయింట్లు లెక్కించాలంటే మరింత సమయం పట్టే అవకాశం లేకపోలేదు. ఇప్పటి వరకు విశ్వవిద్యాలయం యూనిట్ కాబట్టి గతంలో చేపట్టిన నియామకాల్లో చివరి రోస్టర్ పాయింట్ ఏ సబ్జెక్టు, ఏ రిజర్వేషన్ కేటగిరీకి కేటాయించారన్న దాన్ని బట్టి కొత్తగా తయారు చేస్తారు. కానీ డిపార్ట్‌మెంట్ వారీగా రోస్టర్ పాయింట్లు అంటే కొత్తగా రూపొందించాలి. అదీ న్యాయపరంగా కోర్టులు తప్పు పట్టకుండా, యూజీసీ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ తయారు చేయాలి. విశ్వవిద్యాలయాల అధికారుల మెడపై కత్తి వేలాడుతున్నది.

రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నష్టం

విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియకు ఎప్పుడో నోటిఫికేషన్ వెలువడాల్సి ఉంది. కానీ విద్యాశాఖ ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయం వల్ల నియామక ప్రక్రియ ఆలస్యమవుతున్నది. వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నెట్, సెట్, జేఆర్‌ఎఫ్‌యూజీసీ నిబంధనల సాకుతో రాష్ట్ర ప్రభుత్వం మోకాలడ్డుతున్నది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేయాలంటే పీహెచ్‌డీ పూర్తి చేసి ఉండడం తప్పనిసరి అన్న నిబంధన యూజీసీ అమలు చేయకుండానే తెలంగాణ విద్యాశాఖ ఉన్నతాధికారులు మాత్రం అత్యుత్సాహం ప్రదర్శించారు. 2020-21లో అమలు చేసే ఈ నిబంధనలను మరోసారి పరిశీలించాలని నోటిఫికేషన్లు వెలువడకుండా నిలుపుదల చేశారు. తాజాగా అధ్యాపక పోస్టుల భర్తీకి రిజర్వేషన్ల విధానంలోనే మార్పు రావడంతో కథ మొదటికి వచ్చింది. విశ్వవిద్యాలయం యూనిట్‌గా కాకుండా డిపార్ట్‌మెంట్ యూనిట్‌గా పరిగణించడం వల్ల రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నష్టం కలిగే ప్రమాదం లేకపోలేదు. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో రోస్టర్ పాయింట్లు నిర్ణయించడానికి ఆర్ట్స్, కామర్స్ సబ్జెక్టులు మొదటి ప్రాధాన్యం, సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులకు రెండో ప్రాధాన్యం, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సబ్జెక్టులకు మూడో ప్రాధాన్యం ఉంది. ఆల్ఫబెటికల్ ఆర్డర్ నుంచి సబ్జెక్టుల వారీగా ఖాళీ పోస్టులకు రోస్టర్ పాయింట్లు నిర్ణయిస్తారు. ఉదాహరణకు ఆర్ట్స్‌లో తెలుగు సబ్జెక్టులో మూడు పోస్టులే ఉంటే జనరల్, జనరల్ మహిళ, బీసీ కోటాకు మాత్రమే వర్తించే అవకాశముంది. ఆ తర్వాత ఐదులోపు ఖాళీలుంటే ఇదే విధానం వర్తించనుంది. ఇలా తక్కువ పోస్టులు ఖాళీగా ఉండే డిపార్ట్‌మెంట్లలో రోస్టర్ పాయింట్లు నిర్ణయించి ఆ పోస్టులు ఏ కేటగిరీకి కేటాయించాలన్నది కొంత ఇబ్బందికరంగానే మారనుంది. ఈ నేపథ్యంలో జనరల్ కేటగిరీకి ఎక్కువ పోస్టులు కేటాయించడం, రిజర్వేషన్ కేటగిరీకి తక్కువ పోస్టులు కేటాయించే ప్రమాదం లేకపోలేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తలలు పట్టుకుంటున్న అధికారులు

తెలంగాణలో విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా పోస్టులు భర్తీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో అధికారులపై ఒత్తిడి పెరుగుతున్నది. రిజర్వేషన్ల విధానంలో యూజీసీ నిబంధనల మారడంతో ఏం చేయాలన్న దానిపై ఉన్నత విద్యామండలి అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రత్యామ్నాయ అంశాలపై దృష్టి సారించారు. యూజీసీ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాల్సిందేనని తెలియడంతో ఎలా ముందుకెళ్లాలన్న దానిపై వీసీలతో సంప్రదింపులు చేస్తున్నారు. జూన్ నాటికి ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తామని ఇప్పటికే గవర్నర్ నరసింహన్‌కు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆ హామీని నిలబెట్టుకోవడం ఎలా?అన్నదానిపై సమాలోచన చేస్తున్నారు. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యాప్రమాణాలు తగ్గుతున్నాయి. ఖాళీ పోస్టులతో వర్సిటీల్లో బోధన కుంటుపడుతున్నది. నాణ్యమైన విద్య అందక విద్యార్థులు నష్టపోతున్నారు. పది నెలలు గడుస్తున్నా ఈ ప్రక్రియ ముందుకు సాగకపోవడం పట్ల నిరుద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- రిజర్వేషన్ల విధానం అమలులో సవరణ
- విశ్వవిద్యాలయం బదులు డిపార్ట్‌మెంట్ యూనిట్‌గా పరిగణన
- యూజీసీ నిబంధనల్లో తాజా మార్పే కారణం
- రోస్టర్ పాయింట్ల లెక్కించేందుకు మరింత కాలం పట్టే అవకాశం
- 1061 అధ్యాపక పోస్టుల భర్తీకి గండం

విశ్వవిద్యాలయాల్లో భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన పోస్టులు

విశ్వవిద్యాలయం	ప్రొఫెసర్	ప్రొఫెసర్ అసోసియేట్	అసిస్టెంట్ ప్రొఫెసర్	మొత్తం
మహాత్మాగాంధీ	10	15	09	34
పాలమూరు	12	10	41	63
శాతవాహన	9	16	15	40
తెలంగాణ	11	25	23	59
ఆర్జీయూకేటీ	25	11	60	96
అంబేద్కర్	-	03	07	10
తెలుగు	-	01	06	07
కాకతీయ	-	11	125	136
జేఎన్ఏఎఫ్ఏయూ	-	05	10	15
జేఎన్టీయూహెచ్	32	52	102	186
ఉస్మానియా	-	121	294	415
మొత్తం	**99**	**270**	**692**	**1061**

సెన్సెక్స్ ▼510	నిఫ్టీ ▼125
33,176	10,195

శుక్రవారం ముగింపు నాటికి

డాలరుకు రూపాయి విలువ 64.94



బంగారం(10.గ్రా) రూ. 30,117



వెండి (కేజీ) రూ. 40,200



కోడిగుడ్లు

హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410



11,300 కోట్ల 'అన్‌క్లెయిమ్డ్' డబ్బు

- బ్యాంకుల వద్ద ఉందని ఆర్బీఐ వెల్లడి



బెంగళూరు: బ్యాంకుల వద్ద రూ. 11,300 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డబ్బు ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) తెలిపింది. కాగా, బ్యాంక్ ఖాతాదారులకు చెందిన ఈ డబ్బు అంతా 64 బ్యాంకుల్లోని 3కోట్ల ఖాతాల్లో ఉన్నదని వివరించింది. ఇందులో అధికంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వద్ద రూ.1,262 కోట్లు ఉండగా, పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) వద్ద రూ.1,250 కోట్లు ఉన్నాయి. వీటితో పాటు ఇతర జాతీయ బ్యాంకుల్లో రూ. 7,040 కోట్లు ఉన్నాయని ఆర్‌బీఐ తెలిపింది. 'అన్‌క్లెయిమ్డ్' డబ్బులో చాలా డిపాజిట్లు మృతి చెందిన ఖాతాదారులవి, అనేక బ్యాంకుల్లో ఖాతాలు కలిగి ఉన్నవారివేనని ఆర్‌బీఐ మాజీ ఉన్నతాధికారి బి. చరణ్ వ్యాఖ్యానించారు. ఇలాంటి వాటిలో బినామీ ఖాతాలూ ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టంలోని సెక్షన్-26 ప్రకారం పదేండ్లుగా ఎలాంటి లావాదేవీలు జరపని ఖాతాల వివరాలను అన్ని బ్యాంకులు ఆర్‌బీఐకి సమర్పించాలి. అయితే సెక్షన్-26ఏ ప్రకారం పదేండ్లు దాటినా కూడా ఖాతా రద్దు కాకుండా క్రియాశీలకంగా ఉండటంతో పాటు ఖాతాదారు లేదా నామినీలకు బ్యాంకింగ్ కంపెనీలు డబ్బును తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

బ్యాంకింగ్ చట్టం-2012 ప్రకారం సుదీర్ఘ లావాదేవీలు జరపని బ్యాంక్ ఖాతాల్లోని డబ్బును డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్‌లో నిల్వ చేస్తారు. యాక్సిస్, డీసీబీ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, ఇండస్‌ఇండ్, కోటక్ మహీంద్ర, ఎస్‌బ్యాంక్ వంటి ఏడు ప్రయివేటు బ్యాంకుల్లో రూ. 824 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఉండగా, పన్నెండు ఇతర ప్రయివేటు బ్యాంకుల్లో రూ. 592 కోట్లు ఉన్నాయి. దీంతో ప్రయివేటు బ్యాంకుల్లో మొత్తం రూ. 1,416 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డబ్బు పోగై ఉందని ఆర్‌బీఐ తెలిపింది. ఇందులో ఐసీఐసీఐ బ్యాంక్ రూ. 476 కోట్లతో, కొటక్ మహీంద్ర బాంక్ రూ. 151 కోట్లతో అత్యధికంగా అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు కలిగి ఉన్నాయి. కాగా, విదేశీ బ్యాంకుల్లో రూ. 332 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఉండగా హెఎస్‌బీసీలోనే రూ. 105 కోట్లు ఉండటం గమనార్హం.

900కోట్ల సంపద పోయే!



న్యూఢిల్లీ: గత కొన్ని రోజులుగా వివాదాల్లో చిక్కుకుంటున్న ప్రముఖ సోషల్ మెసేజింగ్ యాప్ స్నాప్‌చాట్ కంపెనీ ఆదాయం దిగజారింది. పాప్ సింగర్ రిహన్నా ఆగ్రహం దెబ్బకు ఆ కంపెనీకి సుమారు రూ.9వేల కోట్ల మేర నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. తాజాగా కంపెనీ సహ వ్యవస్థాపకుడు, సీఈవో ఇవాన్ స్పైగల్ సంపద దాదాపు 150 మిలియన్ డాలర్లు(మన కరెన్సీలో రూ.900కోట్లు) ఆవిరైందని ఫోర్బ్ వెల్లడించింది.

నిండా ముంచాయి

- ఆరు కంపెనీలు..52 వేలకోట్లు
- ఎక్కువ నష్టం టీసీఎస్ నుంచే..

జనం దబ్బుకు ఎక్కడా భద్రతాలేదు.రియల్ రంగం కుదేలైతే..బ్యాంకుల్లోదాచుకుందామనుకున్నా ఎవరు కొల్లగొడతారోనన్న భయం ఖాతాదారులను భయపెడుతున్నది.కనీసం కొన్ని షేర్లు కొందామనుకుంటే..బడా కంపెనీలే ఊహించని విధంగా పల్టీకొడుతున్నాయి. దీంతో భవిష్యత్ గురించి బెంగపెట్టుకుంటున్న మధ్యతరగతి జనం ఆర్థిక స్థితిపై కోలుకోలేనివిధంగా షేర్ మార్కెట్ దెబ్బతీస్తున్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

న్యూఢిల్లీ: గత వారం రోజులనుంచి మార్కెట్‌లో నెలకొన్న హెచ్చుతగ్గుదలతో ఆరు కంపెనీల్లో పెట్టిన 52వేల కోట్లమేర పెట్టుబ డులు నష్టపోయారు.దేశంలోని టాప్ పది కంపెనీలు ఉండగా..అందులో ఆరు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన షేర్‌హోల్డర్స్‌లకు భారీగా నష్టం వాటిల్లింది .ప్రముఖ ఐటీ సంస్థ టీసీఎస్ మార్కెట్ క్యాప్ అన్నిటి కన్నా ఎక్కువగా క్షీణించింది.శుక్రవారం వ్యాపారం ముగిసేనాటికి అయిన వ్యాపారంలో.. రిలయన్స్,ఇండస్ట్రీ,టీసీఎస్,హెచ్‌డీఎఫ్‌సీ,హెచ్‌యూఎల్,ఓఎన్జీసీ,హెచ్‌బీఐకు చెందిన మార్కెట్ క్యాప్‌లో తగ్గుదల కనిపి ంచింది. ఐటీసీ,మారుతి సుజుకీ,ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాప్‌లో పెరుగుదల కనిపించింది.

టాప్ లూజర్ టీసీఎస్

గతవారం జరిగిన లావాదేవీల్లో దేశంలోని అతిపెద్ద ఐటీ సంస్థ టీసీఎస్‌కు ఊహించని షాక్ తగిలింది.టీసీఎస్ మార్కెట్ క్యాప్ 40,008.61 కోట్లు కాగా,54,881.96 కోట్లకు చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీ మార్కెట్ క్యాప్ 7,316.53కోట్ల నుంచి 5,70,435.32 కోట్లకు..ఓఎన్జీసీ మార్కెట్ క్యాప్ 2,887.48 కోట్ల నుంచి 2,27,661.59 కోట్లకు దిగజారింది. హెచ్‌డీఎఫ్‌సీ వ్యాల్యూయేషన్ 989. 48 కోట్లకు తగ్గి 2,99,893 కోట్లకు సరిపెట్టు కున్నది.ఎస్బీఐ మార్కెట్ క్యాప్ 474.76 కోట్ల నుంచి జారి 2,18,045కోట్లకు చేరింది. హెచ్‌యూఎల్ వ్యాల్యూయేషన్ 324.67 కోట్ల నుంచి 2,81,190.10 కోట్లకు దిగజారింది.ఇన్ఫోసిస్ టాప్ గెయినర్ దేశంలో రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాప్ 1,987.55 కోట్లనుంచి పెరిగి 2,56,087.40 కోట్లకు చేరింది.ఐటీసీ మార్కెట్ క్యాప్ 1,577.79 నుంచి 3,17,976.53కోట్లకు ఎగబాకింది.



టాప్ టెన్ కంపెనీల ర్యాంకింగ్

- ఆర్ఐఎల్
- టీసీఎస్
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్
- ఐటీసీ
- హెచ్‌డీఎఫ్‌సీ
- హెచ్‌యూఎల్
- మారుతి
- ఇన్ఫోసిస్
- ఓఎన్జీసీ
- ఎస్బీఐ

పాత నోట్లను రీసైకిల్ చేయట్లేదు

నుజ్జు నుజ్జుగా చేసి దిమ్మెల తయారీ: ఆర్బీఐ




న్యూఢిల్లీ: రద్దు చేసిన నోట్లను రీసైకిల్(తిరిగి వాడటం) చేయట్లేదని ఆర్బీఐ స్పష్టం చేసింది. అయితే రద్దు చేసిన 500, 1000 రూపాయల నోట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసిన తర్వాత వాటిని నుజ్జు నుజ్జుగా చేసి దిమ్మెలను తయారు చేస్తున్నారని ఓ ఆర్టీఐకి సమా ధానంగా ఆర్బీఐ తెలిపింది. అనేక ఆర్బీఐ కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యంత్రాలతో దిమ్మెలను తయారుచేస్తున్నారని వివరించింది. దిమ్మెల తయారీ పూర్తయ్యాక వాటిని ఎంచుకున్న మార్గాల్లో వినియోగిస్తున్నామని పేర్కొంది. దేశవ్యాప్తంగా ఆర్బీఐ కార్యాలయాల్లోని దాదాపు 59 కరెన్సీ వెరిఫికేషన్ అండ్ ప్రాసెసింగ్ యంత్రాలతో రద్దు చేసిన నోట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగు తోందని తెలిపింది. ఈ ప్రాసెస్ అయిన నోట్లతో దిమ్మెలను తయారు చేస్తున్నట్టు వివరిం చింది. పెద్దనోట్లను రద్దు చేసిన తర్వాత 2017 జూన్ 30వరకు 15.28 లక్షల కోట్ల రూపాయలు తిరిగి వచ్చాయని ఆర్బీఐ 2016-17 వార్షిక నివేదికలో ప్రకటించిన విషయం తెలిసిందే.

నోట్ల రద్దు అతిపెద్ద అబద్ధం : చిదంబరం



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నోట్ల రద్దు ప్రక్రియ అతిపెద్ద అబద్ధమని కేంద్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి పి చిదంబరం అభివర్ణించారు. కాంగ్రెస్ ప్లీనరీ సమావేశంలో రెండోరోజు ఆయన పాల్గొన్నారు. పార్టీ ఎకానమిక్ పాలసీపై ప్రసంగించిన అనంతరం మాట్లాడుతూ... నోట్లరద్దు కంటే అతిపెద్ద అబద్ధం మరొకటి లేదని దాని వల్ల ఎంతో మంది ఉద్యోగాలు కోల్పోయారని అన్నారు. అలాగే జీఎస్టీని అమలు చేయడం ద్వారా ప్రజల్ని పేదరికంలోకి నెట్టివేసిందని కేంద్రాన్ని విమర్శించారు. నోట్ల రద్దు చేపట్టిన అనంతరం నల్లధనం ఎంతమేరకు వెలికి వచ్చిందనేది ఆర్బీఐ ఇప్పటికీ చెప్పలేదని అన్నారు. బ్యాంకులకు ఎంత డబ్బు చేరిందో ఇకపై వారు చెప్పబోరని తెలిపారు.



జీఎస్టీ వసూళ్లు



దేశంలోని ప్రధాన పోర్టుల్లో

కార్గోల తీరిది




విప్ జారీ చేసిన తెలుగుదేశం పార్టీ



న్యూఢిల్లీ: బీజేపీతో మిత్రబంధం తెంచుకున్న తెలుగుదేశం పార్టీ.. ఏపీకి ప్రత్యేక హెూదా కోసం సన్నద్ధమైంది. ఇందులో భాగంగా కేంద్రమంత్రి పదవులకు రాజీనామా చేసింది. తర్వాత బీజేపీతో పొత్తును ఉపసంహరించుకున్నది. తాజాగా అవిశ్వాసం తీర్మానం పెట్టైనా హెూదా సాధించాలని నిర్ణయించుకుంది. ఇప్పటికే కేంద్రప్రభుత్వంపై అవిశ్వాసం నోటీస్ ఇచ్చింది. ప్రత్యేక హెూదా ఇచ్చి తీరాల్సిందేనని డిమాండ్ చేసింది. అయితే ఆ రోజు సభ ఆర్డర్‌లో లేకపోవడంతో లోక్‌సభను సోమవారానికి వాయిదా వేశారు. దీంతో సోమవారం రోజు పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఇప్పటికే ఆ పార్టీ ఎంపీలకు అధిష్టానం దిశానిర్దేశం చేసింది. పార్లమెంట్ సమావేశాలు ముగిసే వరకూ ఎంపీలు తప్పసరిగా సభకు హాజరుకావాలని విప్ జారీ చేసింది.

అవిశ్వాసాన్ని ఓడిస్తాం

- వైఎస్సార్సీపీ,టీడీపీ నోటీసులపై నోరువిప్పిన అమిత్‌షా



న్యూఢిల్లీ: మోడీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని చాలా సునాయాసంగా ఓడిస్తామని బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా చెప్పారు. ఎన్డీయేకు 300కు పైగా సభ్యుల మెజారిటీ ఉన్నదని తెలిపారు. ఏపీకి ప్రత్యేక హెూదా కోరుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇవ్వడంపై అమిత్‌షా తొలిసారి మాట్లాడుతూ, 'అవిశ్వాస తీర్మానాన్ని ఇంత ఆలస్యంగా ఎందుకు పెడుతున్నారు? మేం అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. నిబంధనల ప్రకారం సభలో చర్చ జరగాల్సి ఉంటుంది. ఓటింగ్ అంటూ జరిగితే సభలో ఓడిపోతామని కాంగ్రెస్, ఇతర పార్టీలకు బాగా తెలుసు. అందుకే సభను సజావుగా సాగకుండా అడ్డుకుంటున్నారు' అని అమిత్‌షా ఆరోపించారు.

కొన ఊపిరిలో వైద్యం

వైద్యఆరోగ్యశాఖలో 11,125 పోస్టుల ఖాళీ

- 10,718 పోస్టులు మంజూరు చేసినా ఒక్కటీ భర్తీకానీ దుస్థితి
- డాక్టర్లు, సిబ్బంది కొరతతో రోగుల పాట్లు
- ఉన్న సిబ్బందిపై తీవ్రమవుతున్న ఒత్తిడి
- సర్కారు దవాఖానలపై ప్రభావం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యఆరోగ్యశాఖలో డాక్టర్లు, సిబ్బంది కొరత వేధిస్తోంది. ఈ ప్రభావం రోగులపై పడుతోంది. ఆస్పత్రులకు వస్తే వారి ఆరోగ్యానికి భరోసా లేకుండా పోతోంది. పెద్ద రోగమొస్తే ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వైద్యుల పోస్టులు మొదలుకుని వార్డు బాయ్‌దాకా పోస్టులు ఏండ్ల తరబడి ఖాళీగా ఉండటమే ఇందుక్కారణం. ప్రజలకు వైద్యసేవలు భారం కాకుండా ప్రభుత్వాస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో పలు కార్యక్రమాలు చేపడుతున్న సర్కారు అందుకు అనుగుణంగా పోస్టులను మాత్రం భర్తీ చేయడంలేదు. నోటిఫికేషన్లతో సరిపెడుతూ నెలల తరబడి నాన్చుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ శాఖలో మొత్తం 37,141 పోస్టులు ఉండగా, 11,125 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 26,016 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వాస్తవానికి ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రుల దాక 24 గంటలపాటు సవ్యంగా పనిచేయాలంటే.. ఇప్పటికే ఉన్న ఖాళీలను భర్తీ చేయడంతోపాటు కొత్తగా మరో 12,353 పోస్టులను మంజూరు చేయాలని గతంలో అధికారులు నివేదిక రూపొందించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం 10,718 పోస్టులను ఇప్పటికే మంజూరు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా పలు ఆస్పత్రుల్లో ఐసీయూ యూనిట్లతోపాటు 40 డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు జరుగుతోంది. కేసీఆర్ కిట్ల పథకంతో ప్రభుత్వాస్పత్రుల్లో రోగుల సంఖ్య భారీగా పెరుగుతోందని అధికారులు ప్రకటిస్తున్నారు. చాలా ఆస్పత్రుల్లో రోగుల సంఖ్య పెరిగినా.. తదనుగుణంగా నిపుణులైన వైద్యులు అందుబాటులో లేరరని, దాంతో తమపై పని ఒత్తిడి పెరిగిందని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. కాగా, 2,118 పోస్టుల భర్తీకి 13.07.2016న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, 660 పోస్టుల భర్తీకి 18.05.2017న ఉత్తర్వులు ఇచ్చింది. కానీ, అడుగు ముందుకు పడలేదు. ఇక తెలంగాణ హెల్త్ యూనివర్సిటీ ఏర్పాటై రెండేండ్లు గడుస్తున్నా.. వీసీ, రిజిస్ట్రార్ మినహా మిగతా పోస్టులు భర్తీ చేయలేదు. దీంతో యూనివర్సిటీ పూర్తి స్థాయిలో పనిచేయలేని పరిస్థితి నెలకొంది. ఏండ్లు గడుస్తున్న వర్సిటీ పూర్తిస్థాయిలో పరిపాలన జరగడంలేదు. ఉన్నతాధికారులు సైతం పోస్టుల భర్తీ విషయాన్ని పట్టించుకోవడంలేదు. రాష్ట్రంలో వైద్యవిద్య నిర్వహణలో కీలకమైన వర్సిటీపై ఆ శాఖ మంత్రి లక్ష్మారెడ్డి దృష్టిసారించకపోవడం వల్లే పోస్టుల భర్తీ ప్రక్రియ వెనుకబడిందనే విమర్శలు ఉన్నాయి. వర్సిటీ నిర్వహణకు అవసరమైన 82 పోస్టులను శాశ్వత ప్రాతిపదికన, 22 పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేసేందుకు అనుమతిస్తూ గతంలో ఉత్తర్వులు జారీ చేసినా ఫలితం లేదు. అలాగే, వైద్యశాఖలో ఇతర వర్సిటీల్లో పనిచేస్తున్న 21 మందిని డిప్యూటేషన్‌పై నియమించారు. దీంతో 61 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. రాష్ట్రంలో ఆహార కల్తీని నిర్మూలించేందుకు 23 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసినా నియామకాలు జరగలేదు. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రికి 251 పోస్టులను మంజూరు చేసిన అతీగతీలేదు. నిమ్స్ విస్తరణ కోసం మంజూరు చేసిన 1,472 పోస్టుల భర్తీ కూడా జరగలేదు. బీబీనగర్‌లోని నిమ్స్‌లోనూ ఓపీ సేవలను ప్రారంభించినా.. అక్కడ పనిచేయడానికి వై ద్యులు, ఇతర సిబ్బంది లేరు. రోజూ నిమ్స్ నుంచి వైద్యులు బీబీనగర్‌కు వెళ్లి సేవలందిస్తున్నారు. వైద్యవిద్య, డైరెక్టర్ ఆఫ్ హెల్త్, వైద్యవిధాన పరిషత్ విభాగాల్లో మొత్తం 8,890 పోస్టులు మంజూరైన ఒక్కటంటే ఒక్క పోస్టు కూడా భర్తీకి నోచుకోలేదు. రాష్ట్రంలో మెడికల్ కళాశాల్లో భారీగా ఖాళీలు ఉన్నాయి. మొత్తం 1,535 పోస్టుల్లో ప్రొఫెసర్లు 111 (33%), అసిస్టెంట్ ప్రొఫెసర్లు 58 (20%), అసోసియేట్ ప్రొఫెసర్లు 206 (22%), మొత్తం 375 (24.42%) ఖాళీగా ఉన్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అలాగే, వైద్యవిద్య డైరెక్టర్ పరిధిలో మొత్తం సిబ్బంది 3,387 మంది ఉండాల్సి ఉండగా 1,482 ఖాళీలు ఉన్నాయి. ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ పరిధిలో మొత్తం 6,662 మంది సిబ్బందిగాను 2,659 ఖాళీలు ఉన్నాయి. వైద్యవిధాన పరిషత్ పరిధిలో 2961 సిబ్బందికిగాను 1,055 ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

ప్రస్తుతం ఉన్న ఉద్యోగాలు, ఖాళీల వివరాలు

విభాగం	మొత్తం పోస్టులు	ఉన్న ఉద్యోగులు	ఖాళీల సంఖ్య
వైద్యవిద్య	9,205	5,726	3,479
కుటుంబ సంక్షేమం	17,148	10,882	6,266
వైద్యవిధాన పరిషత్	7,303	7,295	8
ఆయుష్	2,697	1,706	991
సచివాలయం	17	14	3
డ్రగ్స్ కంట్రోల్	202	148	54
ఐపీఎం	569	245	324
మొత్తం	37,141	26,016	11,125

మంజూరైన కొత్త పోస్టులు

విభాగం	పోస్టులు
డీఎంఈ	3,635
ప్రజారోగ్య సంచాలకులు	708
నిమ్స్	1,472
ఎంఎన్‌జే	251
ఐపీఎం	23
హెల్త్ యూనివర్సిటీ	82
వైద్యవిధాన పరిషత్	4,547
మొత్తం	10,718

ఇదెలా సాధ్యం ?

ఖాదీ పరిశ్రమలో 7 లక్షల ఉద్యోగాలు పోయాయి

- మరోవైపు ఉత్పత్తి, అమ్మకాలు పెరిగాయి
- నిజాల్ని దాస్తోన్న కేంద్ర సూక్ష్మ, చిన్నమధ్య తరహా పరిశ్రమల శాఖ
- లోక్‌సభకు తెలిపిన సమాచారంపై అనేక అనుమానాలు

న్యూఢిల్లీ: ఏదైనా రంగంలో ఉత్పత్తి పెరిగిందంటే... అందులో ఉపాధి పొందుతున్న కార్మికుల సంఖ్య పెరగాలి. కానీ ఖాదీ పరిశ్రమలో దీనికి విరుద్ధంగా జరిగింది. దేశవ్యాప్తంగా ఖాదీ పరిశ్రమల్లో 7లక్షల మంది ఉపాధి కోల్పోయారని, అదే సమయంలో ఖాదీ ఉత్పత్తి, అమ్మకాలు పెరిగాయని లోక్‌సభకు అందజేసిన నివేదికలో 'కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ' పేర్కొన్నది. పొంతనలేని లెక్కలతో ఈ శాఖ లోక్‌సభకు అందజేసిన సమాచారంపై నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేవలం చరఖాల ఆధునీకరణ వల్లనే లక్షలాది మంది ఉపాధి కోల్పోయారని ఆ శాఖ చెప్పటం...వాస్తవాల్ని దాయటమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పెద్ద సంఖ్యలో కార్మికులు ఉపాధి కోల్పోవడానికి గల సరైన కారణాల్ని నివేదికలో పొందుపర్చలేదని వారు తప్పుబట్టారు.

2015-16 నుంచి 2016-17 మధ్య దేశంలో ఖాదీ ఉత్పత్తి 32 శాతం పెరిగింది. ఖాదీ అమ్మకాలు 33 శాతం పెరిగాయి. దీనికి కారణం చరఖాల ఆధునీకరణ. దీని వల్లనే లక్షలాది మంది ఉపాధి కోల్పోయారని కేంద్ర మంత్రిత్వ శాఖ పేర్కొనటం వాస్తవాలకు దూరంగా ఉంది.

ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) చెప్పినదాని ప్రకారం, దేశవ్యాప్తంగా ఖాదీ తయారీ రంగంలో లక్షలాది మంది ఉపాధి కోల్పోతున్నారు. వీటి గణాంకాల్ని 2015-16 ఏడాదికి సంబంధించిన సమాచారంలో పొందుపర్చలేదు. అనేక మంది ఉపాధి కోల్పోవడానికి కొత్త మోడల్‌లో వచ్చిన చరఖాలు కొంతవరకు కారణమ య్యాయి. సాంప్రదాయ చరఖాలను నడిపేవారిని ఇవి దెబ్బతీశాయి.

అయితే ఉపాధి కోల్పోయిన వారి సంఖ్య ఎంత, ఖాదీ తయారీరంగంపై దాని ప్రభావం వంటి వివరాలేవీ బహిర్గతం చేయటం లేదు. ఉత్తరాఖండ్, యూపీ, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 3.2లక్షల మంది ఉపాధి కోల్పోయారు. బీహార్, ప.బెంగాల్, జార్ఖాండ్, ఒడిశా రాష్ట్రాల్లో, అండమాన్, నికోబార్‌లో మొత్తం 1.2లక్షల మంది ఖాదీ పరిశ్రమ నుంచి బయటకొచ్చారు.



ఫైల్

ఉపాధి కల్పన...ఉత్తదేనా ?

ప్రధానమంత్రి ఉపాధి కల్పన (పీఎంఈజీపీ) పథకం కింద ప్రతీ ఏటా ఉపాధి పొందుతున్నవారి సంఖ్య కూడా తగ్గుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి రంగాన్ని మెరుగుపర్చటం కోసం తీసుకొచ్చిన పథకమే 'పీఎంఈజీపీ'. దీనికింద లబ్దిదారులకు సబ్సిడీతో కూడిన సూక్ష్మరుణాల్ని అందజేస్తారు. ఈ పథకంపై తాజా గణాంకాల్ని లోక్‌సభలో సంబంధిత మంత్రిత్వశాఖ విడుదల చేసింది. దీని ప్రకారం, రుణ సహాయాన్ని పొందిన ప్రాజెక్టుల సంఖ్య క్రమంగా తగ్గింది. 2016-17లో 53 వేల ప్రాజెక్టులకు రుణ సాయం అందితే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి మధ్య కేవలం 31వేల ప్రాజెక్టులకు మాత్రమే రుణసాయం దక్కింది. అలాగే, 2015-16లో 3.2లక్షలమంది కొత్తగా ఉపాధి పొందితే, 2016-17లో ఆ సంఖ్య 4.1లక్షలకు పెరిగింది. కానీ 2017-18నాటికి వచ్చేసరికి ఇప్పటిదాకా కేవలం 2.5 లక్షలమంది మాత్రమే పీఎంఈజీపీ పథకం ద్వారా ఉపాధి పొందారు.

బహుజన సమాజ్ పార్టీని జాతీయ పార్టీగా తీర్చిదిద్దడంలో కాన్షీరామ్ నిరంతరం శ్రమించి విజయం సాధించాడు. దేశంలో పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌కు ఒక సామాన్య మహిళ, 'చమార్' స్త్రీని మూడు సార్లు ముఖ్యమంత్రిని చేసిన ఘనత పూర్తిగా కాన్షీరామ్‌దే. ఓట్ల రాజకీయాలను నోట్లు కలుషితం చేస్తూ కార్పొరేట్ రాజకీయాలు కొనసాగుతున్న తరుణంలో 'ఒక ఓటు ఒక నోటు' అనే నినాదంతో ప్రజల దగ్గరకు వెళ్లి వారిచ్చే డబ్బుతో ప్రచారం చేస్తూ ఉత్తరప్రదేశ్‌లో అధికారాన్ని సాధించి దేశ రాజకీయాలకు సరికొత్త విలువలు నేర్పిన మార్గదర్శకుడు కాన్షీరామ్. పదవులు ముఖ్యం కాదు బహుజన సమాజ్ నిర్మాణమే నా కర్తవ్యం అని భావించేవారు. అంబేద్కర్ కలలు నిజం చేయడానికి ముందుకురికిన రాజనీతిజ్ఞుడు. కొన్ని రాజకీయ పార్టీలు వారి వారి పార్టీ స్థాపకుల ఫొటోలను వేదిక మీద ప్రదర్శిస్తుంటే కాన్షీరామ్ మాత్రం జాతిని చైతన్యపరిచిన బుద్ధుడు, పూలే, నారాయణగురు, పెరియార్, అంబేద్కర్ వంటి సామాజిక విప్లవకారుల చిత్రపటాలను బహిరంగ సభల్లో ప్రదర్శించేవారు.

బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా కాన్షీరామ్

డా॥ సోమేశ్వర్ బోనకుర్తి

బడుగు బలహీన వర్గాల దాస్య విముక్తి కోసం మహాత్మా బసవేశ్వర్, మహాత్మా జ్యోతీరావుపూలే, పెరియార్ రామస్వామి నాయకర్, ఛత్రపతి సాహూజీ మహరాజ్, నారాయణ గురు, కబీర్, సంత్‌రవిదాస్, బిర్సాముండా, గాడ్గీ బాబా, భాగ్యరెడ్డి వర్మ, భారత రాజ్యాంగ నిర్మాత డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ మొదలైన వారు అహర్నిశలు కృషి చేశారు. అదే స్ఫూర్తితో బహుజనుల సకల సమస్యల పరిష్కారమే ఏకైక లక్ష్యంగా మహోద్యమాన్ని నడిపిన యోధుడు కాన్షీరామ్. 'ఓట్ హమారా – రాజ్ తుమారా, నహీ చలేగా.. నహీ చలేగా' అనే డైనమేట్ వంటి నినాదంతో ఉత్తరప్రదేశ్‌లో రాజకీయ ప్రకంపనలు సృష్టించిన గొప్ప వ్యూహకర్త మాన్యశ్రీ కాన్షీరామ్.

1934 మార్చి 15న పంజాబ్ రాష్ట్రం, రోపార్ జిల్లా ఖవాస్‌పూర్‌లో ఉన్న పీర్షిపూర్ బంగ్లా గ్రామంలో ఒక చమార్ కుటుంబంలో కాన్షీరామ్ జన్మించారు. ఆయిదో సిక్కు గురు రాందాస్ చమార్‌లను సిక్కు మతంలోకి తీసుకువచ్చారు. వారిని రాందాసియాలు అనేవారు. తన గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న కాన్షీరామ్ అక్కడే వివక్ష అసలు స్వరూపాన్ని ఎదుర్కొన్నారు. ఆ స్కూలులో దళిత సాధువులతో వేరే బెంచిపై కూర్చోపెట్టేవారు. కబీర్, రవిదాస్‌ల వంటి దళిత సాధువులతో ప్రభావితమైన ఖల్సా పంథ్, ఆర్యసమాజ్ ఉద్యమాల ప్రభావం చిన్ననాడే కాన్షీరామ్‌పై పడింది. రోపార్‌లో 1956లో బీఎస్సీ పూర్తి చేశారు. కొంతకాలం డెహ్రాడూన్‌లోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో పని చేశారు. సర్వే ఆఫ్ ఇండియాలో పరీక్ష పాసైనప్పటికీ బాండ్‌రాసి ఉద్యోగం చేసేందుకు నిరాకరించారు. చివరకు పూణేలోని (ఈఆర్‌డీఎల్) ఎక్స్‌ప్లోజివ్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబరేటరీలో సైంటిస్ట్‌గా చేరారు. అక్కడ అగ్రవర్ణాలు బుద్ధ జయంతి, అంబేద్కర్ జయంతి సెలవులను రద్దు చేయడంపై దళిత ఉద్యోగులు నిరసన తెలుపడం, అందులో రాజస్థానీ షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిని సస్పెండ్ చేయడంపై కాన్షీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన పక్షాన నిలిచి పోరాడారు. అది ఆయన దళిత ఉద్యోగుల ఉద్యమాన్ని నిర్మించేందుకు కారణమైంది. ఈ ఉద్యమం తీవ్రం కావడంతో కాన్షీరామ్ ఏకంగా రక్షణ మంత్రి వైబి.చవాన్‌ను కలిసి పరిస్థితి వివరించారు. చవాన్ మొత్తం ఉదంతంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించి సస్పెండైన ఉద్యోగికి న్యాయం జరిగేలా చేశారు. దీనితో కాన్షీరామ్ దళిత ఉద్యోగులకు ఒక హీరోగా మారారు. ఈ సంఘటనే కాన్షీరామ్ జీవితాన్ని మార్చివేసింది. అదే సమయంలో ఆయన డా॥ బి.ఆర్. అంబేద్కర్ రచించిన 'అనిహిలేషన్ అఫ్ క్యాస్ట్' చదివి ఎనలేని ప్రభావానికి గురయ్యారు. అంబేద్కర్ గురించి తెలుసుకున్న కొద్దీ కాన్షీరామ్ ఏదో తెలియని మానసిక ఒత్తిడికి గురయ్యేవాడు. అంబేద్కర్‌కి చదువు పట్ల అంతటి కోరికకు కారణం ఏమిటి? భార్య పిల్లలు అనారోగ్యంతో ఉన్నప్పటికీ రక్త బంధాలను విడిచిపెట్టి తన జాతికోసం ఎందుకు ఇంతలా తపన పడ్డాడు! ఇవన్నీ తలచుకుని కాన్షీరామ్ చలించిపోయాడు. తన జాతి జనుల కోసం పాటుపడ్డ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల్ని కొనసాగించాలని, ప్రస్తుత సామాజిక వ్యవస్థపై తిరుగుబాటు చేయక తప్పదని నిర్ణయించుకున్నారు. తన జాతి జనుల కోసం పాటుపడ్డ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల్ని కొనసాగించాలని ఒక దృఢ నిశ్చయానికి వచ్చాడు కాన్షీరామ్. అంబేద్కర్ ఉద్యమాలను, గ్రంథాలను శోధించడం ప్రారంభించడమేకాక మహాత్మ జ్యోతిబాపూలే, ఛత్రపతి సాహూమహరాజ్, నారాయణగురు, పెరియార్ రామస్వామి, వంటి నాయకుల జీవితాలను, పోరాటాలను అధ్యయనం చేశాడు.

కుల ప్రాతిపదికన విభజించబడి అస్తవ్యస్తంగా ఉన్న సమాజాన్ని మార్చాలంటే కొన్ని త్యాగాలు చేయక తప్పదని, నిజాయితీతో కూడిన సమరశీల శక్తిగా ఎదగడానికి బ్రహ్మచర్యం పాటించాలని కాన్షీరామ్ కఠిన నిర్ణయాన్ని తీసుకున్నాడు. "బహుజన సమాజమే నా కుటుంబం. బాబాసాహెబ్ అంబేద్కర్ చేపట్టిన మహోన్నత సామాజిక ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడమే నా జీవిత లక్ష్యం" అనే నిర్ణయాన్ని స్పష్టంగా తెలియజేశారు. భుజాన ఒక సంచితో పాత సైకిలుపై కాళ్లకు చెప్పులు లేకుండా ఊరూరు తిరిగి కరపత్రాలు పంచుతూ, ఆకలి, దాహం మర్చిపోయి ముంబాయి, దుర్గి, రాయపూర్, ఒస్తర్, నాగపూర్, నాందేడ్, పూనే, జబల్‌పూర్, బిలాయ్ మొదలగు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించాడు.

1965 నుంచి 1971 వరకు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాను బలోపేతం చేయడానికి రాత్రి పగలు అకుంఠిత దీక్షతో కృషి చేశాడు. ఆర్‌పీఐలో వచ్చిన విభేదాలతో ఆయన పార్టీ నుంచి బయటకు వచ్చి తన ఉద్యమాన్ని కొనసాగించారు. బోధించు, పోరాడు, సమీకరించు నినాదంతో 1978 డిసెంబర్ 6న 'వెనుకబడిన కులాల, మైనారిటీ ఉద్యోగుల సమాఖ్య' (బామ్‌సెఫ్) స్థాపించారు. తాము పుట్టిన కులంలోని అట్టడుగున ఉన్న తమ సోదరుల కోసం తాము కొంత పాటుపడాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ కృషితో వచ్చిన



రిజర్వేషన్ల వల్ల లాభం పొందిన వారిని ఏకం చేశారు. ఐదు సంవత్సరాల పాటు కాన్షీరామ్ ఉద్యోగుల సమీకరణకు తీవ్రంగా కృషి చేసాడు. కాన్షీరామ్ ఈఉద్యమాన్ని ఒక పవిత్ర కార్యంగా భావించాడు. కాన్షీరామ్ కార్యకర్తలు ప్రజలను విస్తృత పరిధిలో నమోదు చేయించడం, సచివాలయ నిర్మాణం, సంస్థాగత నిర్మాణం, ఢిల్లీలో ప్రధాన కార్యాలయం ఏర్పాటు, సహోదరత్వం, దత్తత, వైద్య సహాయం, సలహాలు, సాహిత్య శాఖ, పరిశోధనాశాఖ, స్వచ్ఛంద కార్యకర్తల దళం ఏర్పాటు చేశారు.

సామాజిక పరివర్తన ధ్యేయంగా 1981 డిసెంబర్ 6న దళిత అణగారిన వర్గాల పోరాట సమితి (డీఎస్ 4) స్థాపించారు. ఉత్తర భారతదేశంలో ఒక సంచలనాత్మక సామాజిక విప్లవాన్ని సృష్టించారు. ఇందులో యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో చేరారు. "చిన్న చిన్న సాధనాలను పెద్ద ఎత్తున ఉపయోగించి పెద్ద సాధనాల వారిని ఓడించండి" అంటూ కాన్షీరామ్ యువతకు పిలుపునిచ్చాడు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు 'సమానత్వం కోసం' సైకిల్ ర్యాలీ నిర్వహించిన కాన్షీరామ్ 1982లో హర్యానా, ఢిల్లీ, పంజాబ్, జమ్మూకాశ్మీర్ ఎన్నికల్లో సంస్థ పోటీ చేసి 4వ స్థానాన్ని సాధించింది. 1930లో డా॥బి.ఆర్. అంబేద్కర్ తొలిసారిగా ఓటు హక్కు లభించాక "మీరు వెళ్లి మీ ఇంటి గోడలపై రాయండి, ఈ దేశానికి మేము పాలకులం కాబోతున్నాం" అని పేర్కొన్నారు. ఈ నినాదాన్ని తీసుకుని 14 ఏప్రిల్ 1984న బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించారు. కాన్షీరామ్ ఏ కొత్త కార్యక్రమం మొదలు పెట్టినా అది అంబేద్కర్ పుట్టిన రోజున గానీ, మరణించిన రోజున గానీ చేస్తారు. ఎందుకంటే ఆ రెండు రోజులు బహుజనులకు ప్రధానమైనవని ఆయన భావించేవారు.

1984 నుంచి జరిగిన ఎన్నికలలో బీఎస్‌పీ తన అభ్యర్థులను నిలబెడుతూ జాతీయ పార్టీలకు గట్టిపోటీ ఇస్తూ ముందుకు సాగింది. 1987 ఆగష్టు నుంచి 1988 ఆగష్టు 15 వరకు ఒక సంవత్సరం పాటు బీఎస్‌పీ ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. అంటరానితనం, అత్యాచారాలు, అమానుషత్వం, అన్యాయాలు, అభద్రత అసమానతలను తొలగించడానికి, కాంగ్రెస్, బ్రహ్మణీయ శక్తుల అమానుషత్వాన్ని ప్రశ్నించడానికి ఉద్యమ కార్యాచరణ తయారు చేశారు. 1988 సెప్టెంబర్ 17న పెరియార్ జన్మదినాన్న సామాజిక పరిణామ ఉద్యమంగా ప్రారంభించాడు. 'మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయకుంటే గద్దె దిగిపోండి అనే నినాదంతో కాన్షీరామ్ 1989లో ఉద్యమం చేసాడు. వ్యవసాయ కూలీల కోసం కిసాన్ మజ్దూర్ ఉద్యమాన్ని చేసాడు. అంతేకాకుండా సఫాయి మజ్దూర్ ఆందోళన, చేతి వృత్తికారుల ఆందోళన, భాగీదారి ఆందోళన వంటి ఉద్యమాలు నడిపాడు. 1989 మార్చి 15న ఢిల్లీలో గొప్ప బహిరంగ సభ, ప్రదర్శన నిర్వహించి బహుజనులకు హక్కులు ఎంత అవసరమో పాలకులకు తెలియజేసాడు.

1993లో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో బీఎస్‌పీ, ఎస్పీ, సంకీర్ణ కూటమి విజయం సాధించి ములాయం సింగ్ ప్రభుత్వంలో బీఎస్‌పీ సభ్యులు మంత్రులుగా ఉండటం విశేషం, బహుజన సమాజ్ పార్టీని జాతీయ పార్టీగా తీర్చిదిద్దడంలో కాన్షీరామ్ నిరంతరం శ్రమించాడు. విజయం సాధించాడు. దేశంలో పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ఒక సామాన్య మహిళ, 'చమార్' స్త్రీని మూడు సార్లు ముఖ్యమంత్రిని చేసిన ఘనత పూర్తిగా కాన్షీరామ్‌దే. ఓట్ల రాజకీయాలను నోట్లు కలుషితం చేస్తూ కార్పొరేట్ రాజకీయాలు కొనసాగుతున్న తరుణంలో 'ఒక ఓటు ఒక నోటు' అనే నినాదంతో ప్రజల దగ్గరకు వెళ్లి వారిచ్చే డబ్బుతో ప్రచారం చేస్తూ ఉత్తరప్రదేశ్‌లో అధికారాన్ని సాధించి దేశ రాజకీయాలకు సరికొత్త విలువలు నేర్పిన మార్గదర్శకుడు కాన్షీరామ్. పదవులు ముఖ్యం కాదు బహుజన సమాజ్ నిర్మాణమే నా కర్తవ్యం అని భావించేవారు.

దేశ రాజకీయాల్లో కాన్షీరామ్ ప్రవేశం గొప్ప సంచలనం. అంబేద్కర్ కలలు నిజం చేయడానికి ముందుకురికిన రాజనీతిజ్ఞుడు. అన్ని రాజకీయ పార్టీలు వారి వారి పార్టీ స్థాపకుల ఫొటోలను వేదిక మీద ప్రదర్శిస్తుంటే కాన్షీరామ్ మాత్రం జాతిని చైతన్య పరిచిన బుద్ధుడు, పూలే, నారాయణగురు, పెరియార్, అంబేద్కర్ వంటి సామాజిక విప్లవకారుల చిత్రపటాలను బహిరంగ సభల్లో ప్రదర్శించేవారు.

ఉద్యమంలో తీరిక లేకుండా తిరగడం వల్ల ఆరోగ్యం క్షీణించింది. డాక్టర్లు ఎంత వారించినా ఆరోగ్యాన్ని లెక్క చేసేవాడు కాదు. నా జాతిజనుల కోసమే ఈ జీవితం అని క్షణం తీరిక లేకుండా పని చేశాడు. మధు మెహం శరీరాన్ని తినుకుంటూ వచ్చేసింది. 2003లో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. 2004లో మరోసారి అనారోగ్యం పాలయ్యాడు. అక్టోబర్ 9, 2006 కాన్షీరామ్ తీవ్రమైన గుండెపోటుతో మరణించారు. ఈ దేశాన్ని పాలించడమే లక్ష్యంగా రాజ్యాధికారం వైపు వెళితేనే బహుజనులకు భవిష్యత్తు ఉంటుందని స్పష్టంగా వివరించిన వారు కాన్షీరామ్. ఆయన మరణించినా ఆయన ఆశయం మరణించలేదు. కాబట్టి ప్రజలంతా కుల నిర్మూలన దృక్పథంతో తమ కుల అస్థిత్వాన్ని పక్కనపెట్టి బహుజన అస్థిత్వాన్ని సాధించేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

సెల్ : 9293762428

తన కూతురుతో చనువుగా ఉన్నాడని...

ఈర్నాల సంపత్

జగిత్యాల జిల్లాలో దళితుడి హత్య ● కోరలు చాచిన కుల వివక్ష



కుల వివక్ష మరోసారి కోరలు చాచింది. దేశం సాంకేతికంగా, నాగరికంగా అభివృద్ధిలో దూసుకుపోతోందని ఓ వైపు చెప్పుకుంటున్నా, క్షేత్రస్థాయిలో అనాగరిక మూలాలు ఇంకా బతికే ఉన్నాయి. దీనికి నిలువెత్తు నిదర్శనమే గత బుధవారం జగిత్యాల జిల్లాలో జరిగిన దళితుడి హత్య. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని తొంబర్రావుపేటకు చెందిన రాగుల సురేష్ డిగ్రీ పూర్తి చేసాడు. బతుకుదెరువు కోసం రెండేండ్లు దుబాయ్‌కి వెళ్లొచ్చాడు. తన ఊరికి కూతవేటు దూరంలో ఉన్న మేడిపల్లి మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. 2005లో తన మేనమామ కూతురు శైలజను ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. వీరికి 15 నెలల క్రితం కూతురు జన్మించింది.

ఇలా సంతోషంగా సాగిపోతున్న వీరి జీవితంలోకి కొత్త వ్యక్తి ప్రవేశించారు. అదే గ్రామంలోని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన స్రవంతి అనే యువతితో సురేష్‌కు పరిచయం ఏర్పడింది. తనకు కంప్యూటర్ నేర్పించాలని స్రవంతి సురేష్‌ను అడగడంతో సరేనన్నాడు. ఆ పరిచయం వారి మధ్య సాన్నిహిత్యానికి దారి తీసింది. ఆమెకు ఇదివరకే నిర్మల్‌కు చెందిన మరో వ్యక్తితో వివాహం జరిగింది. అనంతరం అతనితో విడాకులు తీసుకొని తన పుట్టింటి వద్దే నివసిస్తోంది. ఈ క్రమంలో దళితుడైన సురేష్‌తో సన్నిహితంగా ఉంటోందని గమనించిన తండ్రి గంగారెడ్డి తన కూతురిని సారంగాపూర్ మండలానికి చెందిన శ్రీధర్‌రావుకిచ్చి పెండ్లి చేశారు. మూడు నెలల తరువాత ఆమె కనిపించకుండా పోయింది. దీనికి కారణం సురేషేనని గంగారెడ్డి జగిత్యాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆమె తిరిగొచ్చి తను కనిపించకుండా పోవడానికి సురేష్ కారణం కాదని లిఖిత పూర్వకంగా పోలీసులకు రాసిచ్చింది. అనంతరం హైదరాబాదుకు వెళ్లి నివస్తోంది. ఈ క్రమంలో తనకు ప్రాణభయం ఉందని గ్రహించిన సురేష్ తన చిన్నమ్మ ఊరైన భీమారం నుండే రోజూ ఉద్యోగానికి వెళ్లి వస్తున్నాడు. బుధవారం తన పెండ్లి రోజు కావడంతో తన గ్రామానికి వచ్చి తిరిగి బైక్‌పై మేడిపల్లికి వెళ్తున్న తరుణంలో గంగారెడ్డి తన కొడుకు సంతోష్ రెడ్డితో కలిసి వేట కొడవలితో హత్య చేసాడు.

సెల్ : 7893989114



సురేష్ (ఫైల్)

అక్కసుతో చంపారు

నా తమ్ముడు డిగ్రీ చదివి కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆధారంగా ఉన్నాడు. గంగారెడ్డి కూతురితో ఒక దళితుడు చనువుగా ఉంటున్నాడన్న ఒకే ఒక్క కారణంతో నా తమ్ముడిని హతమార్చాడు. వారిపై చర్యలు తీసుకోవాలి.

నరేష్, సురేష్ అన్నయ్య

స్రవంతితో ఎలాంటి సంబంధమూ లేదు

నా భర్తకు స్రవంతితో ఎలాంటి సంబంధమూ లేదు. మూడేండ్ల క్రితం నన్ను సురేష్ ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. గంగారెడ్డి అతని కొడుకు సంతోష్‌రెడ్డి కులవివక్షతోనే నా భర్తను హతమార్చారు.

శైలజ, సురేష్ భార్య

నా కొడుకును అన్యాయంగా చంపారు

నా భర్త చనిపోయిన నుండి ఇద్దరు కుమారులను ఆప్యాయంగా పెంచుకుంటున్నాను. చిన్న కొడుకు సురేష్ కుటుంబ పోషణ కోసం తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. కూతురుతో చనువుగా ఉంటున్నాడనే నెపంతో గంగారెడ్డి నా కొడుకును అన్యాయంగా చంపేశారు. వారిపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవాలి.

తల్లి లక్ష్మి

వివక్షపూరితంగానే హత్య



సురేష్ హత్య అనుమానంతో జరిగింది. వివాహేతర సంబంధం రిత్యా ఈ హత్య జరగలేదు. సురేష్‌కు తనకు ఎలాంటి సంబంధం లేదని స్రవంతి జనవరి 16న పోలీసుల విచారణలో తేల్చిచెప్పింది. గత 15 రోజులుగా స్రవంతి కనబడకుండా వెళ్లినప్పుడు సురేష్ తహశీల్దార్ కార్యాలయంలో భూ ప్రక్షాళన రికార్డుల కంప్యూటరీకరణలో బిజీగా ఉన్నాడు. కాబట్టి కావాలనే వివక్షపూరితంగా దళితుడని తెలిసి చంపేసినా ఎవరు అడుగుతారులేనన్న అహంకారం, అగ్రకుల పెత్తందారితనంతో ఈ హత్య చేశారు. నిందితులిద్దరినీ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం శిక్షించాలి. సెక్షన్ 121 ప్రకారంగా బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలి. సురేష్ భార్య శైలజకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి.

స్కైలాబ్‌బాబు, కులవివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కవిరాజు ఉసురు తీసిన కులవివక్ష

టి.రామయ్య



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సురేష్ (ఇన్‌సెట్లో ఫైల్ చిత్రం)

మారుమూల ప్రాంతంలోని విద్యావంతుడు నిగూఢంగా కప్పిన నిప్పుకు ఆహుతి అయ్యాడు. ఐఏఎస్ కావాలని, కన్న తల్లిదండ్రులు, తోబుట్టువులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఆశించిన ఆ దళిత స్వప్నం ఆరిపోయింది. పట్టణంలో హాయ్ హాయ్ అంటూ అరమరికలు లేకుండా స్నేహితులతో గడిపిన విద్యా కుసుమం తాను జన్మించిన పల్లెలోనే రాలిపోయింది. నివురుగప్పిన నిప్పులా ఉడుకుతున్న కుల వివక్షకు కొందరు నాయకులు దాసోహం కావడంతో కిరోసిన్ పోసుకొని అగ్నికి ఆహుతి కావడం తప్ప మరేమీ లేకపోయింది. జయశంకర్ జిల్లా మహాముత్తారం మండలకేంద్రానికి చెందిన జాడి కవిరాజు (28) పోటీ పరీక్షల్లో నెగ్గి ఉన్నత చదువులు చదివాడు. కానీ గ్రామాలలో ఉన్న అంటరానితనానికి బలికావడం మారుమూల ప్రాంతంలో సంచలనం రేపింది.



మండల కేంద్రంలో ఐదో తరగతి, హుస్నాబాద్‌లో ఇంటర్మీడియట్, కరీంనగర్ ఎస్‌ఆర్ఆర్ కళాశాలలో డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చేసి సివిల్ సర్వీస్ ఎంపిక కోసం కోచింగ్‌కు వెళ్తున్నాడు. తన తల్లిదండ్రులను చూడడానికి ఇంటికి రాగా గ్రామంలో జరుగుతున్న అంటరాని వాసనను తన కొడుక్కి తాకకుండా తన తండ్రి జాడి నాగయ్య ప్రయత్నించాడు. కానీ పది సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన రంగు బాపుగౌడ్ (బీసీ కులం)కు చెందిన ఇంటి స్థలాన్ని జాడి నాగయ్య కొనుగోలు చేశాడు. అయితే కొనుగోలు చేసిన స్థలం మరో గౌడ కులానికి చెందిన మారగోని దుర్గయ్య ఇంటికి ఆనుకొని ఉంది. దీంతో 'నా ఇంటి పక్కన ఉండొద్దు, నీవు నేతకాని (దళిత) కులానికి చెందినవాడవు' అని నానా బూతులు తిడుతూ పలుమార్లు వ్యక్తిగత దూషణకు పాల్పడేవాడు. ఈ విషయం తన పిల్లలకు తెలువకుండా ప్రయత్నించిన జాడి నాగయ్య అనుకోని పరిస్థితిలో కవిరాజుకు వివరించాడు. దీంతో గ్రామీణ పోకడ తెలియని కవిరాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తన తల్లిదండ్రులతో వెళ్లి ఫిర్యాదు చేశాడు. పోలీసులు పట్టించుకోలేదు. దీంతో మళ్లీ ఫిబ్రవరి 19, 22వ తేదీలలో పోలీసులను ఆశ్రయించాడు. కానీ ఇక్కడే కథ అడ్డం తిరిగింది. రాజ్యాంగబద్ధంగా ఎంపీటీసీగా ఎన్నికై ప్రజలను సమాన భావంతో చూస్తాడనుకున్న ఎంపీటీసీ సభ్యుడు రంగప్రవేశం చేశాడు. నిందితులకు బంధువైన ఎంపీటీసీ రాముగౌడ్ బాధితుల పట్ల కర్కశంగా మాట్లాడాడు. పోలీస్‌స్టేషన్ నుంచి జాడి కవిరాజును బయటకు తీసుకొచ్చి 'నువ్వు కేసు పెడితే ఏమైతది, నీ గవాయిలను రూ.20 లక్షలు ఇచ్చి కొంట, నీ మీద లైంగిక వేధింపుల కేసు పెట్టిస్తా, నువ్వు కలెక్టర్ నౌకరు కోసం ప్రయత్నిస్తున్నావట, అక్రమ కేసులు పెట్టి జైలులో పెట్టిస్తా, నౌకరు రాకుండా చేస్తా' అని బెదిరించి కేసును విరమించుకుంటున్నట్టు తెల్ల కాగితంపై సంతకం చేయించుకున్నాడు. మళ్లీ అదే రోజు ఇంటికి రావడంతో మళ్లీ గౌడ కులానికి చెందిన మారగోని దుర్గయ్య, అతని భార్య, కుమారుడు తీవ్ర పదజాలంతో జాడి నాగయ్య కుటుంబాన్ని అవమానపరిచాడు. దీంతో కవి రాజు తన తల్లిదండ్రులు, తమ్ముడు, అక్కను కాటారంలోని సబ్‌డివిజన్ పోలీస్ అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేయడానికి తీసుకెళ్లాడు. అక్కడికి వెళ్లగానే ముందు వరుసలో ఉన్న సీఐ 'ఇక్కడికి ఎందుకు వచ్చారు, మీ స్టేషన్‌లో ఎస్ఐతో చెప్పుకోండి' అంటూ డీఎస్పీని కలవకుండా చేశాడని జాడి నాగయ్య తెలిపాడు. ఇక్కడ ఎస్ఐ పట్టించుకోకపోవడం, అక్కడ పోలీసు ఉన్నతాధికారి నిరాకరించడంతో కవిరాజు తన తల్లిదండ్రులతో ఇంటికి వస్తున్నాడు. దీంతో మండలస్థాయి నుంచి డివిజన్ స్థాయికి కేసు వెళ్లడంతో స్థానిక పోలీసులు స్టేషన్‌కు రమ్మని పలుమార్లు కవిరాజును చరవాణి ద్వారా ఒత్తిడి చేయడంతో ఇంటికి వచ్చి తీవ్ర మనస్తాపానికి గురై ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చి కవిరాజును రక్షించే ప్రయత్నం చేశారు. బాధితున్ని వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మార్చి 5 తెల్లవారు జామున మృతి చెందాడు.

సెల్ : 8179935162

కుల వివక్షను సహించేది లేదు

నవీన యుగంలో కుల, మతాల పేరుతో దళితులపై దాడులు చేయడం అమానుషం. కవిరాజు సంఘటనలు జరుగకుండా ప్రభుత్వం చట్టాలను కఠినతరం చేయాలి.

: కిరణ్, మాల మహానాడు యువజన నాయకుడు

ఇలాంటి విషాదం ఎవరికీ రాకూడదు




కూలి పని చేసుకొని తన కొడుకును పెద్ద చదువులు చదివించాను. చేతికందిన కొడుకు కుల మరకతో అందనంత దూరం వెళ్లిపోయాడు. నాలాంటి బాధ ఎవరికీ రాకూడదు.

: కవిరాజు తండ్రి నాగయ్య



కవిరాజు కుటుంబం నివసించే ఇల్లు

కుల వివక్షను రూపుమాపాలి



కుల వివక్షను రూపుమాపాలి. కులం, మతాల పేరుతో దాడులు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. రోజురోజుకూ ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వస్తున్నా ఇలాంటి దాడులు జరగడం హేయమైన చర్య. ఇలాంటి దాడులు భవిష్యత్‌లో జరగకుండా చూడాలి. కవిరాజు కుటుంబానికి తగిన న్యాయం చేయాలి. కుల వివక్షకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. వారికి సహకరిస్తున్న వారిని సైతం వదలకూడదు. మృతుడు కవిరాజు కుటుంబానికి 20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు వారి ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.

: గుర్రం దేవేందర్, భూపాలపల్లి కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి



ఆఖరి 12 బంతుల్లో 34 పరుగులు చేయాలి. అప్పడే జోరందుకు మనీశ్ పాండే సైతం నిష్క్రమించాడు. మరో ఎండ్‌లో విజయ్ శంకర్ బంతిని తాకేందుకు నానా తంటాలు పడుతున్నాడు. ఈ దశలో బంగ్లాదేశ్ విజయం లాంఛనమే అనిపించింది. కానీ దినేశ్ కార్తీక్ (29 నాటౌట్, 8 బంతుల్లో 2 ఫోర్లు,3 సిక్స్‌లు) విధ్వంసక ఇన్నింగ్స్‌తో మ్యాచ్ ఫలితాన్ని శాసించాడు. ఆఖర్లో హైడ్రామా చోటుచేసుకున్నా.. ఇన్నింగ్స్ ఆఖరి బంతిని సిక్సర్‌గా మలిచిన దినేశ్ కార్తీక్ టీమ్ ఇండియాకు మెరుపు విజయాన్ని అందించాడు. ముక్కోణపు టీ20 టోర్నీ ఫైనల్లో బంగ్లాదేశ్‌పై 4 వికెట్లతో గెలుపొందిన భారత్ నిదహాస్ ట్రోఫీని సొంతం చేసుకున్నది.

ముక్కోణం మనదే

- దినేశ్ కార్తీక్ హీరోయిక్ ఇన్నింగ్స్
- ఫైనల్లో బంగ్లాదేశ్‌పై మెరుపు విజయం
- రాణించిన రోహిత్ శర్మ, మనీశ్ పాండే
- నిదహాస్ ట్రోఫీ టీమ్ ఇండియా వశం

నవతెలంగాణ-కొలంబో

ఉత్కంఠగా సాగిన ముక్కోణపు టీ20 టోర్నీ ఫైనల్లో టీమ్ ఇండియా మెరుపు విజయం సాధించింది. చేజారిందనుకున్న ట్రోఫీ.. దినేశ్ కార్తీక్ మెరుపులతో మళ్లీ టీమ్ ఇండియా వశమైంది. 167 పరుగుల ఛేదనలో రోహిత్ శర్మ (56, 42 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్) అర్ధ సెంచరీతో లక్ష్యం దిశగా సాగిన భారత్.. మిడిల్ ఓవర్లలో తడబాటుకు గురైంది. ఆఖర్లో మ్యాచ్‌పై బంగ్లాదేశ్ పట్టు బిగించిన దశలో దినేశ్ కార్తీక్ హీరోయిక్ ఇన్నింగ్స్ భారత్‌ను విజేతగా నిలిపింది. 8 బంతుల్లోనే రెండు ఫోర్లు, మూడు సిక్సర్లు సంధించిన కార్తీక్ ఫైనల్లో సత్తా చాటాడు. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ షబ్బీర్ రెహమాన్ (77, 50 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించటంతో 166 పరుగులు చేసింది.

రాణించిన రోహిత్ : స్పిన్‌కు అనుకూలించిన పిచ్‌పై 167 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమ్ ఇండియాకు ఓపెనర్లు మంచి ఆరంభమే అందించారు. కెప్టెన్ రోహిత్ శర్మ (56, 42 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగాడు. స్పిన్నర్ మెహదిపై విరుచుకుపడ్డ రోహిత్ వేగంగా పరుగులు రాబట్టాడు. మరో ఎండ్‌లో శిఖర్ ధావన్ ఓ సిక్సర్‌తో జోరందుకున్నా.. వికెట్ నిలుపుకోలేకపోయాడు. షకిబ్ ఓవర్లో క్యాచౌట్‌గా నిష్క్రమించాడు. మూడోస్థానంలో వచ్చిన సురేశ్ రైనా (0) నిరాశపరిచాడు. మూడు బంతులాడిన రైనా... పరుగుల ఖాతా తెరవకుండానే వికెట్ సమర్పించుకున్నాడు. కెఎల్ రాహుల్ (24, 14 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి రోహిత్ ఇన్నింగ్స్‌ను మళ్లీ నిర్మించాడు. దీంతో మ్యాచ్ భారత్ వైపు మొగ్గింది. కానీ వెన్వెంటనే రాహుల్, రోహిత్‌లు వికెట్ కోల్పోయిన వేళ.. బంగ్లాదేశ్ పట్టు బిగించింది. ఈ తరుణంలో మనీశ్ పాండే (28), విజయ్ శంకర్ (17)లు వేగంగా పరుగులు చేయటంలో విఫలమయ్యారు. దీంతో సాధించాల్సిన రన్‌రేట్ సమీకరణం క్లిష్టతరంగా మారింది.

డికె విధ్వంసం : ముస్తాఫిజుర్ వేసిన ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో విజయ్ శంకర్ తొలి నాల్గు బంతులకు ఒక్క పరుగూ చేయలేకపోయాడు. ఐదో బంతికి గానీ సింగిల్ తీయలేకపోయాడు. ఆ ఓవర్ ఆఖరి బంతిని భారీ షాట్ ఆడిన మనీశ్ పాండే క్యాచౌట్‌గా నిష్క్రమించాడు. దీంతో సమీకరణం 12 బంతుల్లో 34 పరుగులకు మారింది. ఈ దశలో టీమ్ ఇండియా విజయం కష్టమే అనిపించింది. కానీ దినేశ్ కార్తీక్ (29 నాటౌట్, 8 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మ్యాచ్ స్వరూపాన్నే మార్చివేశాడు. వచ్చీ రాగానే వరుసగా ఓ సిక్సర్, ఫోర్, సిక్సర్ కొట్టిన డికె.. తను ఆడిన ఆరు బంతుల్లోనే 22 పరుగులు పిండుకున్నాడు. దీంతో ఆఖరి ఓవర్లో 12 పరుగులే అవసరమయ్యాయి. కానీ స్ట్రయిక్ ఎండ్‌లో విజయ్ శంకర్ మరోసారి తడబడ్డాడు. తొలి మూడు రెండు బంతుల్లో ఒకే పరుగు చేయగల్గిగాడు (ఓ వైడ్ కూడా వచ్చింది). మూడో బంతికి డికె సింగిల్ తీసుకోగా.. నాల్గో బంతికి విజయ్ బౌండరీ బాదాడు. దీంతో 2 బంతుల్లో ఐదు పరుగులు అవసరమయ్యాయి. ఐదో బంతికి విజయ్ శంకర్ క్యాచౌట్‌గా నిష్క్రమించాడు. దీంతో ఆఖరి బంతికి బౌండరీ కొడితే టై, సిక్సర్ సంధిస్తేనే విజయం. ఈ దశలో దినేశ్ కార్తీక్.. సౌమ్య సర్కార్ వేసిన బంతిని అలవోకగా బౌండరీ ఆవల పడేశాడు. కవర్ బౌండరీ దిశగా ఫ్లాట్ సిక్సర్ కొట్టిన కార్తీక్.. భారత్‌కు ఊహించని విజయాన్ని అందించాడు.

షబ్బీర్ మెరుపులు : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓ సిక్సర్‌తో హెచ్చరికలు జారీ చేసిన లిటన్ దాస్ (11), ఫామ్‌లో ఉన్న తమీమ్ ఇక్బాల్ (15)లు ఎంతోసేపు వికెట్ నిలుపుకోలేదు. పవర్ ప్లేలో సాఫీగా సాగుతున్న బంగ్లా ఇన్నింగ్స్‌ను స్పిన్నర్లు సుందర్, చాహల్‌లు దెబ్బకొట్టారు. వరుస వికెట్లతో బంగ్లాను వెనక్కి లాగారు. మిడిల్ ఆర్డర్‌లో సౌమ్య సర్కార్ (1), ముష్ఫికర్ రహీం (9) సైతం వెన్వెంటనే వికెట్లు కోల్పోయారు. 68/4తో బంగ్లాదేశ్ ఒత్తిడిలో పడింది. కానీ దశలో మూడో స్థానంలో వచ్చిన షబ్బీర్ రెహమాన్ (77, 50 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడేశాడు. ఏడు ఫోర్లు, నాల్గు సిక్సర్లు సంధించిన షబ్బీర్.. బంగ్లా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. కెప్టెన్ షకిబ్ అల్ హసన్ (7) నిరాశపరిచినా.. షబ్బీర్ జోరు తగ్గలేదు. 37 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసి ఆకట్టుకున్నాడు. పేసర్లను లక్ష్యంగా చేసుకొని షాట్లు ఆడిన షబ్బీర్ ఆ దిశగా విజయవంతమయ్యాడు. ఇతడికి మహ్మదుల్లా (21) నుంచి సహకారం లభించింది. పేస్ బౌలింగ్‌లో పరుగులొచ్చినా.. స్పిన్నర్లు బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేశారు. ఆఖరి ఓవర్లో మెహది హసన్ (19) రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌తో ఏకంగా 18 పరుగులు పిండుకున్నాడు. దీంతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 166 పరుగులు సాధించింది. భారత బౌలర్లలో యువ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ (20/1) మరోసారి పరుగుల పొదుపు పాటించాడు. వాషింగ్టన్ ఒత్తిడి పెంచగా.. మణికట్టు స్పిన్నర్ చాహల్ (3/18) వికెట్ల రూపంలో బంగ్లాను పడగొట్టాడు. శార్దూల్ ఠాకూర్ (0/45), విజయ్ శంకర్ (0/48) ధారాళంగా పరుగులిచ్చారు. ఉనద్కత్ సైతం ఆరంభంలో పరుగులిచ్చినా.. స్లాగ్ ఓవర్‌లో బంగ్లాను నిలువరించాడు.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ : తమీమ్ ఇక్బాల్ (సి) ఠాకూర్ (బి) చాహల్ 15, లిటన్ దాస్ (సి) రైనా (బి) వాషింగ్టన్ సుందర్ 11, షబ్బీర్ రెహమాన్ (బి) ఉనద్కత్ 77, సౌమ్య సర్కార్ (సి) ధావన్ (బి) చాహల్ 1, ముష్ఫికర్ రహీం (సి) శంకర్ (బి) చాహల్ 9, మహ్మదుల్లా రనౌట్ (కార్తీక్/శంకర్) 21, షకిబ్ అల్ హసన్ రనౌట్ (రోహిత్/శంకర్) 7, మెహిది హసన్ మిరాజ్ నాటౌట్ 19, రూబెల్ హొస్సేన్ (బి) ఉనద్కత్ 0, ముస్తాఫిజుర్ రెహమాన్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 06, **మొత్తం : (20 ఓవర్లలో 8 వికెట్లకు) 166.**

వికెట్ల పతనం : 1-27, 2-27, 3-33, 4-68, 5-104, 6-133, 7-147, 8-148.

బౌలింగ్ : జైదేవ్ ఉనద్కత్ 4-0-33-2, వాషింగ్టన్ సుందర్ 4-0-20-1, యుజ్వేంద్ర చాహల్ 4-0-18-3, శార్దూల్ ఠాకూర్ 4-0-45-0, విజయ్ శంకర్ 4-0-48-0.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) మహ్మదుల్లా (బి) నజ్ముల్ ఇస్లాం 56, శిఖర్ ధావన్ (సి) అరిఫుల్ హక్) (బి) షకిబ్ 10, సురేశ్ రైనా (సి) ముష్ఫికర్ రహీం (బి) రూబెల్ హొస్సేన్ 0, కెఎల్ రాహుల్ (సి) షబ్బీర్ రెహమాన్ (బి) రూబెల్ హొస్సేన్ 24 , మనీశ్ పాండే (సి) షబ్బీర్ రెహమాన్ (బి) ముస్తాఫిజుర్ రెహమాన్ 28, విజయ్ శంకర్ (సి) మెహది హసన్ (బి) సౌమ్య సర్కార్ 17, దినేశ్ కార్తీక్ నాటౌట్ 29, వాషింగ్టన్ సుందర్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 04, **మొత్తం : (20 ఓవర్లలో 6 వికెట్లకు) 168.**

వికెట్ల పతనం: 1-32, 2-32, 3-83, 4-98, 5-133, 6-162.

బౌలింగ్ : షకిబ్ అల్ హసన్ 4-0-28-1, మెహది హసన్ మిరాజ్ 1-0-17-0, రూబెల్ హొస్సేన్ 4-0-35-2, నజ్మల్ ఇస్లాం 4-0-32-1, ముస్తాఫిజుర్ రెహమాన్ 4-1-21-1, సౌమ్య సర్కార్ 3-0-33-1.



అమ్మాయిలకు భంగపాటు


- మూడో వన్డేలోనూ తప్పని ఓటమి
- 0-3తో ఆసీస్ చేతిలో వైట్‌వాష్

వడోదర : విదేశీ గడ్డపై గొప్ప విజయాలు సాధించిన ఊపుమీదున్న మిథాలీరాజ్ సేన.. ఆశ్చర్యకరంగా స్వదేశంలో చతికిల పడింది. ఆస్ట్రేలియాతో మూడు మ్యాచుల వన్డే సిరీస్‌ను టీమ్ ఇండియా అమ్మాయిలు వైట్‌వాష్ ఓటమితో కోల్పోయారు. వడోదరలో జరిగిన మూడో వన్డేలోనూ ఆస్ట్రేలియా అమ్మాయిలు విజయం సాధించి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేశారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 332/7 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ అలిసీ హీలే (133, 115 బంతుల్లో 17 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకంతోత చెలరేగింది. భారీ ఛేదనలో టీమ్ ఇండియా 235 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు రొడ్రిగస్ (42), స్మృతి మంధాన (52) రాణించినా.. తర్వాత ఎవ్వరూ క్రీజులో నిలబడలేదు. కెప్టెన్ మిథాలీరాజ్ (21), హర్మన్‌ప్రీత్ కౌర్ (25) నిరాశపరిచారు. ఇక ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలు పాల్గొంటున్న ముక్కోణపు టీ20 సిరీస్ ముంబయిలో ఈ నెల 22 నుంచి ఆరంభం కానున్నది. తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో టీమ్ ఇండియా అమ్మాయిలు తలపడనున్నారు.

మహి స్థానం భర్తీచేయలేనిది!

- ధోనిపై కోహ్లి అభిప్రాయమిదే
- పాలకుల కమిటీ చైర్మెన్ వినోద్ రాయ్

ముంబయి : సహజంగా జట్టులో ఇద్దరు అగ్రశ్రేణి, స్టార్ ఆటగాళ్లు ఉన్నవేళ రెండు అధికార కేంద్రాలు లేదా గ్రూపులు ఉండటం సహజమే. జట్టు నాయకుడిగా తిరుగులేని విజయాలకు తోడు సుదీర్ఘ కాలం కెప్టెన్‌గా కొనసాగిన ఆటగాడు జట్టులో ఉంటే.. అతడితో ప్రస్తుత సారథికి కాస్త ఇబ్బందికర పరిస్థితే!. భారత క్రికెట్ ఇటువంటి పరిణామాలను గతంలో ఎన్నోసార్లు చవిచూసింది. కానీ ప్రస్తుత టీమ్ ఇండియా డ్రెస్సింగ్‌రూమ్ పరిస్థితి ఇందుకు ఎంతో భిన్నం. దిగ్గజ సారథి ఎం.ఎస్ ధోనితో యువ నాయకుడు విరాట్ కోహ్లి స్నేహబంధం అనిర్వచనీయం. ధోని బంధాన్ని ఎవ్వరూ చెరపలేరని గతంలో స్వయంగా కోహ్లియే సెలవిచ్చాడు. తాజాగా పాలకుల కమిటీ చైర్మెన్ వినోద్ రాయ్ అదే విషయాన్ని వెల్లడించారు. ధోని, కోహ్లి బంధం ఎంతో గొప్పదని, వారిద్దరి మధ్య అభిప్రాయలు పంచుకునే విధానం సైతం ఎంతో ఉన్నతమైనదని రాయ్ తెలిపారు. ధోనిపై కోహ్లి తనతో పంచుకున్న అభిప్రాయాలను రాయ్ వెల్లడించాడు. 'ధోని, కోహ్లి స్నేహం ఎంతో ఉన్నతమైనది. ఇద్దరూ ఒకరి పట్ల మరొకరు ఎంతో గౌరవంతో ఉంటారు. ధోని క్రికెటింగ్ నైపుణ్యంపై కోహ్లి గౌరవం ఉండగా.. ఆటగాడిగా విరాట్ ఘనతలపై ధోనికి గౌరవం ఉంది' అని రాయ్ తెలిపాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఎం.ఎస్ ధోని ఎందుకు విలువైన ఆటగాడో కోహ్లి నాతో చెప్పాడు. వికెట్ల వెనకాల ధోనికి మించిన వేగంతో మరొకరు లేరు, అతడి క్రికెటింగ్ బుర్ర జట్టుకు ఎంతో ఉపయుక్తం. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఎం.ఎస్ ధోని స్థానం భర్తీచేయలేనిదని కోహ్లి చెప్పాడని రాయ్ అన్నాడు. దక్షిణాఫ్రికా పర్యటన నుంచి తిరిగొచ్చిన తర్వాత కోహ్లి, ధోనిలు ఇద్దరూ విశ్రాంతి తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో ప్రస్తుతం శ్రీలంకలో జరిగిన ముక్కోణపు టీ20 సిరీస్‌లో ఈ ఇద్దరు స్టార్ ఆటగాళ్లు లేకుండా టీమ్ ఇండియా అక్కడికి వెళ్లింది. ధోని, కోహ్లి తిరిగి ఐపీఎల్‌లోనే మళ్లీ మైదానంలో కనువిందు చేయనున్నారు.



కామన్‌వెల్త్‌పై ఆశలతో..

ఆల్ ఇంగ్లాండ్ ప్రదర్శన సంతృప్తికరం

నవతెలంగాణ క్రీడా విభాగం

ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్స్. బ్యాడ్మింటన్‌లో గ్రాండ్‌స్లామ్ అనదగిన ప్రతిష్టాత్మక టోర్నీ. ఒలింపిక్ స్వర్ణానికి ఉన్న వన్నె, ప్రాముఖ్యత ఈ టైటిల్‌కు ఉంటుంది. ప్రతి బ్యాడ్మింటన్ ప్లేయర్ సాధించాలని స్వప్నించే ట్రోఫీ ఇది. భారత షట్లర్ల బృందం ఇటీవల వరుసగా సరికొత్త రికార్డులు నెలకొల్పుతుంది. అనితర సాధ్యం కాని విజయాలతో దూసుకెళ్తోంది. కానీ ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ మాత్రం ఈ తరానికి ఇంకా అందని ద్రాక్షలాగే మిగిలింది!. ఈ ఏడాది ఆల్ ఇంగ్లాండ్‌లో మన షట్లర్ల పోరు సెమీఫైనల్లోనే ముగిసినా.. ఓవరాల్ ప్రదర్శన సంతృప్తికరమే. మరో 15 రోజుల్లో ఆరంభం కానున్న కామన్‌వెల్త్ క్రీడల్లో పతకం భరోసా ఇచ్చే ప్రదర్శన మనోళ్లు చేసేశారు!.

గోల్డ్‌కోస్ట్ కామన్‌వెల్త్ క్రీడలు ఏప్రిల్ 4 నుంచి ఆరంభం కాబోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్‌లో మనకు పతకం రాకపోయినా.. రానున్న టోర్నీలో పతక ప్రదర్శన ఖాయమేనని అనిపిస్తోంది. పి.వి సింధు బర్మింగ్‌హామ్‌లో ఆరుసార్లుగా క్వార్టర్‌ఫైనల్స్ అడ్డంకి దాటలేదు. కానీ ఈసారి సెమీఫైనల్లోకి చేరుకున్నది. క్వార్టర్స్‌లో వరల్డ్ చాంపియన్ నొజొమి ఒకుహరతో మరో సూపర్ ఫైట్‌లో పైచేయి సాధించిన సింధు.. సెమీస్‌లోనూ సూపర్ ప్రదర్శన చేసింది. వరల్డ్ నెం.2 యమగూచిని దాటేసినట్టే అనిపించినా.. ఆఖర్లో ఫలితం మరోలా వచ్చింది. అయినా, భారత బ్యాడ్మింటన్ అభిమానులు నిరాశపడాల్సిన అవసరం ఏమీ లేదు. ఓడినా, సూపర్ ఫామ్‌లో కొనసాగుతున్న పి.వి సింధు గోల్డ్‌కోస్ట్‌లో స్వర్ణం రేసులో హాట్‌ఫేవరేట్. గ్లాస్గో కామన్‌వెల్త్ మహిళల సింగిల్స్‌లో సింధు కాంస్యం సాధించింది. ఈసారి స్వర్ణ రేసులో సహచర షట్లర్ సైనా నెహ్వాలే ఆమెకు ప్రధాన ప్రత్యర్థి. రియో ఒలింపిక్స్ నుంచి ఫామ్ లయ కోల్పోయిన సైనా నెహ్వాల్.. ఆల్ ఇంగ్లాండ్‌లోనూ పుంజుకోలేదు. తొలి రౌండ్‌లోనే వరల్డ్ నం.1 థాయ్ జు యింగ్ చేతిలో కంగుతిన్నది. ప్రస్తుతం సైనా నెహ్వాల్ టాప్-10లో భాగం కాని షట్లర్. సైనా ఆట ఆందోళకరంగానే ఉన్నా.. సింధు ఫామ్ అభిమానులకు గోల్డ్ గ్యారెంటీ అందిస్తోంది!.

ఇక పురుషుల విభాగంలో గాయంతో రెండు నెలల విరామం తర్వాత కోర్టులోకి అడుగుపెట్టిన హెచ్.ఎస్ ప్రణయ్ ఆల్ ఇంగ్లాండ్‌లో క్వార్టర్‌ఫైనల్స్ వరకూ చేరుకున్నాడు. మూడు గేముల పోరాటంలో తృటిలో



సెమీస్ బెర్త్ చేజార్చుకున్నా.. ప్రణయ్ ప్రదర్శన అద్భుతం. గతంలో గాయంతో మూడు నెలలు ఆటకు దూరమైన ప్రణయ్ పునరాగమనంలో వరుసగా లీగ్ చో వీ, లిన్ డాన్‌లపై మెరుపు విజయలు నమోదు చేశాడు. ఇండోనేషియాలో నిరుడు ప్రణయ్ ప్రదర్శన అమోఘం. ఇప్పుడు ఆల్ ఇంగ్లాండ్‌లోనూ ప్రణయ్ అదే జోరు చూపించే ప్రయత్నం చేశాడు. ఫలితం అనుకూలంగా లేకపోయినా.. ప్రణయ్ ప్రదర్శన సానుకూలాంశం. కామన్‌వెల్త్ గోల్డ్ రేసులో శ్రీకాంత్‌తో పాటు లీగ్ చోంగ్ వీలు ప్రణయ్‌కు ప్రధాన ప్రత్యర్థులు. ఇక నిరుడు నాల్గు సూపర్ సిరీస్ టైటిళ్లు సాధించిన కిదాంబి శ్రీకాంత్.. మెగా టోర్నీల్లో వైఫల్య యాత్ర కొనసాగించాడు. నిరుడు వరల్డ్ చాంపియన్‌షిప్స్, ప్రపంచ సూపర్ సిరీస్ ఫైనల్స్‌లో అలవోక డ్రాలు ఎదురైనా శ్రీకాంత్ తడబడ్డాడు. తాజాగా ఆల్ ఇంగ్లాండ్‌లోనూ శ్రీకాంత్ సులభమైనా డ్రా ఎదురైనా క్వార్టర్స్‌కు చేరుకోలేదు. అనామక షట్లర్ చేతిలో ఓటమిపాలయ్యాడు. సింధు, ప్రణయ్, శ్రీకాంత్‌ల మ్యాచ్ ఫలితాలు చేదుగా ఉన్నా.. టోర్నీలో వారి దూకుడైన ప్రదర్శన అభిమానులకు సంతృప్తినిచ్చింది. వచ్చే నెలలో ఆరంభం కానున్న కామన్‌వెల్త్ క్రీడల్లో మూడు పతకాలకు ఈ ముగ్గురు షట్లర్లు భరోసా ఇచ్చినట్టే భావించవచ్చు!

'మూడు గేముల మ్యాచ్ ఆడటం అంత సులభమైన విషయం కాదు. ఆఖర్లో 2-3 పాయింట్లే ఎంతో వ్యత్యాసం చూపిస్తాయి. ఆఖరున ఎవరైనా గెలిచేందుకు అవకాశం ఉంటుంది. ఆల్ ఇంగ్లాండ్‌లో ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ఓడినా, గెలిచినా.. బర్మింగ్‌హామ్ ప్రదర్శన సంతృప్తికరం. రానున్న టోర్నీల్లో మరింత ధృడంగా సిద్ధమైన రావాల్సిన అవసరం ఉంది' - పి.వి సింధు

ఇరానీ కప్ విజేత విదర్భ

నాగ్‌పూర్ : మూడు మాసాల క్రితం తొలిసారి రంజీ విజేతగా నిలిచిన విదర్భ... అక్కడితో ఆగిపోలేదు. రెస్టాఫ్ ఇండియాను ఓడించి తొలిసారి ఇరానీ కప్‌ను సైతం సొంతం చేసుకున్నది. వసీం జాఫర్ (286), వాంఖడే (157), గణేశ్ (120)లకు తోడు పేసర్ రజ్నీష్ గుర్బానీ (4/70) రాణించటంతో తొలి ఇన్నింగ్స్‌లో 800/7 భారీ స్కోరు సాధించిన విదర్భ.. రెస్టాఫ్ ఇండియాను 390 పరుగులకే కుప్పకూల్చింది. రెండో ఇన్నింగ్స్‌లో 79/0తో వికెట్ కోల్పోని విదర్భ.. ఐదో రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఇరానీ కప్ దక్కించుకున్నది. భారీ డబుల్ సెంచరీ బాదిన వసీం జాఫర్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.